అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 17-2-2023

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 8 సంచిక : 347 | Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు వెల : 6.50



నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

వాయు కాలుష్య నివారణకు రూ. 696 కోట్ల ప్రాజెక్టు

సింగరేణి థర్మల్ విద్యుత్కేంద్రంలో తొలి ఎఫ్జీడీ ఏర్పాటు

- గడువులోపే పనులు పూర్తిచేయాలి : ఎమ్‌డీ ఎన్. శ్రీధర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సంపూర్ణ కాలుష్య రహిత కేంద్రంగా తీర్చిదిద్దడానికి వీలుగా రూ.696 కోట్ల వ్యయంతో ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్జీడీ) అనుబంధ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్టు సింగరేణి సంస్థ చైర్మెన్, ఎమ్‌డీ ఎన్.శ్రీధర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణ రావు, థర్మల్ ప్లాంట్ అధికారులు, నిర్మాణ ఏజెన్సీలతో ఎమ్‌డీ సుదీర్ఘంగా సమీక్షించారు. పనులు గడువు కన్నా ముందే పూర్తిచేయాలని నిర్మాణ సంస్థ అయిన పీఈఎస్ ఇంజినీర్స్ ప్రయివేటు లిమిటెడ్స్‌ను ఆదేశించారు. యూనిట్ ఒకటికి సంబంధించిన ఎఫ్జీడీని 2024 జూన్ కల్లా, రెండో యూనిట్‌ను అదే ఏడాది సెప్టెంబర్ లోపు పూర్తి చేయాలని ఆయన కాలపరిమితిని నిర్దేశించారు. ఈ సమీక్ష జీఎం (కోఆర్డినేషన్) ఎం. సురేష్, చీఫ్ టెక్నికల్ కన్సల్టెంట్ సంజయ్ కుమార్ సూర్, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం జనరల్ మేనేజర్ డి.ఎస్. సూర్యనారాయణ రాజు, చీఫ్ ఆఫ్ పవర్ ఎన్.వి.కె. విశ్వనాథరాజు, సివిల్ ఏజీఎం ప్రసాద్, ఎఫ్జీడీ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, కన్సల్టెంట్ (ఎన్.టి.పి.సి) సోహైల్ ఖాన్, నిర్మాణ ఏజెన్సీ (పి.ఈ.ఎస్) ఎమ్‌డీ వాసుదేవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్జీడీతో వాయు శుద్ధి ప్రక్రియ ఇలా...

ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్‌గా పిలవబడే ఈ ప్రాజెక్టులో భాగంగా బొగ్గును మండించగా వచ్చే వాయువులో దాగి ఉన్న సల్ఫర్ అనుబంధ వాయువులను వేరుచేస్తారు. దానికోసం 150 మీటర్ల ఎత్తయిన ఒక చిమ్నీని ఏర్పాటు చేస్తారు. ఈ చిమ్నీలో కింది నుంచి పైకి వెళ్లే వాయువుపై కాల్షియం కార్బోనేట్ (తడి సున్నం)ను పైనుంచి బలంగా పంపిస్తారు. తద్వారా బొగ్గు మండించిన వాయువుల్లో ఉన్న సల్ఫర్ డయాక్సైడ్‌తో పలుదశల్లో తడి సున్నంతో రసాయనిక చర్య జరుగుతుంది ఈ ప్రక్రియలో వాయువులో ఉన్న సల్ఫర్ అనుబంధ వాయువులన్నింటినీ తడి సున్నం పీల్చుకుంటుంది.

తత్ఫలితంగా బయటకు విడుదల చేస్తున్న వాయువులలో సల్ఫర్ అనుబంధ వాయువుల శాతం ఘనపు మీటరుకు 200 మిల్లీ గ్రాములలోపే ఉంటుంది. ఈ రసాయనిక ప్రక్రియలో అంతిమంగా కాల్షియం సల్ఫేట్ అనే ఘన పదార్థం ఏర్పడుతుంది. దీనినే జిప్సం అంటారు. ఈ ప్రక్రియలో వెలువడే జిప్సాన్ని ఎరువులు, సిమెంటు, పేపర్, వస్త్ర పరిశ్రమ, నిర్మాణరంగంలో వినియోగిస్తున్నారు.

మతోన్మాదం పేరుతో దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

పోరాడుతూనే వారి హిందూత్వ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. మోడీ మాట్లాడితే దేశ ఆర్థిక వ్యవస్థ ఐదో, మూడో స్థానంలో ఉందని ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. హిందూత్వం అంటే సామాజిక దోపిడీ అమలు చేయడమేనని వివరించారు. ఆహార భద్రత అంశంపై ప్రొఫెసర్ మధుర స్వామినాథన్ మాట్లాడుతూ దేశంలో ఆహార భద్రత అవసరాన్ని వివరించారు. ఆహార భద్రత అంటే భౌతికంగా అవసరాలు తీరడమే కాదని, ఆర్థికంగా అలసరాలు తీరాలని అన్నారు. సరైన ఆహారం, పౌష్టికాహారం ప్రజలకు అందాలన్నారు. నీరు, శానిటేషన్ మెరుగ్గా కల్పించాలన్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండి 240 కోట్ల టన్నుల దిగుబడి వచ్చిందని, అయినా పౌష్టికాహారాన్ని అందించలేకపోతున్నామని తెలిపారు. ఆహార భద్రత విషయంలో 150 దేశాల్లో మనదేశం 137 స్థానంలో ఉందని, నేపాల్, బంగ్లాదేశ్‌కన్నా తక్కువస్థాయిలో ఉన్నామని చెప్పారు. గ్రామీణ ఉపాధి రోజురోజుకూ తగ్గుతున్న విషయాన్ని గుర్తుచేశారు. వ్యవసాయేతర రంగాల్లోనూ ఉపాధి క్షీణించిందని, మహిళలు వలస బాట పడుతున్నారని అన్నారు. వేతనాల్లోనూ పురుషులకు మహిళలకు మధ్య వ్యత్యాసం చాలా తీవ్రంగా ఉందని అన్నారు. వేతనాల్లోనూ వ్యత్యాసం ఉందని 360 రూపాయలు పురుషులకు ఉంటే 269 రూపాయలు మహిళలకు ఇస్తున్నారని తెలిపారు. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వేతనాలు చాలా తక్కువ అన్నారు. జమ్మూకాశ్మీర్, పంజాబ్, తమిళనాడు, హర్యానాలో వేతనాలు ఫర్వాలేదని వివరించారు. 2011-12 లెక్కల ప్రకారం ఆహార సంక్షోభం తీవ్రమైందని అన్నారు. ప్రజాపంపిణీలో కనీసావసర వస్తువులు కూడా సరఫరా చేయాలన్నారు. భూ పంపిణీపై ప్రొఫెసర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో 1.20 కోట్ల ఎకరాల సాగుకు ఉపయోగపడే మిగులు భూమి ఉందనీ, దాన్ని పంచడంలో ఇప్పటి వరకూ ఎవరూ ఆసక్తి చూపలేదని తెలిపారు. పైగా పరిశ్రమలకు కేటాయించేసి గ్రామీణ ప్రాంత ప్రజలను తీవ్ర ఇబ్బందులు పాల్జేస్తున్నారని చెప్పారు. భూదాన్ భూములను చెప్పినా అవి ఎక్కడ ఉన్నాయో ఎవరి చేతుల్లో ఉన్నాయో ఇప్పటికీ లెక్క తెలియదని వివరించారు. భూ సంస్కరణల అమల్లోనూ తీవ్రలోపం జరిగిందని అన్నారు. ఏపీ తెలంగాణాలో 54శాతం భూమిలేని పేదలు ఉన్నారని వివరించారు. రాజ్యాంగంపై దాడి అనే అంశంపై వికాస్ రంజన్ భట్టాచార్య మాట్లాడుతూ దోపిడీకి, మతోన్మాదానికి వీలుగా రాజ్యాంగాన్ని మార్చేస్తున్నారని తెలిపారు. ప్రశ్నించిన వారిని చంపడమో, అరెస్టులు చేయడం ద్వారా వారి పంతాన్ని నెగ్గించుకునేదిశగా పాలన చేస్తున్నారని విమర్శించారు. విజయరాఘవన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టును ఆయుధంగా వాడుకుంటున్న భారత వ్యతిరేక శక్తులు

- ఎడిటోరియల్‌లో ఆరెస్సెస్ ఆరోపణ

ఢిల్లీ : భారత్‌లో సమాజశ్రేయస్సు కోసం ప్రజాస్వామ్యయుత పద్ధతిలో పోరాడుతున్న హక్కుల కార్యకర్తలు, సామాజికవేత్తలు, పర్యావరణవేత్తలను ఆరెస్సెస్ తన ఎడిటోరియల్‌లో దేశవ్యతిరేక శక్తులుగా అభివర్ణించింది. వీరంతా భారత సుప్రీంకోర్టును ఒక ఆయుధంగా వాడుకుంటూ దేశ ప్రగతిని అడ్డుకుంటున్నారని పేర్కొన్నది. ఆరెస్సెస్ అనుబంధ మ్యాగజైన్ పాంచజన్యలో వచ్చిన ఎడిటోరియల్‌లో ఈ విధంగా ప్రస్తావించింది. "మానవ హక్కుల పేరుతో ఉగ్రవాదులను రక్షించిన ప్రయత్నాల తర్వాత.. పర్యావరణ: పేరుతో ఇప్పుడు భారత వృద్ధిని అడ్డుకుంటూ ఇబ్బందులు కలగజేస్తున్నారు" అని ఆరెస్సెస్ ఆరోపించింది.

ఇటీవల దేశంలో సంచలనం సృష్టించిన మోడీపై బీబీసీ డాక్యుమెంటరీని కేంద్రం కట్టడి చేసిన విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులు జారీ చేసిన అంశానికి సంబంధించి ఎడిటోరియల్‌లో సంఘ్ పై విధంగా పేర్కొనడం గమనార్హం. దేశవ్యతిరేక శక్తులు మన ప్రజాస్వామ్యంలోని నిబంధనలను అనుకూలంగా మార్చుకుంటున్నాయని తెలిపారు. బీబీసీ డాక్యుమెంటరీ ఒక కల్పితగాథ అనీ, భారత ప్రతిష్టను దిగజార్చే చర్య ఇది అని ఎడిటోరియల్‌లో వివరించింది.

కేసీఆర్ గొప్ప దార్శనికుడు

- మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేసీఆర్ గొప్ప దార్శనికుడని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన 14 ఏండ్లపాటు ఉద్యమం నడిపారని గుర్తుచేశారు. కేసీఆర్ తొమ్మిదేండ్ల తన పాలనతో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపారని పేర్కొన్నారు. విద్య, వైద్యం, విద్యుత్, ఉపాధి, వ్యవసాయ రంగాల్లో అనతికాలంలోనే ఊహించని చారిత్రక మార్పులను తెలంగాణ సాధించిందని తెలిపారు.

నేడు పీవీ మార్గ్‌లో వేడుకలు..

సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పీవీ మార్గ్ లోని సంజీవయ్య పార్కులో నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి, ఇతర మంత్రుల లతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ చైర్మెన్‌లు పాల్గొంటాని తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు మంత్రి తలసాని ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ జన్మదినం సందర్భంగా కోలేటి పౌండేషన్ చీరల పంపిణీ..

సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోదర్ తన పౌండేషన్ ద్వారా చీరల పంపిణీ చేపట్టారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నలుగురు నామినేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి తొలిరోజు నలుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. నలుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని వివరించారు. వారిలో కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి రెండు సెట్లు, అన్వర్ ఖాన్ రెండు సెట్లు, బి భుజంగరావు, గుర్రం చెన్నకేశవరెడ్డి ఒక్కో సెట్ నామినేషన్లను సమర్పించారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొదటి రోజు నామినేషన్లు దాఖలు కాలేదని తెలిపారు.

ప్రాజెక్టులను పరిశీలించిన పంజాబ్ సీఎం భగవంత్‌సింగ్‌మాన్

- జలవనరుల పరిరక్షణ చర్యలపై అధ్యయనం

నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని కొండపోచమ్మ ప్రాజెక్టును పంజాబ్ సీఎం భగవంత్ సింగ్‌మాన్ గురువారం పరిశీలించారు. రాష్ట్రంలో భూగర్భ జలాల పరిరక్షణ చర్యలను అధ్యయనం చేసేందుకు పంజాబ్ సీఎం నేతృత్వంలోని అధికారుల బృందం సిద్ధిపేట జిల్లాలో పర్యటించింది. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ కుమార్ కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు రిజర్వాయర్ల గురించి సీఎం భగవంత్ సింగ్‌మాన్‌కు వివరించారు. రాష్ట్రంలో చేపట్టిన జలవనరుల పథకాలను మ్యాప్‌లు, చార్టులతో వివరించారు. కాళేశ్వరం నుంచి 618 మీటర్ల ఎత్తులో కొండపోచమ్మ సాగర్ ఉందని, 15 టీఎంసీల సామర్థ్యంతో ఈ రిజర్వాయర్ నిర్మించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టు 2,85,280 ఎకరాలకు సాగునీటిని అందిస్తుందని తెలిపారు.

అనంతరం ఎర్రవల్లి- నరసన్నపేట గ్రామాల మధ్యలో చెక్‌డ్యాంను పంజాబ్ సీఎం పరిశీలించారు. గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా పంజాబ్ సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం భూగర్భ జలాల పరిరక్షణకు అనేక చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణలో మిషన్ కాకతీయ కింద చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యాంల నిర్మాణం పనులు బాగున్నాయని కితాబిచ్చారు. ఆయన వెంట గడ అధికారి ముత్యంరెడ్డి, ఆర్డీవో విజయేందర్ రెడ్డి, దత్తత గ్రామాల సర్పంచ్ మొండి భాగ్యబిక్షపతి, మాధవి రాజిరెడ్డి, ఎంపీటీసీలు గోలినేందర్, ధనలక్ష్మి కృష్ణ, మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి తదితరులున్నారు.

శాస్త్రవేత్తల్లో మరింత సృజనాత్మకత పెంచాలి

- కేంద్ర మంత్రి జితేంద్రసింగ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాస్త్రవేత్తలు మరింత సృజనాత్మకతను, నైపుణ్యాన్ని పెంచుకోవాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ కోరారు. ప్రజలకు కొత్త ఆలోచనా నైపుణ్యాలను అందించేందుకు అన్ని విధాలా వారు కృషి చేయాలన్నారు. అందుకు ప్రభుత్వ ప్రయివేటు రంగాల సహకారాన్ని పెంచాల్సిన అవసర ముందని తెలిపారు. ఇందులో భాగంగా సమర్థవంతమైన నాయకత్వానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా బెల్లా విస్టా క్యాంపస్‌లో నాయకత్వంపై నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు.

క్షేత్రస్థాయిలో తప్పని సరిగా పర్యటించాలి

- ప్రజా సమస్యలను తెలుసుకోవాలి
- ఎస్పీలు, సీపీలకు

డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలు



నవతెలంగాణ -ప్రత్యేక ప్రతినిధి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించడానికి ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ ఆదేశించారు. గురువారం తన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. రాష్ట్ర పోలీసు ప్రతిష్టను ఇనుమడింపజేయడానికి అవసరమైన చర్యలను ఎప్పటికప్పుడు చేపట్టాలని కోరారు. కొత్తగా పోలీసు శాఖలో చేరబోయే ట్రైనీ కానిస్టేబుళ్ల, ఎస్ఐలకు ట్రైనింగ్ ఇచ్చే కళాశాలలో మౌళిక సదుపాయాల ఏర్పాటు, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు శాంతి భద్రతలు సవ్యంగా ఉంచాల్సిన, తీసుకోవలసిన చర్యలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అవసరమైన బడ్జెట్ తదితర అంశాలపై ఆయన ఎస్పీలు, సీపీలతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర పోలీసు శాఖను మరింతగా పటిష్ఠ పరచడానికి అవసరమైన నిధులు, కొత్తగా పోలీసు అధికారులు, సిబ్బంది నియామకాలకు ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసు శాఖకు ఎంతగానో తోడ్పాటును అందచేస్తున్నారని అన్నారు.

ఈ విధంగా ఏ రాష్ట్రంలోనూ పోలీసు శాఖకు ప్రభుత్వం అండగా నిలబడలేదని అంజనీ కుమార్ చెప్పారు. కొత్తగా నియమితుల వుతున్న ఎస్ఐ, కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ పూర్తి కావస్తున్నదనీ, వీరికి శిక్షణను ఇవ్వడానికి అవసరమైన సౌకర్యాలను పీటీసీలలో వెంటనే ఏర్పాటు చేసి సిద్ధంగా ఉండాలని ఆయన అధికారుల ను కోరారు. ప్రతి పోలీసు ట్రైనింగ్ కాలేజీలో టాయ్‌లెట్లు సరిగా నిర్వహించాలనీ, విద్యుత్ సౌకర్యం సరిగా ఉంచేలా చూసుకోవాలని వీటితో పాటు ఇతర సౌకర్యాలపైనా శ్రద్ధ వహించాలని ఆయన తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు & భవనాల శాఖ
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీస్
"ఇ" ఎన్ఐటి నెం.79/ఇఎన్సి (ఎస్ఆర్& సిఆర్ఎన్) ఎస్ఇ (డి&పి)-2/ఇఇ(ఆర్)/డిఇఇ-2/డిఇఇ1/ 2022-23 తేది:13-02-2023
యాదాద్రి భువనగిరి జిల్లాలో (ఎండిఆర్ ప్లాన్ పనుల్లో భాగంగా) ఒక హెచ్ఎల్‌వి పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ప్రకారం ఆన్‌లైన్ టెండర్లను (మొదటి కాల్ కొరకు) ఆహ్వానిస్తున్నాం. టెండర్లర్లంతా టెండర్ షెడ్యూల్ కోసం https://tender.telangana.gov.in వద్ద సందర్శించి డౌన్‌లోడ్ చేసుకొని పొందవచ్చును. చివరి తేది:02-03-2023.
సం/-
ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఆర్&బి) స్టేట్ రోడ్స్ & సిఆర్ఎన్
DIPR. R.O.No. 3530-DP/CL/ADVT/1/2022-23

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘ కార్యాలయము : చౌటుప్పల్
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్
నోటీసు నెం. E1/MCCPL/14/2022-23 తేది : 16-02-2023
షార్ట్ టెండర్ నోటీస్ నెం. నోటీస్ నెం. E1/1121/MCCPL/2022-23/MGF/PP/18 to 21 & E1/1121/MCCPL/2022-23/MGF/15 to 17, పనిపేరు : పురపాలక సంఘం చౌటుప్పల్ కు చెందిన పట్టణ ప్రగతి మరియు జనరల్ ఫండ్ నిధుల నుండి శ్మశాన వాటికల మిగులు పనులు, పార్కుల నిర్వహణ మరియు నీటి సరఫరా పైప్ లైన్ & మోటర్ల రిపేర్ పనులు చేయుటకు గాను, పనివిలువ : 34.00 లక్షలు, అప్ లోడ్ చేసిన తేదీ : 17.02.2023. టెండర్ షెడ్యూలు డౌన్లోడ్ చేసుకొనుటకు చివరి తేది : 27.02.2023 సా॥ 5.30 గం॥ల వరకు. ఇతర వివరములు : ఆన్లైన్ https://tender.telanganagov.in ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ లో చూడండి.
సం/- కమీషనర్
పురపాలక సంఘం చౌటుప్పల్
DIPR. R.O.No. 12607-PP/CL/ADVT/1/2022-23

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ టిఎస్ లిమిటెడ్
ఆపరేషన్ సర్కిల్, సరూర్ నగర్
టెండర్ నోటీసు నెం.07/2022-23
సరూర్ నగర్ సర్కిల్‌లోని స్టేషనరీ ఐటెమ్స్ మరియు ప్రింటింగ్ సప్లయి కోసం డబ్ల్యు29/22-23. చంపాపేట్ డివిజన్‌లోని లెనిన్ నగర్ సెక్షన్‌లో చంద్రవిహార్ కాలనీలో ఛిన్నమైన లొకేషన్ల వద్ద ఎల్‌టి 30 5డబ్ల్యు/ఎల్ యొక్క ఎక్స్‌టెన్షన్‌ను టెండర్ స్పెసిఫికేషన్ నెం.డబ్ల్యు28/22-23 ప్రకారం నిర్వహించాల్సి ఉంటుంది. దయచేసి www.tssouthernpower.com వెబ్‌సైట్ సందర్శించండి. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్: 7901093649.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్/ ఎలక్ట్రికల్, ఓపి/సరూర్‌నగర్ సర్కిల్, హైదరాబాద్
DIPR R.O.No. 12596-PP/CL/ADVT/1/2022-23

తెలంగాణ ప్రభుత్వం
మున్సిపల్ కౌన్సిల్, వేములవాడ
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు & కొటేషన్ నోటీసు
1) వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో ఎన్ఐటి నెం.ఇ1/429/డిఎండి/పెయింటింగ్/2023 ప్రకారం పట్టణ ప్రగతి గ్రాంట్స్‌తో వేములవాడ మున్సిపాలిటీలో భిన్నమైన పనుల నిర్వహణ కోసం లనగా సెంట్రల్ డివైడర్ల యొక్క బ్యూటిఫికేషన్ పనుల కోసం అంచనా వ్యయం రూ.5.00లక్షలతో పనులను చేపట్టాలి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రక్రియ పనులు 16-02-2023, ఉదయం గం.10-30నుంచి ప్రారంభమవుతుంది. బిడ్లను స్వీకరించుటకు చివరి తేది:20-02-2023, సాయంత్రం గం.4-30 వరకు. ప్రైస్ బిడ్ ప్రారంభం తేదీ & సమయం: 20-02-2023, సాయంత్రం గం.4-31 నుంచి. 2) ఎన్ఐటి నెం.ఇ1/430/డిఎండి/సిసి/స్ట్రీట్ బోర్డులు/2023, పని పేరు: వీధి మరియు రోడ్ల యొక్క పట్టణ ప్రగతి గ్రాంట్స్ పనుల్లో భాగంగా భిన్నమైన ప్రదేశాల్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పనుల యొక్క మొత్తం అంచనా వ్యయం రూ.15.00లక్షలు. 3) ఎన్ఐటి నెం.ఇ1/431/డిఎండి/ఎంపిఎల్ఎడిఎస్/రీడింగ్ రూమ్/2023, పని పేరు: ఎంపిఎల్ఎడిఎస్ ప్రకారం వేములవాడ మున్సిపాలిటీలో కొనైపల్లిలో మొత్తం అంచనా వ్యయం రూ.2లక్షలతో ఇంటి నెం.3-98/1 పక్కన రీడింగ్ రూమ్ నిర్మించాల్సి ఉంటుంది. 4)ఎన్ఐటి నెం.ఇ1/433/డిఎండి/పబ్లిక్ టాయిలెట్/2023/3వ కాల్, పని పేరు: వేములవాడ మున్సిపాలిటీకి సంబంధించి విడుదలైన పట్టణప్రగతి గ్రాంట్స్ ద్వారా రెండో బైపాస్ రోడ్డు వద్ద గంగమ్మ టెంపుల్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్‌ను మొత్తం అంచనా వ్యయం రూ.13.00 లక్షలతో చేపట్టాల్సి ఉంటుంది. 5) ఎన్ఐటి నెం.ఇ1/419/డిఎండి/ఆఫీస్ ఫర్నీచర్/2022/పని పేరు: వేములవాడ మున్సిపాలిటీలో మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో అవసరమైన గృహోపకరణాలను మరియు ఇతర అవసరాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మున్సిపల్ జనరల్ ఫండ్స్ 4వ కాల్ ద్వారా వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని కోసం మొత్తం అంచనా వ్యయం రూ.25.00 లక్షలు. 6)పనుల సంఖ్య (05) 7) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రక్రియ 16-02-2023, ఉదయం గం.10-30 నుంచి ప్రారంభమవుతుంది. 8)బిడ్లను స్వీకరించుటకు చివరి తేది:23-02-2023, సాయంత్రం గం.4-30 వరకు. 9) ప్రైస్ బిడ్ ప్రారంభ తేదీ& సమయం: 23-02-2023, సాయంత్రం గం.4-31 నుంచి.
సంబంధిత అధికారి యొక్క పేరు & చిరునామా: కమిషనర్, వేములవాడ మున్సిపాలిటీ
జిల్లా: రాజన్న సిరిసిల్ల, పూర్తి వివరాల కోసం దయచేసి www.eprocurement.gov.in వెబ్‌సైట్ వద్ద సంప్రదించవచ్చును.
కొటేషన్ నోటీసు:
పని పేరు: 1) వేములవాడ మున్సిపాలిటీలో బస్తీ దవాఖానను అభివృద్ధి చేయాలి. అవసరమైన ఐటెమ్స్: విట్రిఫైడ్ ఫ్లోరింగ్ మ్యాట్, ఫాల్స్ సీలింగ్స్, ఆర్టిస్టిక్ వాల్ పెయింటింగ్, ఆస్పత్రి నిర్వహించుటకు అవసరమైన ఇతర ఐటెమ్స్: 2)పనుల సంఖ్య: 1, 3) కొటేషన్లను స్వీకరించే తేదీ : 15-02-2023, 4)కొటేషన్లను స్వీకరించుటకు చివరి తేది: 18-02-2023, మధ్యాహ్నం గం.3-00 వరకు. సాంకేతిక వివరాల కోసం/వివరాల కోసం, సర్కిల్, ఏఈ, వేములవాడ మున్సిపాలిటీ (9010470446) పై సంప్రదించాలి. వేములవాడ మున్సిపాలిటీ కార్యాలయం పేరిట నిర్దిష్ట గడువులోపు సమర్పించిన హార్డ్ కాపీ కొటేషన్లను మాత్రమే స్వీకరించబడును.
DIPR. R.O.No. 12598-PP/CL/ADVT/1/2022-23 సం/- కమిషనర్ వేములవాడ మున్సిపాలిటీ

తెలంగాణ ప్రభుత్వం
ప్రిన్సిపల్ గారి కార్యాలయం, ఉస్మానియా మెడికల్ కాలేజ్, కోఠి, హైదరాబాద్
స్వల్ప కాలిక టెండర్ ప్రకటన
ఆర్‌సి. నెం.సిడిఎస్/ఓ.ఎం.సి/2022-23/8367/161 తేది:06-02-2023
ఉస్మానియా మెడికల్ కళాశాల (ఓఎంసి) ఆవరణలోని పురుషుల హాస్టల్ (సంక్షేమ హాస్టల్) ఆవరణలో కొత్త ఫ్లోరింగ్ మరియు అంతర్గత ఏరియా యొక్క కలరింగ్, కొన్ని రకాల మరమ్మతుల నిర్వహణ కోసం అధీకృతులు/డీలర్లు/ఏజెన్సీలు/ సర్వీసెస్ నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నాం. టెండర్ యొక్క విక్రయం అన్ని పనిదినాల్లో ఉదయం గం.10-30 నుండి సాయంత్రం గం.4-00 వరకు ఓఎంసిలోని సిడిఎస్ సెక్షన్ వద్ద నుండి సీల్డ్ టెండర్ల మంజూరు తేదీ 20-02-2023 నుండి 27-02-2023 వరకు పొందవచ్చును. సీల్డ్ టెండర్లను సమర్పించుటకు చివరి తేది:28-02-2023. ఓఎంసిలోని ప్రిన్సిపల్ ఛాంబర్స్ వద్ద తేది:02-03-2023న మధ్యాహ్నం గం.3-00కు టెండర్ల యొక్క ప్రతినిధులు/విజేతల సమక్షంలో సీల్డ్ టెండర్లను తెరవబడును. కార్యాలయంలో సంప్రదించి పూర్తి వివరాలను పొందవచ్చును.
DIPR. R.O.No. 3538-DP/CL/ADVT/1/2022-23 సం/- ప్రిన్సిపల్

SBFC | SMALL BUSINESS FINCREDIT
ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్
రిజిష్టర్డ్ కార్యాలయం: యూనిట్ నెం.103, 1వ అంతస్తు, సి&బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, సిటిఎస్ నెం.95ఎ, 127, అంధేరి కుర్లా రోడ్, విలేజ్ చాకల, అంధేరి (ఈస్ట్), ముంబయి-400059 | టెలిఫోన్: : +912267875300 | ఫ్యాక్స్: +91 2267875334 | www.SBFC.com | కార్పొరేట్ ఐడెంటిటీ నెంబర్ : U67190MH2008PTC178270
బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల వేలం దిగువ పేర్కొన్న బ్రాంచ్ చిరునామా వద్ద 24,ఫిబ్రవరి,2023న ఉ.11.00గం.లకు ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్‌చే నిర్వహించబడును.
మా వివిధ ఖాతాదారులు వారి బకాయిలను చెల్లించుటలో విఫలం చెందినందున, వారి రుణ ఖాతాలకు చెందిన బంగారు ఆభరణాలు వేయబడును. వేలంకు సంబంధించిన మా నోటీసులు ఈ రుణగ్రహీతలకు సక్రమంగా జారీచేయబడినవి.
వివిధ ఖాతాదారుల కొరకు కస్టమర్ ఐడి యొక్క అన్ని లింక్‌చేయబడిన ఖాతాలకు చెందిన వేలంవేయబడు బంగారు ఆభరణాల వివరాలు దిగువ పేర్కొన్న బ్రాంచ్ వివరాలతో కలవు.
సిద్దిపేట్ బ్రాంచ్ చిరునామా: ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్, ఇ.నెం.8-1-67, సాజిద్‌పుర, హైదరాబాద్ రోడ్, సిద్దిపేట్, తెలంగాణ-502103
సిద్దిపేట్: ,AP00334520,AP00346248,AP00364859,AP00370811,AP00397850,AP00415865,AP00468017
మరిన్ని వివరాల కోసం, దయచేసి ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్ వారిని సంప్రదించండి, సంప్రదించాల్సిన నెంబర్లు: 18001028012
(ఏదేని ముందస్తు నోటీసు లేకుండా వేలం వేయబడు ఖాతా నెంబర్లు మార్చుచేయు &/ వేలంను వాయిదావేయు/ రద్దుచేయు అధికారం ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్‌కు ఉంది.)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
జిల్లా కలెక్టర్, జనగాం వారి ప్రాథమిక ప్రకటన
ఫారం-VI
(చట్టం 30/2013లోని సెక్షన్ 11(1)లోని సబ్ రూల్ (1) రూల్ (19) ప్రకారం)
యస్.డి.సి.ఫైల్ నెం.సి/45-3/2022 తేది:02-01-2023
జిల్లా కలెక్టర్ ఫైల్ నెం.ఇ2/684/2022 తేది:18-01-2023
గెజిట్ నెం. జెఎన్/యల్ఏ/01/2023 తేది:20-01-2023
ఈ దిగువ నిర్దిష్టపరచిన జనగాం జిల్లా పాలకుర్తి మండలము తీగారం గ్రామములలో ఉన్న భూమి మొత్తం విస్తీర్ణం 7-1525 గుంటలు దేవాదుల ప్రాజెక్టులో (జె.సి.ఆర్.జి.ఎల్.ఐ.పి) భాగంగా 1యల్ ఆఫ్ రైట్ బ్రాంచ్ మైనర్ ఆఫ్ మెయిన్ కెనాల్ ఆఫ్ పాలకుర్తి ట్యాంక్ కి.మీ. 1.500 నుండి 2.769 వరకు కెనాల్ నిర్మాణ నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.
భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం (సం. 30/2013)లోని సెక్షన్ 6(2) మరియు 10(4) ననుసరించి మినహాయించదగిన పరిధిలో ఉన్నందున చాప్టర్-2లోని సామాజిక ప్రభావము అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3లోని ఆహార భద్రత పరిరక్షణ వంటి అంశములు వర్తించవు.
నిర్వాసిత కుటుంబాల పునరావాస, పునరుపాది అంశములకు అదనపు కలెక్టర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ జనగాం గారిని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమించబడినారు. జనగాం జిల్లా పాలకుర్తి మండలము తీగారం గ్రామములో ఉన్న భూమి మొత్తం విస్తీర్ణం 7-1525 గుంటలు ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.
అనుబంధము
1యల్ ఆఫ్ రైట్ బ్రాంచ్ మైనర్ ఆఫ్ మెయిన్ కెనాల్ ఆఫ్ పాలకుర్తి ట్యాంక్
గ్రామం: తీగారం మండలం: పాలకుర్తి జిల్లా: జనగాం

క్రమ సంఖ్య	సర్వే నెంబరు	విస్తీర్ణం	భూమి మెట్ట/ తరి	పట్టా రకం	పట్టాదారు/ అనుభవదారు పేరు	రిమార్కులు
1	55	0.03	ఖుష్కి	పట్టా	రేపాక రమేష్ తండ్రి సోమయ్య	-
2	55	0.0850	ఖుష్కి	పట్టా	బైకాని పెద్దాపురం తండ్రి మల్లయ్య	
మొత్తం		0.1150				
3	56	0.0950	ఖుష్కి	పట్టా	బైకాని పెద్దాపురం తండ్రి మల్లయ్య	
4	56	0.1450	ఖుష్కి	పట్టా	బైకాని మల్లయ్య తండ్రి ఎల్లప్ప	
మొత్తం		0.24				
5	57	0.13	ఖుష్కి	పట్టా	బైకాని చుల్లయ్య తండ్రి ఎల్లప్ప	
6	57	0.32	ఖుష్కి	పట్టా	బైకాని పోమరాజయ్య తండ్రి యాదయ్య	
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

పూర్తి మొత్తం 7-1525

[illegible]

DIPR Ro.No.1224/LA-PP/Advt/Pub/2022-23

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ విభాగము
కలెక్టర్ కార్యాలయం, కరీంనగర్
భూసేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టము-30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారం)
ఫారం - VI - ప్రాథమిక ప్రకటన
కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామ పరిధిలో గల ఈ దిగువ షెడ్యూలు నందు చూపబడిన భూమి విస్తీర్ణం (0-38) ఎకరముల భూమి ప్రజా ప్రయోజనార్థమై మధ్య మానేరు రిజర్వాయర్ 1L-D9 కుడి ప్రధాన కాలువ క్రింద కిలోమీటరు 0.000 నుండి కిమీటరు 1.6000 వరకు త్రవ్వుట కొరకు అవసరమున్నదని తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, కరీంనగర్ గారు భావిస్తున్నారు. కావున ఇట్టి ప్రకటన జారీ చేయనైనది.
సదరు భూసేకరణ చట్టములోని సెక్షన్ 10-ఎ క్రింద ఇవ్వబడిన అధికారాల ఆమలులో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము జి.ఓ.ఎం.ఎస్.నెం. 41, ఐ & సి.ఎ.డి. (ఎల్.ఎ.ఆర్. & ఆర్./ఎ2) శాఖ, తేది: 22-07-2017 ద్వారా ఐఎఫ్ఎస్‌సి ప్రాజెక్టును జారీ చేస్తూ, తెలంగాణ రాజపత్రం నెం. 221, తేది: 01-08-2017 ద్వారా ప్రచురించబడినది. ఇందువల్ల, ఈ భూసేకరణ కూడా ఐఎఫ్ఎస్‌సి ప్రాజెక్టు క్రింద వర్తింపబడి. ప్రస్తుత భూసేకరణకు, భూసేకరణ చట్టం, 2013 (నెం. 30/2013)లోని చాప్టర్-II & III లలోని నిబంధనల విధానాన్ని అనుసరించవలసిన అవసరము లేదు.
షెడ్యూలు
గ్రామము : మాదాపూర్ మండలము : గన్నేరువరం జిల్లా : కరీంనగర్

సర్వే నెం.	భూమి వివరాలు	భూ సేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(లు) పేరు (లు) తండ్రి/భర్త పేరుతో సహా	అనుభవదారు(లు) పేరు (లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (నిర్మాణాలు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
105	మెట్టపల్లి	0.34	అనుమాసుల రాజేశ్‌కుమార్ తండ్రి : మోహన్ రెడ్డి	అనుమాసుల రాజే కుమార్ తండ్రి : మోహన్ రెడ్డి	2 పైప్‌లైన్లు
			మంద ఎల్లవ్వ భర్త : ఉపేందర్	మంద ఎల్లవ్వ భర్త : ఉపేందర్	
			అనుమాసుల శ్రీ మూల జీవిత భర్త : రాజ్ కుమార్	అనుమాసుల శ్రీ మూల జీవిత భర్త: రాజ్ కుమార్	2 పైప్‌లైన్లు
			కొమ్ము శాంత భర్త : రాజయ్య	కొమ్ము శాంత భర్త : రాజయ్య	—
			సంపత్ లక్ష్మవ్వ భర్త:భూమయ్య	సంపత్ లక్ష్మవ్వ భర్త:భూమయ్య	
			గుర్రం మహేందర్ రెడ్డి తండ్రి : రాజిరెడ్డి	గుర్రం మహేందర్ రెడ్డి తండ్రి : రాజిరెడ్డి	
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

[illegible]


DIPR Ro.No.1232/LA-PP/Advt/Pub/2022-23

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
రెవిన్యూ శాఖ
ఫారం-VII
[illegible]
DIPR Ro.No.1226/LA-PP/Advt/Pub/2022-23

అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
శుక్రవారం 17-2-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 8 సంచిక : 347
Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar
www.navatelangana.com
12 పేజీలు వెల : 6.50

గవర్నర్ రాజకీయ రంగ ప్రవేశం చేయకూడదు

- సీజేఐ డివై చంద్రచూడ్



న్యూఢిల్లీ : గవర్నర్ రాజకీయ రంగ ప్రవేశం చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతేడాది మహారాష్ట్రలో శివసేన కూటమి ఉద్ధవ్‌ఠాక్రే ప్రభుత్వాన్ని కూలదోసి... ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ రాజకీయ సంక్షోభానికి సంబంధించిన కేసును సుప్రీంకోర్టు విచారించింది. ఈ కేసులో ఉద్ధవ్ ప్రభుత్వ పతనానికి కారణమైన కేసును కోర్టు విచారిస్తున్నది. మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోషియారీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో వాదనలు వినిపించారు. 'మనకు రెండు పార్టీల వ్యవస్థ లేదు. భారతదేశం బహుళ పార్టీల

...5లో

త్రిపురలో భారీ పోలింగ్

సాయంత్రం 4 గంటలకు 81.11 శాతం ఓటింగ్

- బీజేపీ హింసాకాండ
- సీపీఐ(ఎం) కార్యకర్తలకు తీవ్ర గాయాలు



న్యూఢిల్లీ : బీజేపీ హింసాకాండ, బెదిరింపుల నడుమ త్రిపురలో భారీ పోలింగ్ జరిగింది. పోలింగ్‌కు నిర్ణీత సమయమైన సాయంత్రం 4 గంటలకు 81.11 శాతం మంది ఓటు వేసినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. ఆ సమయంలో దాదాపు 1,500 బూత్‌ల్లో 1.35 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. దీంతో పోలింగ్ శాతం 85కి చేరుతుందని అంచనా. రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 89.08 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభం కాగానే బూత్‌ల ముందు మహిళలతో పాటు పెద్ద ఎత్తున ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం 4 గంటల వరకూ ఈ ప్రక్రియ సాగింది. సాయంత్రం 4 గంటలు దాటిన తర్వాత కూడా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా వారికి టోకెన్లను

...5లో

'బీజేపీ దౌర్జన్యం'



మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ రామ్‌నగర్ నియోజకవర్గంలోని శిశువిహార్ హయ్యర్ సెకండరీ స్కూల్ బూత్‌లో ఓటు వేశారు. బీజేపీని ఓడించేందుకు ప్రజలు శాయశక్తులా ప్రయత్నించారని ఆయన మీడియాతో అన్నారు. కానీ, బీజేపీ అక్రమాలకు పాల్పడుతోందని, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, నిర్భయంగా ఓట్లు

...5లో



ఫోటో కెఎన్.హరి

మతోన్మాదం పేరుతో దోపిడీ

హిందూత్వ, కార్పొరేట్లకు వ్యతిరేకంగా ద్విముఖ పోరు : ప్రకాష్‌కరత్

జ్యోతిబసు నగర్ నుంచి
నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కార్పొరేట్లు, మతోన్మాదులు కలిసికట్టుగా ప్రజలను దోపిడీ చేస్తున్నారనీ, దీనికోసం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ఘర్షణలు సృష్టిస్తున్నారనీ, దీన్ని ఎదుర్కోవాలంటే ద్విముఖ వ్యూహంతో పనిచేయాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్‌కరత్ పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలో భాగంగా రెండోరోజు మతోన్మాదం, కార్పొరేట్ల అనుబంధం, వామపక్షాల కార్యాచరణ, రాజ్యాంగంపై దాడి, ఆహార, ఉపాధి భద్రత, భూ పంపిణీ వంటి అంశాలపై సదస్సు జరిగింది. 2014లో మోడీ గద్దెనెక్కిన నాటి నుంచి కార్పొరేట్లు, మతోన్మాద శక్తుల కలయిక బలోపేతమైందని అన్నారు. ఈ తొమ్మిదేండ్లలో సరళీకరణ విధానాలు మరింత ఊపందుకున్నాయని తెలిపారు. క్రోనీ క్యాపిటలిజానికి అనుకూలంగా ప్రధాని పనిచేస్తున్నారని తెలిపారు. 1991లో పివి నరసింహారావు సరళీకరణ విధానాలను బడ్జెట్‌లో ప్రతిపాదించిన సందర్భంలో... తాము సూచించిన విధానాలనే కాంగ్రెస్ అమలు చేస్తున్నదని అద్వానీ పార్లమెంటులో చెప్పారని గుర్తుచేశారు. నెహ్రూ ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికలు ప్రభుత్వ రంగాన్ని బలపరుస్తుంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయని అన్నారు. మోడీ అన్ని రంగాలను ప్రయివేటీకరిస్తున్నారనీ, బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని ప్రభుత్వ సంపద పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారని అన్నారు. హిందూత్వ సిద్ధాంతం మతతత్వం పేరుతో సామాజికంగానూ విభజన తీసుకొస్తున్నారనీ, సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా అదానీ, అంబానీ, టాటాలు మోడీ పాలనలో సంతృప్తికరంగానే ఉన్నారని చెప్పారు. రతన్‌టాటా కూడా మోహన్‌భగవత్‌తో కలిసి 2015లో హెగ్డేవార్ సమాధి వద్దకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారని తెలిపారు. మోడీ నియంతృత్వం దిశగా ఏకపార్టీ పాలన సాగిస్తున్నారని అన్నారు. హిందూ రాష్ట్ర నినాదం అంటే మైనార్టీలపైనా దళితులపైనా దాడులేనన్నారు. కార్మికవర్గం రైతాంగం, వ్యవసాయ కార్మికుల హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని వివరించారు. కార్పొరేట్ల కోసం దేశ రాజ్యాంగాన్నే మార్చాలని బీజేపీ చెబుతున్నదని అన్నారు. హిందూత్వం ఒక్కటే ప్రజలను ఉత్సాహపరుస్తుందని మోడీ చెబుతున్నారని అన్నారు. ఉత్తర భారతంలో హిందూత్వ నినాదం పేరుతో ప్రజల జీవితాలపై దాడి చేస్తున్నారని అన్నారు. దళిత గిరిజనులపై దాడులు చేస్తూ వారిని అణచివేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా కూడా పోరాటం చేయడం ద్వారానే బీజేపీని ఓడించలగమని పేర్కొన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకరంగా రాజకీయ ప్రత్యామ్నాయం కోసం పోరాడాలని తెలిపారు. ప్రజల మౌలిక అవసరాల కోసం

...2లో

భగత్‌సింగ్ జీవితాన్ని
చదవండి

యువతకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని పిలుపు

- రెడ్ బుక్స్ డే సందర్భంగా నెల రోజులపాటు అధ్యయనం
- 'భారత విప్లవ కెరటం భగత్‌సింగ్' పుస్తకావిష్కరణ



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రెడ్ బుక్స్ డే సందర్భంగా రాష్ట్రంలో ఈనెల 21 నుంచి మార్చి 23 (భగత్‌సింగ్ వర్ధంతి) వరకూ అధ్యయన మాసోత్సవాన్ని నిర్వహించనున్నట్టు సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ నెల రోజులపాటు భగత్‌సింగ్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో 'భారత విప్లవ కెరటం భగత్‌సింగ్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, చుక్క రాములు, టి.సాగర్, నవతెలంగాణ సంపాదకులు ఆర్.సుధాభాస్కర్, సీజీఎం పి. ప్రభాకర్, బుక్‌హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి, మేనేజర్ కృష్ణారెడ్డి, ఎడిటోరియల్ బోర్డు సభ్యులు ఎ.మోహన్‌కృష్ణ, నియోకర్సర్ ఇన్‌చార్జి జగదీశ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ...భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన భగత్‌సింగ్ జైలులో రాసిన వీలునామా, ఆయన సమకాలీకుడు శివవర్మ రాసిన పుస్తకాలను కలిపి ముద్రించిన పుస్తకంలోని

...5లో

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి

- ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



నవతెలంగాణ – అడిక్ మెట్

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 26 వేల మందికి పైగా ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని తెలిపారు. 18 సంవత్సరాలుగా పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు అని.. కంటి వెలుగు, లెప్రసీ తదితర ప్రభుత్వం నిర్ణయించిన అన్ని పనులూ చేస్తున్నారని తెలిపారు. గతంతో పోలిస్తే అనేక రెట్ల పనిభారం పెరిగిందని, కానీ వారికి ఫిక్స్‌డ్ వేతనం లేదని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, కనీసం ప్రసూతి సెలవులు కూడా ప్రభుత్వం నేటికీ నిర్ణయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం ఇవ్వాలని 106 రోజులు ఆశా వర్కర్లు సమ్మె చేస్తే.. ముఖ్యమంత్రి కేసీఆర్ వారిని ప్రగతిభవన్‌కు పిలిపించుకుని.. రూ.6000 ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకుండా ఆశాలను మోసం చేస్తున్నారని తెలిపారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్టు ఆశా వర్కర్లకు

...5లో

బ్రెయిలీ లిపిలో కేసీఆర్ జీవిత చరిత్ర..

ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ కే.వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ సంక్షిప్త జీవిత చరిత్రను బ్రెయిలీ లిపిలో ముద్రించారు. అంధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాన్ని రాష్ట్ర మంత్రి కేటీఆర్ గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడికి విచ్చేసిన అంధులతో ఆయన ఆ పుస్తకాన్ని చదివించుకుని అందులోని విశేషాలను తెలుసుకున్నారు. కేసీఆర్ బాల్యం, విద్యాభ్యాసం, రాజకీయ జీవితం, ఆయన అలంకరించిన పదవులు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం,





ఒక్కో పోస్టుకు 705 మంది పోటీ

- గ్రూప్–2కు 5.51 లక్షల దరఖాస్తులు
- ముగిసిన గడువు
- త్వరలో పరీక్ష తేదీల ఖరారు : టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్–2 పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గురువారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి అనితా రామచంద్రన్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943

...5లో

కూలుస్తాం.. పేలుస్తామంటే... డిపాజిట్ కూడా రాదు

- బీబీసీపై ఐటీ దాడులు దారుణం : హరీశ్ రావు
- సీఎం కేసీఆర్ జన్మదిన కానుకగా వంద పడకల ఆస్పత్రి ప్రారంభం

5లో..



ప్రపంచం దర్పణం వంటిది. మన ప్రతిబింబమే అందులో కన్పిస్తుంది - గోల్డ్‌స్మిత్

సంపాదకీయం


జనం మీద కుహనా ప్రచార దాడి!

2020 ఆగస్టులో అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన వార్త ఒక రాజకీయ తుపాన్ రేపింది. ఫేస్‌బుక్‌లో విద్వేష ప్రచారం చేసే బీజేపీ నేతల పోస్టులను తొలగించకుండా సదరు సంస్థ పబ్లిక్ పాలసీ డైరెక్టర్‌గా ఉన్న అంఖీదాస్ చూశారన్నది దాని సారం కాగా, ఆమె బీజేపీకి ఎంత వీర విధేయురాలో సాక్ష్యాలతో సహా వెల్లడించింది. "మనం అతని (నరేంద్రమోడీ) సామాజిక మాధ్యమ మంట రగిల్చాం తరువాత చరిత్ర మీకు తెలిసిందే. ఎట్టకేలకు భారత ప్రభుత్వ సోషలిజాన్ని వదిలించుకొనేందుకు గాను దిగువ స్థాయి నుంచి చేసిన పనికి ముప్పై ఏండ్లు

జర్నలిస్టులను బెదిరించటమే కాదు, వారికి ప్రాణహాని కూడా ప్రపంచమంతటా ఉన్నదని చెబుతున్న నివేదికలు మన దేశంలోని ప్రజాస్వామ్యవాదులకు ఒక హెచ్చరిక కావాలి. తన ఎన్నిక కేసులో ఓడిన ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించి పత్రికల మీద సెన్సారు పేరుతో వ్యతిరేక వార్తలను నిషేధించిన దానికి, బిబిసి డాక్యుమెంటరీని సామాజిక మాధ్యమాల్లో నిషేధించిన నరేంద్రమోడీ సర్కార్ నిర్వాకానికి పెద్ద తేడా లేదు. ఇది ఒక ట్రైలర్ మాత్రమే, సినిమా ఎలా ఉంటుందో ఊహించుకోవాల్సిందే!

పట్టింది" అంటూ ఆమె 2014లో గెలిచిన సందర్భంగా మోడీని పొగడటం, కాంగ్రెస్ ఓడిపోవటం గురించి రాసిన రాతలను ఆ పత్రిక వెల్లడించింది. భారత జార్జి బుష్‌గా నరేంద్రమోడీని ఆమె వర్ణించారు. 2012 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ సామాజిక మాధ్యమ విభాగానికి ఆమె ఇచ్చిన శిక్షణ గురించి కూడా పేర్కొన్నది. ఇదంతా ఎందుకు గుర్తు చేయాల్సి వచ్చిందంటే ఇజ్రాయెల్‌కు చెందిన "టీమ్ జార్జి" పేరుతో టాల్ హనాన్ బృందం 33 దేశాలలో ఎన్నికల సందర్భంగా నిర్వహించిన తప్పుడు ప్రచారం గురించి ఒక అంతర్జాతీయ జర్నలిస్టుల బృందం పరిశోధించి వెలుగులోకి తెచ్చిన అంశాలను బ్రిటన్‌కు చెందిన గార్డియన్ పత్రిక తాజాగా వెల్లడించించింది. అంతే కాదు న్యూయార్క్ నగరం కేంద్రంగా ఐరాస-యునెస్కో నిధులతో పని చేస్తున్న జర్నలిస్టుల అంతర్జాతీయ కేంద్రం (ఐసిఎఫ్‌జె) నివేదిక కూడా వెల్లడైంది. దానిలో భారత్‌కు చెందిన మహిళా జర్నలిస్టులు రానా అయూబ్‌ను వేధించుతున్న, గౌరీ లంకేష్ ప్రాణాలను బలిగొన్న బీజేపీ అనుబంధ బృందాల గురించి వెల్లడించారు.

ఈ రెండు నివేదికల్లోని అంశాలు ప్రజాస్వామ్య వాదులకు, నిబద్ధత కలిగిన జర్నలిజం వృత్తిగా ఉన్నవారికి ఆందోళన కలిగిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో తిష్టవేసిన కాషాయదళాలు ఎలాంటి పాత్ర నిర్వహిస్తున్నాయో వాల్‌స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. పత్రికలు, టీవీలు మినహాయింపు కాదు. విద్వేష ప్రచారాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విటర్లలో ప్రచారం చేయటం ఒకటైతే పత్రికల్లో రాతలు, టీవీల్లో చర్చల పేరుతో రెచ్చగొట్టే అంశాలను ముందుకు తేవటం మరొకటి. టీమ్ జార్జి వంటి సంఘటిత బృందాలు మన దేశంలో కోకొల్లలుగా ఉన్నాయి. ఊరూ పేరులేని వాటి ఉత్పత్తులు నిరంతరం వాట్సాప్‌ల్లో మనం కోరకుండానే వచ్చిపడుతుంటాయి. ఇవి రక్తం చిందకుండానే ప్రాణాలు తీసే ఆయుధాలంటే అతిశయోక్తి కాదు. ఊరూపేరు లేకుండా, లేదా అపహరించిన ఫొటోలతో వారికి తెలియకుండానే ఖాతాలు తెరిచి తమ అజెండా ప్రకారం ప్రచారం చేసే ముఠాలే ఇవి. అలాంటి పని చేస్తున్న టీమ్ జార్జి ముఠా అది తప్పేమీ కాదని చెప్పటమే కాదు, అందుకు గాను ఎంత మొత్తాలను వసూలు చేస్తున్నదీ వెల్లడించారు. ఒక ఆఫ్రికా దేశ నేత ప్రతినిధులమని, ప్రచారం చేసేందుకు సేవలు కావాలంటూ వెళ్లిన జర్నలిస్టులకు వారు చెప్పిన సమాచారం, తమ పనిని ప్రదర్శించిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తున్నది. ఎన్ని దేశాల్లో ఇలాంటి కుహనా ప్రచారకులు ఎందరు ఉన్నదీ ఊహించుకోవాల్సిందే తప్ప లెక్కించలేం.



ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చుకొనేందుకు, ప్రత్యర్థులను బదనామ్‌చేసి దెబ్బతీసేందుకు గూఢచార సంస్థలు, రాజకీయపార్టీలు, వాణిజ్య సంస్థలు కూడా ఇలాంటి ప్రచార ఆయుధాలతో దాడులు చేసే కిరాయిమూకలను రంగంలోకి దించుతున్నాయి. చివరికి ఇవి భార్యాభర్తల ఫోన్లు, సామాజిక మాధ్యమ ఖాతాలలో ప్రవేశించి అనుమానాలు, విబేధాలను రగిలిస్తున్నాయి. అడ్వాన్స్‌డ్ ఇంపాక్ట్ మీడియా సొల్యూషన్స్ (ఎయిమ్స్) అనే సాఫ్ట్‌వేర్ 30వేల నకిలీ ఖాతాలను నిర్వహిస్తుందంటే తప్పుడు ప్రచారానికి ఉన్న బలం ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

స్టోరీ కిల్లర్స్ ప్రాజెక్టు పేరుతో మహిళా జర్నలిస్టుల మీద రూపొందించిన వివరాలను ఐసిఎఫ్‌జె వెల్లడించింది. ఈ సంస్థ షెఫీల్డ్ విశ్వవిద్యాలయ కంప్యూటర్ నిపుణుల సహకారంతో భారత జర్నలిస్టులు రానా అయూబ్, గౌరీ లంకేష్, అల్ జజీరా యాంకర్ ఘదా క్విియిస్ తదితరుల గురించి నివేదికలను రూపొందించారు. వీరు కూడా "విస్మృత కథలు" సంస్థతో సమన్వయం చేసుకున్నారు. స్త్రీ ద్వేషం, బూతులు, ఆమె మతం, రాసిన రాతల మీద ద్వేషం వెళ్లగక్కుతూ రానా అయూబ్ మీద ప్రతి పద్నాలుగు సెకండ్లకు ఒక ట్వీట్ చేసినట్లు తేలింది. ఒక ట్వీట్ రాగానే ఒకటి రెండు నిమిషాల్లో దాని మీద వందల వేల ప్రతికూల స్పందనలు వెలువడటం అంటే అవి కంప్యూటర్లకు పుట్టినవి తప్ప మనుషులకు కాదు అన్నది స్పష్టం.ఈ ఆన్‌లైన్ హింసతో పాటు ఆమె ప్రాణాలు తీస్తామని, లైంగికదాడి చేస్తామన్న బెదిరింపులు సరేసరి. ఆమెకు ప్రాణహాని ఉందని ఐదుగురు ఐరాస ప్రతినిధులు 2018లోనే హెచ్చరికను జారీచేశారు. ఇక ఆల్ జజీరా యాంకర్ ఘదా క్విియిస్ గురించి ఒక మహిళ మీద ఎన్ని తప్పుడు ప్రచారాలు చేయవచ్చో అన్నీ చేశారు. గుజరాత్ మారణకాండ గురించి డాక్యుమెంటరీ నిర్మించిన బిబిసి మీద ఉక్రోషంతో దాని కార్యాలయాల మీద జరిపించిన దాడుల గురించి చూసిన తరువాత మన దేశంలో భిన్న గళాలను అణచివేసేందుకే కేంద్ర ప్రభుత్వం పూనుకున్నదని మరోసారి స్పష్టమైంది. జర్నలిస్టులను బెదిరించటమే కాదు, వారికి ప్రాణహాని కూడా ప్రపంచమంతటా ఉన్నదని చెబుతున్న నివేదికలు మన దేశంలోని ప్రజాస్వామ్యవాదులకు ఒక హెచ్చరిక కావాలి. తన ఎన్నిక కేసులో ఓడిన ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించి పత్రికల మీద సెన్సారు పేరుతో వ్యతిరేక వార్తలను నిషేధించిన దానికి, బిబిసి డాక్యుమెంటరీని సామాజిక మాధ్యమాల్లో నిషేధించిన నరేంద్రమోడీ సర్కార్ నిర్వాకానికి పెద్ద తేడా లేదు. ఇది ఒక ట్రైలర్ మాత్రమే, సినిమా ఎలా ఉంటుందో ఊహించుకోవాల్సిందే!

గుళ్లో దేవుడు లేడు : రవీంద్రనాథ్ టాగూర్

విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ (1861-1941), సాహిత్యంలో నోబెల్ బహుమతి సాధించిన భారతీయుడిగా మనందరికీ తెలుసు. గీతాంజలి -రచనకు 1913లో ఆ గౌరవం ఆయనకు దక్కింది. ఆయన హేతువాదో, నిరీశ్వరవాదో కాదు. అయినా కూడా, దేవుడి పట్ల ఆయన తన అభిప్రాయం స్పష్టంగానే చెప్పారు. I LOVE THE GOD, BECAUSE HE GIVES ME THE FREEDOM TO DENY HIM. (నేను దేవుణ్ణి ప్రేమిస్తాను. ఎందుకంటే, ఆయనను తిరస్కరించే స్వేచ్ఛ ఆయన నాకు ఇస్తాడు కాబట్టి!) అని మార్మికంగా చెప్పారు. ఇదే విషయం మీద ఆయన రాసిన చిన్న కథను తెలుగులో పొందుపరుస్తున్నాను.

*** *** ***

"గుళ్ళో దేవుడు లేడు" అని అన్నాడు సాధువు. రాజుకు కోపం వచ్చింది... "ఏమిటీ? గుళ్ళో దేవుడు లేడా? ఏమిటీ? మీరు నాస్తికుడిలా మాట్లాడుతున్నారూ? మహాత్మా! అమూల్యమైన వజ్ర వైడూర్యాలతో పొదగబడిన సింహాసనంపై మెరుస్తున్న ఆ బంగారు ప్రతిమను చూసి కూడా మీరు దేవుడు లేడు అని అంటే నేనేమి చెప్పేదీ?"



డాక్టర్ దేవరాజు మహారాజు

"నిజమే! అది రాచరికపు ఆర్భాటాలతో రాజసంతో విరాజిల్లుతూ ఉంది. కాదనను కానీ, అది ప్రతిమ మాత్రమే! దేవుడు అనేవాడు ఎక్కడా లేడు" సౌమ్యంగా బదులిచ్చాడు సాధువు. రాజుకోపంతో ఊగిపోయాడు. "20లక్షల బంగారు నాణాలు ధారపోసి ఆకాశాన్నంటే అద్భుతమైన ఈ భారీ కట్టడం కట్టించాను కదా? అన్ని ఆచారాలు పాటించాకే సంప్రదాయ బద్ధంగా విగ్రహ ప్రతిష్ఠ చేయించాను కదా? అయినా మీరు గుడిలో దేవుడు లేడని అంటున్నారే? మీ వివేకం ఏమయ్యింది మహాత్మా? ఎందుకు అలా మాట్లాడుతున్నారూ?" కసిగా పెద్ద గొంతుతో అన్నాడు రాజు. అందుకు సాధువు ప్రశాంత వదనంతో ఇలా అన్నాడు.

"ఇదే సంవత్సరం రెండు కోట్ల మంది నీ ప్రజలు కరువులో విలవిల్లాడారే? వేల మంది భిక్షకోసం నీ ఇంటిముందు నిలబడి అర్థించారే. అయినా ఉట్టి చేతులతో నిరాశతో తిరిగి పొయ్యారే-గుర్తుంది కదా? అప్పుడే దేవుడు ఈ ఆలయం వదిలి వెళ్ళిపోయాడు. కష్టకాలంలో తన వారికి అండగా నిలబడని ఓ లోభి నాకు ఇల్లు కట్టిస్తే... అందులో నేను ఎలా ఉండగలనూ? ప్రేమ, కరుణ, అహింసలు లేని చోట నేనెలా ఉండగలనూ?... అంటూ దేవుడు ఈ దేవాలయం వదిలి వెళ్ళిన విషయం నువ్వు గమనించలేదా రాజా..." అన్నాడు సాధువు.

"అవునా? అయితే ఆయన ఎక్కడికి వెళ్ళాడూ?" కంగారుగా అడిగాడు రాజు.

"రహదారికి ఇరువైపులా పడి ఆకలితో తల్లడిల్లుతున్న పేదల వద్దకు పోయాడు. సముద్రపు నురగవలె నువ్వు కట్టించిన గుడి అంతా శూన్యం. అందులో ఇక ఏమీ లేదు. ఏమీ ఉండదు" నింపాదిగా చెప్పాడు సాధువు.

"నువ్వో మోసగాడివని గ్రహించాను. నీకు దేశ బహిష్కరణ శిక్ష విధిస్తున్నాను" అని అరిచాడు రాజు.

"అక్కర లేదు. నేనే నీ రాజ్యం వదిలి వెళుతున్నాను. దయ, మానవత్వం లేని ఈ చోటుని దేవుడే విడిచి వెళ్ళాడు. నువ్వు కట్టించిన గుడినీ, నీ రాజ్యాన్నీ వదిలి వెళ్ళిపోయాడు. మరి, నేను మాత్రం ఇక్కడ ఎలా ఉండగలనూ? నీ సంపదను చూసుకుని మురిసిపోతున్నావ్. అహంకారంతో దేవుణ్ణి వెళ్ళగొట్టిన వాడివి. దయచేసి నీ భక్తిని కూడా వదిలేయ్. బాగుపడతావ్" అని చెపుతూ సాధువు అక్కడి నుంచి కదిలాడు. "దేవుడంటే ప్రతిమ కాదు, సేవా భావం! మానవత్వం!! అవి లేని వాడి దగ్గర నేను మాత్రం ఎందుకుంటానూ?" అని అనుకుంటూ సాధువు వెళ్ళిపోయాడు.

*** *** ***

రవీంద్రుడు విశ్వకవి గనుక, ప్రపంచ స్థాయి రచయిత గనుక, ఆయన చెప్పాలనుకున్నది ఈ కథలో స్పష్టంగానే చెప్పారు. ఎవరైనా అర్థం చేసుకోలేకపోతే అది వారి తప్పు. రవీంద్రుడిది కాదు. 2022 జులై చివరిలో 'నేనంటే ఎవరు?' రచనకు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు స్వీకరించడానికి నేను కలకత్తా వెళ్ళినప్పుడు జొరసంకొ -ఠాకూర్ బారి (రవీంద్రుడి ఇల్లు) వెళ్ళి చూశాం. ఇల్లంతా తిరుగుతూ ఉంటే, గదులన్నీ పరిశీలిస్తూ ఉంటే ఒక చిత్రమైన అనుభూతికి లోనయ్యాను. ఆ ఇంట్లో ఆయన పుట్టిన గది, పెరిగి తిరుగాడిన వరండాలు, అతిథులను కలిసే హాలు, రాసుకునే బల్ల, ఆయన పడక గది, దాని పక్కనే ఆయన కన్ను మూసిన గది- చూసే సరికి అవన్నీ అప్పుడే నా కళ్ళముందు జరిగిపోయాయన్న భావన! భావుకతను కాలం అడ్డుకోలేదు కదా? సముద్రంలోంచి విడివడ్డ ఒక నీటి చుక్కవలె నేను బయటికి నడుస్తున్నప్పుడు ఉచ్ఛ్వాసా నిశ్వాసాలు ఎందుకో బరువెక్కాయి.

ఎవరు రాశారో తెలియదు గానీ, దాదాపు ఇలాంటి కల్పిత కథే మరొకటి ఉంది. కథ కల్పితమే అయినా, సారాంశం సమాజ వాస్తవికతను ప్రతిబింబించేదే! అది ఇలా సాగుతుంది.

*** *** ***

ఒకసారి దెయ్యం, మనిషీ కలిసి హాయిగా వెన్నెల్లో నడిచి వెళుతున్నారు. వారికి ముందు మరొకరు నడిచి వెళుతున్నారు.

"అదెవరూ?" అని అడిగాడు మనిషి.

"ఇంకెవరూ? నీకు లాంటి ఓ మనిషే! మన ముందు నడుస్తున్నాడు" అంది దెయ్యం. కొద్ది దూరం వెళ్ళాక ముందు నడిచే వ్యక్తి ఆగి, నేలను పరీక్షగా చూసి, ఏదో చేతిలోకి తీసుకుని, గబగబా పరుగులాంటి నడకతో ముందుకు వెళ్ళాడు. అది గమనించిన మనిషి మళ్ళీ అడిగాడు.

"అదేమిటీ? అతనికి అక్కడ ఏదో దొరికింది" అన్నాడు.

"అవును! అతనికి అక్కడ 'సత్యం' దొరికింది" అంది దెయ్యం.

1980లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో సర్వమత సభలు జరిగాయి. ఇందులో ప్రపంచంలోని పద్నాలుగు మతాలకు చెందిన మతాధికారులు, పీఠాధిపతులు, స్వామీజీలు, పాస్టర్లు, ఇమామ్‌లు అందరూ పాల్గొన్నారు. దేవుడు ఉన్నాడా లేడా అనే విషయం మీద మూడు రోజులు ఏకధాటిగా చర్చలు జరిగాయి. చివరకు ఏకగ్రీవంగా అందరూ తీర్మానించింది ఏమిటంటే... "నమ్మిన వారికి దేవుడున్నాడు. దెయ్యమూ ఉంది - నమ్మనివారికి ఏమీ లేదు"అని! కాబట్టి, గుడి, మసీదు, చర్చి, గురుద్వారా లాంటి అన్ని ప్రార్థనా స్థలాలలో ఈ తీర్మానాన్ని స్పష్టంగా రాసి బోర్డులు పెట్టాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. కానీ, ఒక్కచోట కూడా ఏ ఒక్కరూ అలా ఎందుకు బోర్డులు పెట్టడం లేదు? జనాన్ని ఎందుకు ఆలోచించుకోనివ్వడం లేదూ? మత పెద్దలు ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవాలి!

"దానితో అతనేం చేస్తాడూ?" -మనిషి

"ఏం చేస్తాడూ? తన బంధు మిత్రులకు గొప్పగా చూపించుకుంటాడు" - అని చెప్పింది దెయ్యం. "ఇతను చెబితే వాళ్ళంతా నమ్మేస్తారా?"

దయ్యం పెద్దగా నవ్వింది. "నమ్మినా, నమ్మక పోయినా వాళ్ళంతా కలిసి ఆ సత్యానికి అక్కడ ఓ గుడి కడతారు" అని చెప్పింది.

"గుడి కడితే సత్యం అందులో ఉండి పోతుందా?" అడిగాడు మనిషి అమాయకంగా - దెయ్యం మరింత పెద్దగా నవ్వింది.

"పిచ్చివాడా! నీకు తెలియదేమో. సత్యాన్ని బయట వీధిలో పడేసిన తరువాతే గుళ్ళో ఓ బొమ్మకు ప్రాణ ప్రతిష్ఠ చేస్తారు. అలాట శూన్యానికి పూజలు, భజనలు చేస్తుంటారు.

"మరి అప్పుడేమవుతుందీ?"

"ఏమవుతుందంటే... అప్పుడే నా పని మొదలవుతుంది. బయటపడేసిన సత్యాన్ని నేను చేజిక్కించుకుంటాను. దానితో ఇక ఓ ఆట ఆడిస్తాను చూస్కో - లోకంలో మారణ కాండ జరిపిస్తాను. పాలకుల మూర్ఖత్వాన్ని ఉపయోగించుకుని, మతకలహాలు, కొట్లాటలూ, సృష్టిస్తాను. అలా చూపిస్తానన్న మాట నా తడాఖా" అంది దెయ్యం! మనిషి భయకంపితుడయ్యాడు.

*** *** ***


ఈ కథలో మనిషితో కలిసి నడిచే దెయ్యం అంటూ ఏదీలేదు. అది మనిషిలోని వికృత భావనలకు ఒక సంకేతం! మనిషిలో మంచీ చెడూ ఎప్పుడూ కలిసే ఉంటాయి. అందులో అతను దేన్ని ఎప్పుడు ఎలా ఉపయోగిస్తాడన్న దాని మీదే సమాజ క్షేమం ఉంటుంది. ప్రజల జీవితాల్లో శాంతి భద్రతలు ఉంటాయి.

1980లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో సర్వమత సభలు జరిగాయి. ఇందులో ప్రపంచంలోని పద్నాలుగు మతాలకు చెందిన మతాధికారులు, పీఠాధిపతులు, స్వామీజీలు, పాస్టర్లు, ఇమామ్‌లు అందరూ పాల్గొన్నారు. దేవుడు ఉన్నాడా లేడా అనే విషయం మీద మూడు రోజులు ఏకధాటిగా చర్చలు జరిగాయి. చివరకు ఏకగ్రీవంగా అందరూ తీర్మానించింది ఏమిటంటే... "నమ్మిన వారికి దేవుడున్నాడు. దెయ్యమూ ఉంది - నమ్మనివారికి ఏమీ లేదు"అని! కాబట్టి, గుడి, మసీదు, చర్చి, గురుద్వారా లాంటి అన్ని ప్రార్థనా స్థలాలలో ఈ తీర్మానాన్ని స్పష్టంగా రాసి బోర్డులు పెట్టాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. కానీ, ఒక్కచోట కూడా ఏ ఒక్కరూ అలా ఎందుకు బోర్డులు పెట్టడం లేదు? జనాన్ని ఎందుకు ఆలోచించుకోనివ్వడం లేదూ? మత పెద్దలు ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవాలి! ఇచ్చుకోకపోతే పెద్ద ఎత్తున సర్వమత మహాసభలు నిర్వహించడం అందులో తీర్మానం చేయడం ఎందుకూ? వృథా ప్రయాస? సామాన్య ప్రజలకు ఏదో ఒక సందేశం ఇస్తే కదా ఆ సభల నిర్వహణ సార్థకమైనట్టు? పురాతన ధార్మిక సంస్థలలో, గుడి, చర్చ్, మసీదు లాంటి ప్రార్థనా స్థలాలలో ఏదైనా అద్భుతం దాగి ఉందంటే... అది మతానిదో, దేవుడిదో కాదు. వాటిని నిర్మించిన మనిషిదే ఆ గొప్పదనం. జనం ఈ సత్యాన్ని గ్రహిస్తే సగం సమస్యలు పరిష్కారమవుతాయి.

"విద్యార్థుల ఇష్టంతోనూ, వారి మేధస్సుతోనూ వారిలో పెరుగుతున్న చైతన్యంతోనూ సంబంధం లేకుండా వారిపై ఒక ముందస్తు లక్ష్యాన్ని రుద్దే విధంగా విద్యాలయాలు ఉండగూడదు. విద్యాలయాల్లో వారికి స్వేచ్ఛ ఉండాలి. స్వేచ్ఛగా సృజన చేసే అవకాశం ఉండాలి. అంతేగాని, అవి బానిసత్వంతో కూడిన యాంత్రికమైన కచ్చితమైన లక్ష్యాలు సాధించే విధంగా ఉండగూడదు."

- అంటోనియో గ్రాంసి;
ఇటాలియన్ మార్క్సిస్టు తత్త్వవేత్త.

మన భారతదేశంలోని విద్యా సంస్థల్లో ఇటీవలి కాలంలో ఏం జరుగుతూ ఉందో మనందరికీ తెలుసు. బెంగుళూరు మహానగర పాలక సంస్థ, బెంగుళూరు విశ్వవిద్యాలయంలో ఆలయం నిర్మించాలని నిర్ణయించింది. విద్యార్థులు తీవ్రంగా నిరసించారు. ఆ స్థలంలో గ్రంథాలయం నిర్మిస్తే విద్యార్థులందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డిమాండ్ చేశారు. కర్నాటక రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను కాషాయీకరణ చేయాలని కుట్ర చేస్తోందని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అయ్యింది.



మన భారతదేశంలోని విద్యా సంస్థల్లో ఇటీవలి కాలంలో ఏం జరుగుతూ ఉందో మనందరికీ తెలుసు. బెంగుళూరు మహానగర పాలక సంస్థ, బెంగుళూరు విశ్వవిద్యాలయంలో ఆలయం నిర్మించాలని నిర్ణయించింది. విద్యార్థులు తీవ్రంగా నిరసించారు. ఆ స్థలంలో గ్రంథాలయం నిర్మిస్తే విద్యార్థులందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డిమాండ్ చేశారు. కర్నాటక రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను కాషాయీకరణ చేయాలని కుట్ర చేస్తోందని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అయ్యింది.

"కర్మ, నుదిటిరాత, పునర్జన్మ సుకృతం అనే నమ్మకాలు దేశ ప్రగతికి అవరోధం. కులం, మతం ప్రాతిపదికగా గాక, లౌకికవాదం ప్రాతిపదికగా, సమానత్వం ఆధారంగా భారత పౌరులు మెలగాలి" అని సూచించారు. ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. భారతరత్న సాధించిన ఈ కన్నడి గుడి మాట నేటి ఈ కన్నడ రాష్ట్ర ప్రభుత్వపు చెవికి ఎక్కడం లేదా?

వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



వెట్టి చాకిరీలో 'పశుమిత్ర'లు

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముకగా ఉంటే వ్యవసాయానికి పశుసంపద వెన్నెముకగా ఉంది. తెలంగాణ ఎట్ ఎ గ్లాన్స్ అధ్యయనం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 2023 నాటికి మూడు కోట్ల యాభై లక్షల పశు సంపద ఉంటుందని అంచనా. రాష్ట్రంలో 70శాతం జనాభా వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. పాడి పశువుల పెంపకం చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ వనరుగా ఉండగా నిరుపేద కూలీలకు ప్రధాన జీవనోపాధి కల్పిస్తోంది. నేడు రాష్ట్రంలో సుమారు 29లక్షల కుటుంబాలు పశుపోషణ పై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు.

పశు సంవర్ధకశాఖ ప్రధాన ఉద్దేశం సమస్త మానవాళికి బలవర్ధకమైన ఆహారంగా పాలు, గుడ్లు, మాంసం అందించడం. వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణ చేపట్టడం ద్వారా పేద, నిరుపేదలకు సంవత్సరమంతా నిలకడైన ఆదాయం లభించేలా చూడటం. ఇందుకోసం గ్రామ స్థాయిలో ఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పాటు చేసి శాస్త్రీయ పద్ధతులలో పశు పోషణ చేపట్టి, అదనపు ఉత్పత్తిని సాధించడం ప్రభుత్వ లక్ష్యం.

జాతీయ వ్యవసాయ కమిషన్ సూచనల ప్రకారం ప్రతీ ఐదువేల పశువులకు ఒక వెటర్నరీ ఉండాల్సి ఉండగా మన రాష్ట్రంలో ఇరవై వేల పశువులకు కూడా లేదు. పశువైద్యం అందుబాటులో లేక రైతులు అవస్థలు పడుతున్నారు. చాలా గ్రామాలలో పశువుల ఆరోగ్యానికి సంబంధించిన సూచనలు, సలహాలు అందుబాటులో లేక పశువులు వ్యాధుల బారినపడి మృత్యువాత పడుతు న్నాయి. దీన్ని నివారించి పశువులకు క్షేత్ర స్థాయిలో ప్రాథమిక వైద్యం అందించడానికి స్వయం సహాయక బృందాలలో చురుకుగా ఉన్న మహిళలను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చి రైతుల ఇంటి ముంగిటే పశు వైద్య సేవలు అందిచడానికి ప్రభుత్వం కేంద్ర గ్రామీణ ఆరోగ్య మిషన్ నిధులతో సెర్ప్ సంస్థ ద్వారా పశుమిత్రలను నియమించింది.



కాసు మాధవి

దేశంలో వ్యవసాయ సంబంధిత ఆర్థికాభివృద్ధిలో ప్రముఖమైన పశు సంపదకు గ్రామ స్థాయిలో పశుమిత్రలు నిరంతరం అందుబాటులో ఉంటారు. వీరు వెనుకబడిన సామజిక తరగతుల పేద మహిళలు. మూగ జీవాలకు కండ్లు, ముక్కు, నోటి నుండి నీరు కారుట, ముట్టి తడి ఆరిపోయి ఉండుట, కుడితి తాగకపోవుట, మేత మేయక పోవుట, నెమరవేయకుండుట, పేడ పలుచగా ఎక్కువ సార్లు వేయుట వంటి లక్షణాలను ఎంతో నైపుణ్యంతో గుర్తించడం తోపాటు పురుగులు పడి చీము నెత్తురు కారుతున్న పశువులను అదుపులోనికి తెచ్చుకొని వాటి గాయాలకు ప్రాథమిక వైద్యం చేస్తారు. పశువులకు సోకే ఇరవై రకాల వ్యాధులకు, వైరస్‌లకు వ్యాక్సిన్లు వేస్తూ ప్రథమ చికిత్స చేస్తారు. వైద్యం చేస్తున్న క్రమంలో వాటి దాడులకు గురవుతూ, పశు వైరస్‌లు అంటుకొని అనారోగ్యానికి గురవుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత గల పని చేస్తున్న పశుమిత్రలకు ఎలాంటి వేతనం లేదు. గుర్తింపు కార్డులు లేవు. ఈఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యం లేదు. ప్రమాద బీమాలేదు. యూనిఫాం లేదు. ఇతర మౌలిక సదుపాయాలు లేకుండా ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకోవడం దుర్మార్గం. దేశ ప్రజలందరికీ ఉపాధి చూపవలసిన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి స్కీమ్ వర్కర్ల పేరిట కార్మికుల శ్రమను దోచుకోవడం బాధ్యతా రాహిత్యం. ఇతర స్కీమ్ వర్కర్లకు ఇస్తున్నట్టుగా పశుమిత్రలకు కూడా వేతనం నిర్ణయించి బడ్జెట్ కేటాయించాలి.

రైతులకు సబ్సిడీ మీద పశువులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వం పశువుల ఆరోగ్య పరిరక్షణ చేస్తున్న పశుమిత్రలకు వేతనం ఇవ్వకుండా రైతుల వద్దనే సేవా రుసుం వసూలు చేసుకోమనడం సరైందికాదు. ఇది రైతుల నెత్తిన భారం మోపడమే. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అంటున్న ముఖ్యమంత్రి రైతుపై భారం మోపకుండా, పశుమిత్రల పనిని గుర్తించి పనికి తగిన వేతనం చెల్లించే వరకు రైతులను కలుపుకుని పశుమిత్రలు ఐక్య ఉద్యమానికి సిద్ధం కావాలి.

సెల్:9492585106

ప్రజల్లో మత చీలికలు... ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ వ్యూహం

ఈ ఏడాది చివర్లో రాష్ట్ర ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో... ప్రజల మధ్య చీలికలు సృష్టించి లబ్ధి పొందాలన్న బీజేపీ సహజమైన వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఆ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఒక్క మంత్రిని కూడా పంపని, ఒక్క బాధిత కుటుంబానికి కూడా నష్టపరిహారం అందించని కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ఏం చెప్పాలి? చర్చిపై రాళ్ల దాడిలో ఒక పోలీసు అధికారి గాయపడిన తర్వాత మాత్రమే అరెస్టులు జరిగాయి. మహిళలతో సహా బాధితులు ఎన్ని ఫిర్యాదులు చేసినా, కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా వారెవరినీ అరెస్టు చేయలేదు. నారాయణపూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కూడా. సరిగ్గా బాధితులకు అత్యవసరమైన సందర్భాలలో ఆయన కనిపించకుండా తప్పుకున్నారు. భారత దేశాన్ని ఏకం చేసే మార్గం ఇదేనా?

బక్కపల్చటి శరీరం, చారెడంత గోధుమ రంగు కళ్లు వున్న ఆమె... చేతుల మీది గాయాలు కనిపించకుండా శాలువా చుట్టుకుంది. గొంతు మృదువుగా ఉన్నప్పటికీ మనుగడ కోసం చేసిన పోరాటాల లోంచి వచ్చిన గంభీరత ఆమె స్వరంలో ధ్వనించింది. ఆమె ఇలా చెప్పింది... "మా గ్రామం (రామావంద్)లోని సంస్కృత భవన్‌లో సమావేశాలు జరిగేవి. ఆదివారం ప్రార్థనలకు వెళ్లవద్దని అక్కడ హెచ్చరిం చారు. డిసెంబర్ 27న నా భర్తను బైటకు లాగి కొట్టడం మొదలుపెట్టారు. తనను ఫుట్‌బాల్ మాదిరిగా అందరూ వంతులవారీగా తన్నారు. గ్రామ పెద్దలకు బంధువులైన ఆరుగురు మహిళలు నన్ను ఒడిసి పట్టుకున్నారు. మగవాళ్ళు నన్ను నోటికొచ్చినట్లు తిడుతూ, నాకు గుణపాఠం నేర్పమని వారికి చెప్పారు. నా జుట్టు పట్టుకుని పీకారు. నా తల మీద పదే పదే కొట్టారు. అంటితో ఆగక తలను నేలకేసి కొట్టారు. ఈ ఘర్షణలో నా జాకెట్ చిరిగిపోయింది. మా గ్రామంలో క్రీస్తును నమ్మిన పదకొండు మంది మహిళలు, ఒక యువకుడితో సహా అందరూ ఇలాంటి హింసను ఎదుర్కొన్నారు. మీరు ప్రశాంతంగా బతకాలను కుంటే మా సమాజానికి తిరిగి రండి ('ఘర్ వాపస్') అన్నారు. నేను ఎలాంటి తప్పు చేయలేదు. ప్రార్థనలు మాత్రమే చేశానన్నాను". ఆమెకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైంది. కానీ ఎటువంటి చర్య తీసుకోలేదు.



బృందా కరత్

ఉత్తర బస్తర్‌లోని కంకేర్, కొండగావ్, నారాయణపూర్ జిల్లాల్లోని క్రైస్తవ సమాజానికి చెందిన 500 ఆదివాసీ కుటుంబాలలో ఆమె కుటుంబం కూడా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో, గత ఏడాది అక్టోబర్ నుంచి తమపై జరిగిన మూకుమ్మడి దాడుల కారణంగా వారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రతినిధి బృందంతో కలిసి ఇటీవల బాధిత ప్రాంతాలకు వెళ్లినప్పుడు మహిళల మీద జరిగిన అత్యంత క్రూరమైన దాడుల గురించి చాలా తక్కువగా పేర్కొన్నారు. డిసెంబరులో 1,500 మంది ప్రజలు తమ ఇళ్లను విడిచిపెట్టి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాలు, చర్చిలు, బంధువులు-స్నేహితుల ఇళ్లలో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. 200 మందికి పైగా ఇప్పటికీ తిరిగి స్వగ్రామాలకు రాలేకపోయారు. నారాయణపూర్‌లోని ప్రధాన చర్చి, "ప్రార్థన గదులు"తో సహా ఇతర జిల్లాల్లోని చర్చిలను ధ్వంసం చేశారు. కొన్ని చోట్ల దగ్ధం చేశారు. ఇళ్లను పగలగొట్టి దోచుకున్నారు. నారాయణపూర్ చర్చిపై దాడి కేసుకు సంబంధించి అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఇతర స్థానిక నాయకులు ఉన్నారు.

మత మార్పిళ్లకు వ్యతిరేకంగా భజరంగ్ దళ్, విహెచ్‌పి వంటి ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థల నేతృత్వంలోని "ఘర్ వాపసీ" ప్రచారం కొత్తదేమీ కాదు. తేడా ఏమిటంటే ఈసారి 'జన్ జాతి సురక్షా మంచ్' (జెఎస్ఎం) వంటి వేదికలను సృష్టించడం ద్వారా, మత మార్పిళ్ల నుంచి తమ సంప్రదాయాలను రక్షించుకోడానికి ఆదివాసీలు స్వయంగా లేవనెత్తిన ఒక ఆకస్మిక ఉద్యమంగా దీనిని చూపించారు. అయితే ఇది అలాంటిది కాదు.

నవంబర్ మొదటి వారంలో, జెఎస్ఎం చేసిన నిరసన ప్రదర్శనకు ఆ ప్రాంతానికి చెందిన మాజీ బీజేపీ ఎమ్మెల్యే, గిరిజన నేత నాయకత్వం వహించారు. కామెర్ల వ్యాధితో మరణించిన 55ఏండ్ల ఆదివాసీ క్రైస్తవ మహిళ చైతీ బాయి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తమ సొంత భూమిలో పూడ్చిపెట్టాలని డిమాండ్ చేస్తూ రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. గ్రామంలో ఒక క్రైస్తవుని ఖననం చేయడం 'గ్రామ దేవతకు కోపం తెప్పిస్తుంది. గ్రామాన్ని నాశనం చేస్తుంది' అని చెప్పుకొచ్చాడు. చైతీ బాయి కుటుంబానికి ఎంతగా బెదిరింపులు వచ్చాయంటే... వారు గ్రామం విడిచి వెళ్లిపోయేంతగా. మరుసటి రోజు రాత్రి అతని అనుచరులు సమాధిని తవ్వి ఆమె మృతదేహాన్ని బయటకు లాగారు. ఇలాంటి చట్టవిరుద్ధమైన, అనాగరికమైన చర్యపై అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా మృతదేహాన్ని తీసుకెళ్లి 100కిలోమీటర్ల దూరంలోని క్రైస్తవ శ్మశానవాటికలో పాతిపెట్టింది. దీంతో జెఎస్ఎం ఇటువంటి మరిన్ని చర్యలకు పాల్పడేందుకు



ఊతమిచ్చినట్లయింది. దాంతో క్రైస్తవుల మీద హింసాత్మక దాడులు మరింత పెరిగాయి.

ఇలాంటి చర్యలకు ఆదివాసీ సంస్కృతుల రక్షణకు ఎటువంటి సంబంధం లేదు. చనిపోయినవారిని ఆదివాసీలు పాతిపెడతారు. చనిపోయినవారిని క్రైస్తవులు తమ స్వంత భూమిలో పాతిపెట్టినప్పుడు... భారతదేశంలో ఆదివాసీలు నివసించే ఏ ప్రాంతంలోనూ సమస్య కాలేదు. ఇది ఆదివాసీ సంస్కృతులను హిందుత్వీకరించేందుకు తయారు చేసిన ఎజెండా మాదిరిగా కనిపిస్తోంది.

ఛత్తీస్‌గఢ్‌లో 2006లో అప్పటి బీజేపీ ప్రభుత్వ హయాంలో బలవంతపు మత మార్పిళ్లకు వ్యతిరేకంగా ఒక చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే ప్రస్తుతం మత మార్పిళ్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారానికి భిన్నంగా... బలవంతంగా మత మార్పిడి చేసినట్లుగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మనస్సాక్షి స్వేచ్ఛకు రాజ్యాంగం కల్పించిన హక్కుపై దాడి జరుగుతోంది.

ఆదివాసీ ప్రాంతాలలో దేవాలయాలు నిర్మించబడుతున్నాయి. కీర్తనలు, భజన మండళ్లు నిర్వహించబడుతున్నాయి. ఆదివాసీ విశ్వాసాలు, సంస్కృతులకు దూరంగా విగ్రహారాధనకు అనుసంధానించబడిన ఆచారాలు బహిరంగంగా ప్రచారం చేయబడుతున్నాయి. ఆదివాసీ సంప్రదాయాల దృష్టి కోణం నుండి చూసినట్లయితే వాటిని వారి మీద రుద్దినట్టుగా పరిగణించవచ్చు. మత మార్పిడికి ఏర్పాటు చేసినట్టు భావించవచ్చు. ఆదివాసీలలోని క్రైస్తవ విశ్వాసులను "ఇంటికి తిరిగి" రమ్మని బెదిరించినప్పుడు, ఏ ఇంటిని సూచిస్తారు? ఇతర మతాల నుండి వేరుగా ఉన్న ఆదివాసీల నమ్మకాలు, విశ్వాసాలను సూచించడానికి వీలుగా జనగణన పత్రంలో "సర్నా, ఆదివాసి" కాలమ్‌ను జోడించాలన్న తీర్మానాన్ని జార్ఖండ్‌లోని జెఎంఎం ప్రభుత్వం నేతృత్వంలోని అసెంబ్లీ ఆమోదించింది.

రెండు ఇనుప ఖనిజం ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నారాయణపూర్‌లోని ఆదివాసీలు పోరాడుతున్నారు. చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా గ్రామసభల అనుమతి లేకుండానే ఈ ప్రాజెక్టులను తీసుకొచ్చారు. సుప్రీంకోర్టు నిలిపివేసిన ఒడిశా నియమ్‌గిరి ప్రాజెక్టు మాదిరిగానే... ఈ ప్రాజెక్టులు ఆదివాసీలు పవిత్రమైనవిగా భావించే ప్రాంతాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. దీనిపై జన్ జాతి సురక్షా మంచ్ మౌనంగా ఉంది. ఘర్ వాపసీ ప్రచారం ద్వారా... గ్రామసభ అనుమతి లేకుండా గ్రామాల్లోకి క్రైస్తవ పాస్టర్ల ప్రవేశాన్ని నిషేధించే తీర్మానాలను ఆమోదిస్తున్నారు. తద్వారా గ్రామసభ హక్కును వక్రీకరిస్తున్నారు.

ఈ ఏడాది చివర్లో రాష్ట్ర ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో... ప్రజల మధ్య చీలికలు సృష్టించి లబ్ధి పొందాలన్న బీజేపీ సహజమైన వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఆ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఒక్క మంత్రిని కూడా పంపని, ఒక్క బాధిత కుటుంబానికి కూడా నష్టపరిహారం అందించని కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ఏం చెప్పాలి?

చర్చిపై రాళ్ల దాడిలో ఒక పోలీసు అధికారి గాయపడిన తర్వాత మాత్రమే అరెస్టులు జరిగాయి. మహిళలతో సహా బాధితులు ఎన్ని ఫిర్యాదులు చేసినా, కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా వారెవరినీ అరెస్టు చేయలేదు. నారాయణపూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కూడా. సరిగ్గా బాధితులకు అత్యవసరమైన సందర్భాలలో ఆయన కనిపించకుండా తప్పుకున్నారు. భారత దేశాన్ని ఏకం చేసే మార్గం ఇదేనా?

- 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో

రోగనిరోధక శక్తిని పెంచుతాయి



మారుతున్న సీజన్‌తో చాలా మంది దగ్గు, జలుబు, వైరల్ ఫీవర్, అలర్జీ వంటి అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. బలహీనమైన రోగనిరోధక శక్తి కారణంగా ఇటువంటి సమస్యలు తలెత్తుతాయి. దీన్ని నివారించడానికి మన రోగనిరోధక శక్తిని పెంచుకోవడం చాలా ముఖ్యం. మన శరీరంలోని రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సీజనల్ పండ్లు, కూరగాయలను తీసుకోవడం చాలా అవసరం. సీజన్ మారుతున్న కొద్దీ మిమ్మల్ని ఇబ్బంది పెట్టే జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందాలంటే కొన్ని పండ్లు మీకు మేలు చేస్తాయి. అందుకే మీరు తినే ఆహారంలో ఈ ఐదు పండ్లను చేర్చుకోవడం వల్ల మీ రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు. అంతే కాదు బరువు నియంత్రణలో కూడా ఇవి చాలా సహాయపడతాయి. ఇంతకీ ఆ పండ్లు, వాటి ప్రయోజనాలేంటో చూద్దాం...

బొప్పాయి: అన్ని సీజన్లలో చాలా సులభంగా లభించే పండ్లలో బొప్పాయి పండు ఒకటి. ఈ పండును ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ పండు బరువు నియంత్రణకు కూడా చాలా ప్రభావవంతంగా ఉంటుంది. మంచి రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

స్ట్రాబెర్రీ: స్ట్రాబెర్రీ వసంత రుతువులో ఉత్తమ పండుగా పరిగణించబడుతుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. అదనంగా స్ట్రాబెర్రీలు ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడంలో కూడా చాలా ప్రభావవంతంగా ఉంటాయి.

బ్లాక్‌బెర్రీ: బ్లాక్‌బెర్రీలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. బ్లాక్‌బెర్రీ మెదడు ఆరోగ్యానికి మంచిది. అంతేకాకుండా బ్లాక్ బెర్రీ శరీరంలోని జీవక్రియను వేగవంతం చేయడంలో, మధుమేహం లక్షణాలను నియంత్రించడంలో ప్రభావవంతంగా పని చేస్తుంది.

చెర్రీస్: శక్తిని పెంచడంలో, నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో, మన మనసును విశ్రాంతిగా ఉంచడంలో చెర్రీస్ ఉపయోగపడతాయి. అంతేకాకుండా చెర్రీస్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో రక్తంలో యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది.

నారింజ: సాధారణంగా మనలో చాలామంది చలికాలంలో చలి కారణంగా ఈ పండ్లను తినరు. అయితే ఆరెంజ్ శీతాకాలపు పండు. నారింజలో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి.

ఇట్ల చేద్దాం



కండ్ల కింద నల్లటి వలయాలను తొలగించేందుకు దోసకాయ ఉత్తమమైనది. దోసకాయ ముక్కలు లేదా తురుము కనురెప్పల మీద పది నిమిషాల పాటు ఉంచండి. దీన్ని రోజుకు ఎన్ని సార్లు రిపీట్ చేసినా కూడా పర్వాలేదు. కండ్ల చుట్టూ ఉన్న నల్లటి మచ్చలను తొలగించడంలో సహాయపడుతుంది.

దృష్టిపెడితే చాలు ఏదైనా సాధించొచ్చు

బిజినెస్ ఉమెన్

నెదురుగొమ్ముల శిల్ప... కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు... తరతరాలకి తరగని సిరులవుతారు.. అన్న మాటలను అక్షరాలా నిజం చేసిన మహిళా పారిశ్రామికవేత్త. రాళ్ళలో నిదురపోతున్న బొమ్మలకు ప్రాణం పోసే వ్యక్తి. పట్టు పురుగులను పెంచి పట్టుదారం తీసే శిల్పి. పేరుకు తగినట్టుగా తన జీవనాన్ని అద్భుతంగా మలుచుకొని అనతి కాలంలోనే అందరి మన్ననలకు పాత్రురాలైన ఆమె విజయ ప్రస్థానం నేటి మానవిలో...



శిల్ప తల్లితండ్రులు నిర్మల, పొనుగోటి వెంకటేశ్వరరావు. వీరి స్వస్థలం సూర్యాపేట. భర్త నెదురుగొమ్ముల రవీందర్ రావు. వీరికొక పాప లక్ష్మీ శివాని. రైతు కుటుంబంలో పుట్టిన శిల్ప పల్లెటూరు వాతావరణంలో పెరిగి డిగ్రీ వరకు చదివారు. మొదట్లో చీరల వ్యాపారం చేసారు. ఇంకా ఏదో చేయాలనే తపన తనలో ఆరాటపెడుతుండగా భిన్నంగా చేయగలిగిన వ్యాపారాలేమిటి అన్న దిశలో తన ఆలోచనలను కొనసాగించారు. డెయిరీ పెట్టుకుందామా అనుకున్నారు. అది నడపడం కొంచం కష్టమనిపించింది. అప్పట్లో ఈమో ఫామ్స్ నడుస్తున్నాయి. ఒక ఫామ్ తీసుకుని మనం ఏదైనా చేయగలమా అని భర్తతో కలిసి బాగా ఆలోచించారు.

స్వయంగా పరిశీలించి

చుట్టు పక్కల గ్రామాల్లో ఫామ్స్‌లో ఎవరెవరు ఏమేమి చేస్తున్నారో ముందుగా పరిశీలించారు. అక్కడ కొందరు సెరికల్చర్ చేయడం శిల్ప దృష్టిని బాగా ఆకట్టుకుంది. పట్టుపురుగుల పెంపకం, వాటి నుంచి పట్టును వెలికి తీసే ప్రక్రియను సెరికల్చర్ అంటారు. సెరికల్చర్ చాలా దేశాల్లో ముఖ్యమైన దేశీయ పరిశ్రమ. ఈ పెంపకం ఎలా జరుగుతుందో తెలుసుకునేందుకు స్వయంగా ప్రతిరోజూ పట్టుపురుగుల పెంపకం చేస్తున్న ప్రాంతాలకు వెళ్ళి బాగా పరిశీలించి క్షుణ్ణంగా పరిశీలించేవారు. ఒక రైతు తన పొలంలో ఈ పెంపకంతో నెలకు లక్షరూపాయలు సంపాదించడం చూసాక మొదట కొన్ని ఎకరాల భూమి ఈ పెంపకానికి కావలసిన ప్రధానమైన వనరుగా భావించారు. వెంటనే సూర్యాపేట చుట్టుపక్కల గ్రామాల్లో కొన్ని ఎకరాలు స్థలం సేకరించే పనిని ప్రారంభించారు.

శిక్షణ తీసుకుని

తిమ్మాపురంలో తొమ్మిది ఎకరాల స్థలం కొనుగోలు చేసి తమ వ్యాపారం ఆ గ్రామం నుంచే మొదలు పెట్టారు. మొదట ఆ భూమి మల్బరి సాగుకు అనుకూలంగా ఉందో లేదో అని సాయిల్ టెస్ట్ చేయించారు. వ్యాపారం చేయాలనే సంకల్పం బలంగా ఏర్పరచుకున్నాక పనితనం, పట్టుదల కలిగిన శిల్ప అందులో నైపుణ్యాలను ఆకళింపు చేసుకోవాలనుకున్నారు. మల్బరి సాగు, పట్టుపురుగుల పెంపకం ఎలా చేయాలో బెంగుళూరుకు వెళ్ళి శిక్షణ తీసుకున్నారు. ఇందుకు వి హబ్ అనే సంస్థ వారు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు శిల్పకు అకౌంటింగ్, మార్కెటింగ్, బ్యాంకింగ్ వంటి అంశాలపై అవగాహనకు, క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి తోడ్పడ్డాయి.

తెలంగాణలో మొదటి మహిళగా...

రెండు ఎకరాల పొలంలో నెలకు 60 నుంచి 70 వేల వరకు సంపాదించ వచ్చని గ్రహించిన శిల్ప స్వయంగా కొన్నాళ్ళు మల్బరి మొక్కల పెంపకం చూసి పట్టుపురుగుల పెంపకం మొదలు పెట్టారు. 2014లో మొదలు పెట్టిన మొదటి సాగులో శిల్పకు వచ్చిన మొదటి లాభం నలభై వేలు. తర్వాత క్రమంగా పెంపకాన్ని దశల వారీగా పెంచుకుంటూ వచ్చారు. పట్టు పరిశ్రమలో ఛాకీ ప్రధాన ఘట్టం. ఉష్ణోగ్రత, తేమ, పారిశుధ్యం వీటిని గమనిస్తూ ఉండాలి. నాణ్యమైన మల్బరీ ఆకులను పట్టుపురుగులకు ఆహారంగా ఇవ్వాలి. ఇందుకోసం ఆటోమేటిక్ రీలింగ్ మిషన్ అవసరం ఎంతైనా ఉంది. ఈ మెషీన్‌ని ప్రభుత్వ సబ్సిడితో కొనుగోలు చేసిన తెలంగాణలోనే మొదటి మహిళ శిల్ప.

ఒక ఛాలెంజింగా...

ఒక తల్లి తన పిల్లలను సరైన పోషక పదార్థాలు పెట్టి పెంచితే ఆరోగ్యవంతంగా బిడ్డ ఎలా ఎదుగుతుందో అలాగే పట్టుపురుగులను కూడా నాణ్యమైన మల్బరీ ఆకులను దశలవారీగా అందజేస్తూ, ఎటువంటి తేడా లేకుండా తగిన ఉష్ణోగ్రత మధ్య పెంచితే మంచిగా ఎదుగుతాయి. దానికోసం రేరింగ్ షెడ్ ఏర్పాటు చేయాలి. పట్టుపురుగులకు వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలి. ఛాకీ పద్ధతి ద్వారా పట్టుపురుగులను పెంచి పట్టుగూళ్ళు అల్లడానికి అనువైన స్థలం, వాతావరణం, వెలుతురు అందించాలి. అప్పుడే సరైన పట్టుగూళ్ళు చేతికి వస్తాయి. మార్కెట్‌కి పంపేటపుడు కూడా గూళ్ళు చెదరకుండా పంపాలి. ఇక తగిన ధరను అందుకోవడంతో ప్రక్రియ ముగుస్తుంది. అన్ని దశలలో అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ తగిన చర్యలు చేపట్టాలి. ఇంత కష్టాన్ని తన రోజు వారి జీవితంలో భాగం చేసుకుని భర్త సహాయ సహకారాలతో పనిచేస్తుంది శిల్ప. ఈ మొత్తం ప్రక్రియలో కావలసిన చోట పనివాళ్ళను పెట్టుకుని వారికి జీతాలు ఇస్తూ ఒక ఛాలెంజింగా పట్టుపురుగుల పెంపకాన్ని కొనసాగిస్తున్నారు శిల్ప.





నా కంటూ ఓ గుర్తింపు

"మొదట చేసిన చీరల వ్యాపారం నాకు మాత్రమే సంతృప్తి నిచ్చింది. కానీ పట్టు పురుగుల పెంపకం నాతో పాటు మరికొందరికి జీవనోపాధిని ఇవ్వగలిగాననే సంతృప్తిని ఇచ్చింది. అలాగే పట్టుపురుగుల పెంపకం ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తగా నాకంటూ ఓ గుర్తింపు తెచ్చి పెట్టింది. అన్నిటికీ మించి అంతులేని ఆత్మవిశ్వాసాన్ని నాలో నింపింది. పట్టుపురుగుల పెంపకంలో కొనసాగాలని నిర్ణయించుకున్న తర్వాత ప్రభుత్వ సహకారం లభించింది. ఆటోమేటిక్ రీలింగ్ మెషీన్ కొనుగోలు చేసినపుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వడంతో ఆకులను కత్తిరించడం మరింత సులభమైంది" అంటారు శిల్ప.

మహిళలు ముందుకు వస్తే...

"మగవారు రైతులుగా పంటలను పండిస్తున్నారు. మల్బరీ సాగులో పట్టుపురుగుల పెంపకంలో పట్టుగూళ్ళ తయారీ ద్వారా నేను మహిళా రైతుగా, రైతే రాణిగా నిలబడ్డాను. నాలాగా మరికొందరు మహిళలు ముందుకు వస్తే వారికి పట్టుపురుగుల పెంపకంలో మెళకువలను, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తాను" అంటూ ఎంతో ఉత్సాహంగా చెబుతున్నారు శిల్ప. ఆమె పనితనాన్ని ప్రశంసిస్తూ ఎన్నో అవార్డులు ఆమెను వెదుక్కుంటూ వచ్చాయి. ఉత్తమ CRC అవార్డు, ఉత్తమ రైతు, రైతు మిత్ర అవార్డులను మహిళా రైతుగా సెరికల్చర్ చేస్తూ శిల్ప అందుకున్నారు.

సమయం వృధా చేసుకోవద్దు

సేంద్రీయ పద్ధతిలో పట్టుపురుగులను పెంచి పట్టుదారం ఉత్పత్తికి దోహదం చేసే ఎస్.ఆర్. సిల్క్ నిర్వహణలో శిల్ప నైపుణ్యం కొత్తగా పట్టుపురుగుల పెంపకం చేపట్టే వారందరికీ మార్గదర్శకం. మహిళలు ఏ రంగంలో నైనా రాణించగలరు అని నిరూపిస్తూ పట్టుపురుగుల పెంపకంలో తనదైన విశిష్ట స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. పనిచేయాలన్న ఉత్సాహం, సాధించాలన్న పట్టుదలతో పాటు టీవీలు చూస్తూ సమయం వృధా చేయకుండా సమాజానికి పనికొచ్చే పనులపై దృష్టి పెడితే మనం ఏదైనా సాధించవచ్చంటారు శిల్ప.

వి హబ్ కృషి గొప్పది

శిల్ప జీవనం స్ఫూర్తిదాయకం. మహిళలకు చిన్న వయసులోనే పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతున్న వి హబ్ వారి కృషి ఎంతో గొప్పది. పట్టుపురుగుల పెంపకంలో నాణ్యమైన పట్టుదారం అందించే పట్టుగూళ్ళ తయారీ పరిశ్రమ సర్వదా ప్రశంసనీయం. శిల్ప ఏర్పరిచిన బాటలో మరెందరో మహిళలు ముందుకు సాగి పట్టుపురుగుల పెంపకంలో మంచి అభివృద్ధిని సాధించాలని మనసారా కోరుకుందాం.

- డా. సమ్మెట విజయ

ఒక్కో పోస్టుకు 705 మంది పోటీ

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తులొచ్చాయని వివరించారు. పరీక్ష తేదీలను త్వరలోనే ఖరారు చేసి ప్రకటిస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుల సంఖ్య ఆధారంగా గ్రూప్-2కు సంబంధించి ఒక్కో పోస్టుకు 705 మంది పోటీ పడుతున్నారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 29న టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే 439 పోస్టులకు 2015, డిసెంబర్ 30న తొలి గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన విషయం విదితమే. ఆ తర్వాత 593 గ్రూప్-2 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో 2016, సెప్టెంబర్ ఒకటో తేదీన 1,032 పోస్టుల భర్తీకి గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసింది. గ్రూప్-2కు 7,89,985 మంది దరఖాస్తు చేశారు. అదే ఏడాది నవంబర్ 11,13 తేదీల్లో నిర్వహించిన రాతపరీక్షల 5.17 లక్షల మంది హాజరయ్యారు. అంటే తొలి గ్రూప్-2 కంటే ప్రస్తుతం 2,38,042 దరఖాస్తులు తగ్గడం గమనార్హం. అప్పుడు ఒక్కో పోస్టుకు 765 మంది పోటీ పడ్డారు. ఇప్పుడు ఒక్కో పోస్టుకు 705 మంది పోటీ పడుతున్నారు.

కూలుస్తాం.. పేలుస్తామంటే... డిపాజిట్ కూడా రాదు

నవతెలంగాణ -యాదగిరిగుట్ట

కూలుస్తాం.. పేలుస్తామని చిల్లర మాటలు మాట్లాడితే ప్రతిపక్షాలకు వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టులు, సచివాలయం నిర్మిస్తుంటే.. వాటిని పేల్చేస్తాం కూల్చేస్తాం అని ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని విమర్శించారు. పునాదులు వేసేవారి వెంట ఉంటారో.. కూల్చేవారి వెంట ఉంటారో ప్రజలు తేల్చుకోవాలని అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని సైదాపురం సమీపంలో

నిర్మించనున్న 100 పడకల ఆస్పత్రికి గురువారం మంత్రి తన్నీరు హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో రూ.35 కోట్లతో ఆస్పత్రిని నిర్మించనున్నారు. అనంతరం యాదగిరిగుట్టలో బీఆర్ఎస్ ఆలేరు నియోజకవర్గ సమావేశం డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాల కోసం బడ్జెట్లో రూ.1000 కోట్లు కేటాయించామని, ఇప్పటికే 9 నోటిఫికేషన్లు విడుదల చేశామని చెప్పారు. ఇది చూసి ఓర్వలేని బీజేపీ నాయకులు ఉద్యోగాలు ఇవ్వడం కూడా కుట్ర అని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. యాదగిరిగుట్ట ప్రజలకు ఒకరోజు ముందే 100 పడకల ఆస్పత్రి ద్వారా కేసీఆర్ జన్మదిన కానుక అందిందని చెప్పారు. నల్లగొండ జిల్లాలో పెద్ద పెద్ద నాయకులు ఉన్నా గతంలో ఒక్క మెడికల్ కాలేజ్ కూడా ఏర్పాటు చేయలేదని, తాము ఇప్పటికే రెండు మెడికల్ కాలేజీలు స్థాపించామని త్వరలోనే యాదాద్రిలో కూడా ప్రకటిస్తామన్నారు. తెలంగాణలో లక్ష జనాభాకు ప్రస్తుతం 19 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయనీ, దేశంలో ఇలా ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. యాదాద్రిని భూలోక వైకుంఠంగా నిర్మించారని కొనియాడారు. ఆలేరు నియోజకవర్గం చాలా వెనుకబడిన ప్రాంతమని ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆలేరుకు సాగునీరు రప్పిస్తామన్నారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు యాదగిరిగుట్టలో ఆస్పత్రిని మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆస్పత్రికి శంకుస్థాపన కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి, ఆర్డీఓ భూపాల్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్మెన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డమీది రవీందర్ గౌడ్, జెడ్పీ వైస్ చైర్మెన్ బిక్కు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేశం పరువు పోతున్నది

బీబీసీపై ఐటీ రైడ్ చేయడం దారుణమని, ఇది చూసి జనం నవ్వుకుంటున్నారని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బీబీసీ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సంస్థ అని, ఆ సంస్థపై దాడి చేసి దేశం పరువు తీసేలా కేంద్రం వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీబీసీలో ఒక వార్త వచ్చిందని తెల్లారి ఐటీ దాడులు చేయించారని, ప్రపంచం ముందు దేశం పరువు పోతున్నదని అన్నారు.. నాయకులకు ఓపిక, సమాధానం చెప్పే శక్తియుక్తులు ఉండాలని, ఇలా దాడులు సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఐటీ, ఈడీలను తోలుతా అంటే దేశం పరువు పోదా? అని ప్రశ్నించారు

యాదాద్రీశున్ని దర్శించుకున్న మంత్రి దంపతులు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని మంత్రి హరీశ్‌రావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. గర్భాలయంలో దర్శనానంతరం ఆశీర్వచనం చేసి ప్రసాదాలను అందజేశారు.

గవర్నర్ రాజకీయ రంగ ప్రవేశం చేయకూడదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాస్వామ్యం. బహుళపార్టీ ప్రజాస్వామ్యం అంటే.. మనం పొత్తుల యుగంలో వున్నాం. అయితే, ఎన్నికల ముందు కూటమి అనేది... ఆయా పార్టీల రాజకీయ సిద్ధాంతాలను బట్టి ఉంటుంది. బీజేపీ - శివసేన పార్టీల మధ్య ఎన్నికలకు ముందు పొత్తు వుంది. ఎన్నికల్లో పార్టీలు ఓటర్ల ముందుకెళ్లాంటే.. స్వతంత్రంగా కాకుండా.. కూటమి పార్టీల భాగస్వామ్య రాజకీయ ఎజెండాగానే వెళతాయి. ఓటరు కూడా.. వ్యక్తిగా కాకుండా రాజకీయ సిద్ధాంతాలకు, పార్టీ ప్రాజెక్టులకే ఓటు వేస్తాడు. గుర్రపు వ్యాపారం అనే మాట వింటుంటాం. ఈ మాటకు తగ్గట్టుగానే.. ఎవరికి వ్యతిరేకంగా (కాంగ్రెస్, ఎన్‌సీపీ) ఉద్ధవ్ వ్యతిరేకంగా పోటీ చేశారో.. చివరకు ఆ పార్టీల పొత్తుతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అందుకే ఆ ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలే వ్యతిరేకంగా ఓటు వేశారు' అని కోర్టులో వాదించారు.

కాగా, తుషార్ మెహతా వాదనలపై.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై చంద్రచూడ్ మాట్లాడుతూ... గవర్నర్ కార్యాలయం నుంచి ఇలాంటి ప్రకటనలు రాకూడదని అన్నారు. 'గవర్నర్ ఇదంతా చెబితే ఎలా వినగలరు? ప్రభుత్వ ఏర్పాటుపై గవర్నర్ ఇలా ఎలా చెబుతారు? వారు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినప్పుడు విశ్వాస ఓటు వేయమని గవర్నర్ అడిగారు. గవర్నర్ రాజకీయ రంగ ప్రవేశం చేయకూడదు అని మాత్రమే మేము చెబుతున్నాము' అని వ్యాఖ్యానించారు. ఈ కేసులో చాలా తీవ్రమైన రాజ్యాంగపరమైన ప్రశ్నలు ఉత్పన్నమయ్యే అవకాశముందని బెంచ్‌లోని న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ హిమా కోహ్లి.. అభిప్రాయపడినట్టు ది ట్రిబ్యూన్ తెలిపింది. ఈ కేసు నబమ్ రెబియా కేసును తలపిస్తుందని బెంచ్ అభిప్రాయపడింది.

భగత్‌సింగ్ జీవితాన్ని చదవండి

(మొదటిపేజీ తరువాయి)

అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశ యువతకు భగత్‌సింగ్ రోల్ మోడల్ అని అన్నారు. ఆయన ఆశయాలు, లక్ష్యాల గురించి చాలా మందికి తెలియదనీ, వాటిని నేటి యువతకు తెలియజేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఆనాటి స్వాతంత్ర్య పోరాటంలో విప్లవయోధుల పాత్ర కీలకమన్నారు. వారి త్యాగాలు మరువలేనివని శ్లాఘించారు. మానవాళి విముక్తి కోసం కృషి చేస్తున్నది కమ్యూనిస్టులేనని ఈ సందర్భంగా తమ్మినేని పునరుద్ఘాటించారు.

త్రిపురలో భారీ పోలింగ్



(మొదటిపేజీ తరువాయి)

జారీ చేశారు. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు రాష్ట్రవ్యాప్తంగా 3337 పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ జరిగింది. వీటిలో 1100 పోలింగ్ స్టేషన్ల సున్నితమైనవి కాగా 28 సమస్యాత్మకమైనవిగా గుర్తించి తగిన ఏర్పాట్లను చేశారు. వివిధ పార్టీల నుంచి మొత్తం 259 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రాష్ట్రంలో మొత్తం 28.13 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 13.99 లక్షల మందికి పైగా ఉండగా, పురుష ఓటర్లు 14.15 మందికి పైగా ఉన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మానిక్ సాహా బొరోడోవాలి నియోజకవర్గం నుంచి బరిలో నిలిచారు. ఆయనపై ఆశిశ్ కుమార్ సాహాను కాంగ్రెస్ నిలిపింది.

బీజేపీ బెదిరింపులు.. లెఫ్ట్ నాయకులపై దాడులు

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో పలు చోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. అధికార బీజేపీ నాయకులు ప్రజలు, ప్రతిపక్ష నాయకులపై బెదిరింపులు, దాడులకు దిగారు. సెపాహిజల జిల్లాలోని బొక్సానగర్‌లో కొంత మంది గుర్తితెలియని వ్యక్తులు సీపీఐ(ఎం) స్థానిక కమిటీ కార్యదర్శిపై దాడికి దిగారు. ఆయనకు గాయాలు కావడంతో దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. గోమతి జిల్లాలో సీపీఐ(ఎం) పోలింగ్ ఏజెంట్లను తీవ్రంగా కొట్టారు. పశ్చిమ త్రిపుర జిల్లాలో సీపీఐ(ఎం) అభ్యర్థి పబిత్రకర్ పోలింగ్ ఏజెంట్‌కు సంబంధించిన వాహనాన్ని కాషాయమూకలు ధ్వంసం చేశాయి.బీజేపీ దాడిలో గాయపడిన సీపీఐ(ఎం) కార్యకర్తలు చందందాస్, షిపాన్ మజుందార్‌లను ఆస్పత్రిలో చేర్చారు. రాత్రి పేలుడు పదార్థాలను పేల్చి ఓటర్లలో భయాందోళనలు రేపేందుకు బీజేపీ సభ్యులు ప్రయత్నించారు.

బిషాల్‌గఢ్, శాంతిర్‌పూర్, రాంనగర్, ధన్‌పూర్, బముతియా, సూర్యమీనగర్, బ్రజాలాలో బీజేపీ సభ్యులు ఓటర్లను బెదిరించే ప్రయత్నం చేశారు. బీజేపీ బెదిరింపులకు ఓటర్లు భయపడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చాలా చోట్ల దాడి చేసిన వారిపై ఓటర్లు నేరుగా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.

రూ. 45 కోట్ల విలువైన వస్తువులు స్వాధీనం : ఈసీ

ప్రచారం సందర్భంగా నిర్వహించిన తనిఖీల్లో డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు సహా రూ. 45 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది. హెలికాప్టర్లు, విమానాల్లో త్రిపురకు అక్రమంగా డబ్బు తరలిస్తున్నారని ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే స్వాధీనం చేసుకున్న ఉచితాలు 20 రెట్లు ఎక్కువని ఎన్నికల సంఘం తెలిపింది. సూర్యమణినగర్‌లో బీజేపీ కార్యకర్తలు 26,28,29 బూత్‌లపై దాడికి ప్రయత్నించారని త్రిపుర కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నప్పటికీ తమ సొంత పార్టీలకు అనుకూలంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేసినందుకు త్రిపుర కాంగ్రెస్, బీజేపీలకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నోటీసులు పంపారు.

త్రిముఖ పోరు

ఆది నుంచీ త్రిపుర ఎన్నికలు ఆసక్తిని రేపాయి. అధికార బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమిని మళ్లీ అధికారంలోకి రాకుండా నిరోధించి.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలనే లక్ష్యంగా వామపక్షాలు, కాంగ్రెస్ ల కలయికతో కూటమి ఏర్పడింది. ఇక ప్రాంతీయ పార్టీగా ఏర్పాటైన టిప్రా మోతా రాష్ట్ర ఎన్నికలో బరిలో తొలి సారిగా నిలిచింది. దీంతో బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమి, లెఫ్ట్-కాంగ్రెస్ కూటమి, టిప్రా మోతా ల మధ్య త్రిముఖ పోరు ఏర్పడింది. ఎన్నికల తుది ఫలితాలు వచ్చే నెల 2న వెలువడనున్నాయి.

మొరాయించిన ఈవీఎంలు

త్రిపుర ఎన్నికల్లో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. 40 నుంచి 45 చోట్ల ఎన్నికల మిషన్లు సరిగ్గా పని చేయలేదు. దీంతో ఆయా పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్‌కు అంతరాయం ఏర్పడింది. అధికారులు ఓటర్ల సహనాన్ని ప్రశ్నించారు. మహిళలు, వృద్ధులు క్యూలైన్లలో అవస్థలు పడ్డారు. మొరాయించిన ఈవీఎంల స్థానాల్లో కొత్తవాటిని అధికారులు అమర్చారు. అనంతరం ఎన్నికలు యథావిధిగా సాగాయి.

'బీజేపీ దౌర్జన్యం'

(మొదటిపేజీ తరువాయి)

వేయకుండా అడ్డుకుంటున్నారని మాణిక్ సర్కార్ విమర్శించారు. సబ్‌రూమ్‌లో అభ్యర్థిగా ఉన్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి తన నియోజకవర్గ బూత్‌లో ఓటు వేశారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బీజేపీ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా ఓటు వేయాలంటూ ఫేస్‌బుక్‌లో సందేశం పంపారు. అగర్తల బోర్డోవాలి అభ్యర్థి ముఖ్యమంత్రి మాణిక్ సాహా తులసిబాటి బాలికల ఉన్నత పాఠశాల బూత్‌లో ఓటు వేశారు.

బ్రెయిలీ లిపిలో కేసీఆర్ జీవిత చరిత్ర..

(మొదటిపేజీ తరువాయి)

సీఎంగా ఆయన పాలన, తెలంగాణలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు తదితరాంశాలను ఆ పుస్తకంలో పొందుపరిచినట్టు వాసుదేవరెడ్డి ఈ సందర్భంగా కేటీఆర్‌కు వివరించారు. మంత్రి మాట్లాడుతూ... దేశంలోనే కేసీఆర్ గొప్ప నాయకుడనీ, ఆయన చరిత్రను భావి తరాల వారిని తెలపాల్సిన అవసరముందని చెప్పారు. అంధులకు కూడా ఆయన చరిత్రను తెలిపే విధంగా బ్రెయిలీ లిపిలో పుస్తకాన్ని తీసుకురావటం అభినందనీయమన్నారు. అంధ విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా కేటీఆర్ దృష్టికి తీసుకుపోయారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానంటూ ఆయన వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గాయత్రి రవి, కార్పొరేషన్ల చైర్మెన్లు బాలమల్లు, వేణుగోపాలచారి, సతీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, ప్రభాకర్, పూల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి



(మొదటిపేజీ తరువాయి)

రూ. 10 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. ఆశాలకు కంటి వెలుగు పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.1000 చొప్పున 16 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఆశాలకు రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అధికారుల వేధింపులు అరికట్టి ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నీలాదేవి, కోశాధికారి గంగమణి, ఎం.శ్రీలత, జి.కవిత, సాధన, హేమలత, ఎ.సునీత, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



హక్కులకోసం పోరాటం

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

హౌరా నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నామని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని, భూమిలేని పేదలకు న్యాయం చేయాలని, అర్హులైన పేదలందరికీ న్యాయం చేయాలని చేస్తున్న పోరాటాల ఫలితంగా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాల్లో కదలిక వస్తున్నాయని తెలిపారు. హౌరాలోని జ్యోతిబసు నగర్లో జరుగుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల్లో రెండోరోజైన గురువారం పలు రాష్ట్రాల నుండి హాజరైన ప్రతినిధులు కార్యదర్శి నివేదికపై మాట్లాడారు.

పోరాటాలతో ప్రభుత్వంలో కదలిక

పేదల భూములు లాక్కుంటున్న ప్రభుత్వం
ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి నాగరాజు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, అక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ బిజెపికి అనుకూలంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ నుండి మాట్లాడిన నాగరాజు తెలిపారు. . సంఘం ఆధ్వర్యాన 11 రకాల అంశాలపై తాము పోరాటం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పరిశ్రమల కోసం భూములు లాక్కుంటారని, దీనివల్ల ఎక్కువమంది పేదలు భూమి కోల్పోతున్నారని తెలిపారు. దీనిపై తాము పోరాటం నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే దళితులకు పంచిన అసైన్డ్ భూములను ప్రభుత్వం లాక్కుంటుందని వివరించారు. దీనిపై పోరాటంలో అనేకమంది జైళ్లపాలు చేశారని వివరించారు. ఆందోళనకారులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారని వివరించారు.

భూ పోరాటాలు జరిగే ప్రాంతంలో నాయకులు, పోరాటాల్లో పాల్గొంటున్న వారిని పోలీసులు ముందుగా నిర్బంధిస్తున్నారని తెలిపారు. కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లోనూ భూములను కార్పొరేట్లకు కట్టబెతున్నారని, దీనిపైనా పోరాటాలు సాగిస్తున్నామని చెప్పారు.

కేంద్ర ఒత్తిడులు ఎదుర్కొంటున్నాం
రతీంద్రన్ కేరళ ప్రతినిధి

కేరళలో వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని కేరళ ప్రతినిధి రతీంద్రన్ తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసినట్లు చెప్పారు. దీన్ని తట్టుకోలేని కేంద్రం తనిఖీల పేరుతో వేధింపులకు దిగుతోందని చెప్పారు. ఎన్ఐఎ, ఇడిని అడ్డం పెట్టుకుని దాడులకు దిగుతోందన్నారు.

పట్టణాల్లో ఉపాధి కోసం పోరు
కోదండన్, తమిళనాడు ప్రతినిధి

పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ... తమిళ నాడులో పోరా టాలు నిర్వహిస్తున్నట్టు ఆ రాష్ట్ర ప్రతినిధి కోదండన్ తెలిపారు.

దీనిపై 2021లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టామని వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

పోరాటాల ద్వారా విస్తరణ

బుర్రి ప్రసాదు, తెలంగాణ ప్రతినిధి



కోవిడ్ సమయంలో వ్యవసాయ కార్మిక సంఘం సేవా కార్యక్రమాలు అమలు చేసిందని తెలంగాణ తెలిపారు. అలా చేసిన పోరాటాల వల్ల కొత్త ప్రాంతాల్లోకి విస్తరించామని తెలిపారు. అనేక సామాజిక పరమైన అంశాల్లో ప్రజలను చైతన్యం చేస్తున్నామని తెలిపారు. మహిళా వ్యవసాయ కార్మిక సంఘం కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు. మహిళా కార్మికులు ఉద్యమంలోకి ఎక్కువగా వస్తున్నారని వివరించారు. వారిని మరింత చైతన్యం చేసేం దుకు అనేక సమావేశాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే భూపోరాటాల్లోకి పెద్దఎత్తున పేదలు కదలివస్తున్నారని తెలిపారు. తెలంగాణాలో పెట్టిన ధరణి వెబ్‌సైట్ వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వాటిపైనా పోరాడుతున్నామని చెప్పారు.

రేపాకుల శ్రీనివాస్, తెలంగాణ



తెలంగాణా ప్రాంతంలో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలంగాణ నుండి చర్చల్లో పాల్గొన్న రేపాకుల శ్రీనివాస్ చెప్పారు. మూడో మహాసభ ఖమ్మంలో లక్షమందితో నిర్వహించా మన్నారు. భూమి, ఇళ్లస్థలాలు, పోడుభూమి, భూములు కోల్పోతున్నవారు, ఉపాధి హామీ పథకంపై పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించా మన్నారు. ఫలితంగా ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ విషయంలో పేదలకు న్యాయం చేయాలని డిమాండు చేస్తున్నట్లు తెలిపారు . ప్రభుత్వం అనేక ప్రాంతాల్లో పేదల భూములను పరిశ్రమల పేరుతో ప్రభుత్వం లాక్కుంటోందన్నారు. దీనిపైనా ఆందోళన చేపట్టామన్నారు. అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల ముందు పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు.

మత విద్వేషాలను తిప్పికొట్టండి మహాసభలో తీర్మానం

- ప్రవేశపెట్టిన తుషార్‌ఘోష్, బలపరిచిన పళనిస్వామి

జ్యోతిబసు నగర్ నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న మత విద్వేషాలను తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మికసంఘం జాతీయ మహాసభ పిలుపునిచ్చింది. ఈ మేరకు ప్రతిపాదించిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ తీర్మానాన్ని సంఘం జాతీయ సహాయ కార్యదర్శి తుషార్‌ఘోష్ ప్రతిపాదించగా తమిళనాడు ప్రతినిధి పళనిస్వామి బలపరిచారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఎక్కడికక్కడ ఐక్యం కావాలని తీర్మానంలో పేర్కొన్నారు బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత లౌకికతత్వంపై దాడి పెరగడం ఆందోళనమని, మోడీ వచ్చిన తరువాత ఇది మరింత పెరిగిందని తెలిపారు. అధికారిక సంస్థలను ఉపయోగించడం ద్వారా దీన్ని ముందుకు తెచ్చారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా లౌకికతత్వం ప్రమాదంలోకి వెళ్లిందని తీర్మానంలో పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో గ్రామాలు అతలాకుతలం

పోరాటాలు..సేవా దృక్పథంతో సంఘ విస్తరణ : కార్యదర్శి నివేదికలో వెంకట్

- కొనసాగుతున్న వ్యవసాయ కార్మికసంఘం మహాసభ



జ్యోతిబసు నగర్ నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల కారణంగా గ్రామీణ భారతం అతలాకుతలమవుతోందనిఅఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్ తెలిపారు. హౌరాలోని జ్యోతిబసునగర్(శరత్‌శ్చంద్ర ఆడిటోరియం)లో జరుగుతున్న 10వ మహాసభలో ఆయన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కేంద్ర విధానాల కారణంగా వ్యవసాయ రంగం గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షోభంలో చిక్కుకుందని, దాని ఫలితం వ్యవసాయ కార్మికులపై తీవ్రస్థాయిలో పడుతోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోల్పోయి, పెద్ద సంఖ్యలో వ్యవసాయ కార్మికులు పట్టణాల బాట పట్టాల్సివచ్చిందని చెప్పారు. కరోనా కాలంలో పట్టణాల్లో సైతం పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. అదే సమయంలో బిలియనీర్లు పెరిగారని, దీనికి ప్రభుత్వ విధానాలే కారణమని చెప్పారు. మరోవైపు ఫాసిస్టు దాడులూ పెరుగుతున్నాయని, దీనికి బలవుతోందని కూడా నిరుపేదలు, వ్యవసాయ కార్మికులేనని అన్నారు. భూమిలేని పేదల సంఖ్య క్రమంగా పెరుగుతోందని అన్నారు. వ్యవసాయ కార్మికులతోపాటు చిరు ఉద్యోగులూ ఉపాధిని కోల్పోయారని వివరించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేయడంతోపాటు, సేవా ధృక్పధంతో వ్యవసాయ కార్మికసంఘం వ్యవహరిస్తోందని, ఫలితంగా సంఘ సభ్యత్వం గణనీయంగా పెరుగుతోందని అన్నారు. 2020లో కన్నూరులో జరిగిన మహాసభ అనంతరం దేశ వ్యాప్తంగా ఉద్యమం ఊపందుకుందని తెలిపారు. కేరళలో 22 లక్షలు, బెంగాల్లో 19 లక్షల సభ్యత్వం ఉందని వివరించారు. అలాగే తమిళనాడు, తెలంగాణా, తమిళనాడు, త్రిపుర, బీహార్, అస్సాం ఇలా అన్ని రాష్ట్రాల్లోనూ క్రమంగా సభ్యతాన్ని పెంచుకుంటున్నామని వివరించారు. బెంగాల్ వంటి రాష్ట్రంలో ఒక్కరోజులోనే ఐదు లక్షల సభ్యత్వం చేర్పించారని, ఉద్యమం ప్రభావం, ఫలితం ఉండటంతోనే అనేకమంది సంఘంలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని అన్నారు. కేరళ రాష్ట్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ పేదలకు గృహ నిర్మాణంలో సంఘం కీలకపాత్ర పోషించిందన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా వంటి రాష్ట్రాల్లో వందల సంఖ్యలో పేదలు నివశించే ప్రాంతాల్లో పర్యటించి వారి ఇబ్బందులు తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. తెలంగాణాలో వరంగల్ నగరంలో నిర్వహించిన ఉద్యమం మంచి స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ పేదల కాలనీల్లో పర్యటించి సర్వే చేశారని, దీని ఫలితంగా నిజమైన లబ్దిదారులు ఎవరో ప్రభుత్వానికి తెలిసొచ్చి న్యాయం జరుగుతోందని అన్నారు. కరోనా కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నాయకత్వం సేవా కార్యక్రమాలు చేయడంతోపాటు నిధులు సేకరించి కోవిడ్ బారినపడిన వారికోసం సేవలందించిందని తెలిపారు.బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవడంతోపాటు, కేంద్రానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించాల్సి ఉందని మహాసభ వేదికగా పిలుపునిచ్చారు.

తెలంగాణ

కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

- ఆలేరు, మోటకొండూరు మండలాల్లో జీపీ కార్మికుల పాదయాత్ర
- విజయవంతంగా వంద కిలోమీటర్లు పూర్తి



నవతెలంగాణ -ఆలేరు రూరల్

కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పాదయాత్ర గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతాపురి, దిలవారిపూర్ గ్రామాల్లో కొనసాగింది. దిలవారిపూర్ గ్రామంలో జరిగిన సభలో పంచాయతీ కార్మికులు పాదయాత్ర బృందానికి తమ బాధలను విన్నవించుకున్నారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం నిర్ణయించాలని సుదీర్ఘకాలం పోరాటం చేస్తే.. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనా లేకుండా జీవో నెంబర్ 51 విడుదల చేసి.. 500 జనాభాకు ఒక కార్మికుడు చొప్పున లెక్కించి వేతనాన్ని రూ.8500 నిర్ణయించిందన్నారు. అదనంగా ఉన్న కార్మికులకు ఎలాంటి వేతనాలూ చెల్లించడం లేదన్నారు. ఒక కార్మికునికి ఇచ్చే వేతనాన్ని అక్కడ పనిచేసే కార్మికులందరూ పంచుకుంటున్నామని, ఫలితంగా రూ.3500 నుంచి 4,500 మాత్రమే వేతనాలు పొందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నా కారోబార్ బిల్ కలెక్టర్‌కు కేవలం రూ.6000 ఇస్తున్నారని కార్మికులు తెలిపారు. కుటుంబం గడవడం కష్టంగా ఉందని, పెరిగిన ఖర్చులకు తగినట్టు వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందుకోసం తామూ పాదయాత్రలో భాగస్వాములం అవుతామని కార్మికులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచి జీవో నెంబర్ 60 ప్రకారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు, ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తునికి మహేష్ వినోద్ కుమార్ బృందంగా పాదయాత్ర పాలకుర్తి నుంచి మొదలుకొని మొదలు పెట్టి హైదరాబాద్ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పాదయాత్ర ఈనెల 28న మధ్యాహ్నం 2 గంటలకు ఇందిరాపార్క్ వద్ద ముగుస్తుందని తెలిపారు. అనంతరం పాదయాత్ర మోటకొండూరు మండలంలో కొనసాగింది. పాదయాత్రకు సంఘీభావంగా కలుగీత కార్మిక సంఘం రైతు సంఘం, సీపీఐ(ఎం), సీపీఐ, వివిధ సంఘాలు, పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కల్లూరి మల్లేశం, కలుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి జగదీష్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దుపటి వెంకటేష్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఇక్బాల్, సీఐటీయూ మోటకొండూరు మండల అధ్యక్షులు కొల్లూరు ఆంజనేయులు, నాయకులు సంగి రాజు, ఆడెపు స్వామి, చెక్క దశరథ, అంజయ్య పాల్గొన్నారు.

సక్సెస్‌గా వంద కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి

పంచాయతీ కార్మికుల కోసం తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ చేస్తున్న పాదయాత్ర 100 కిలోమీటర్లకు చేరుకున్నది. పాదయాత్ర ఈ నెల 12న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వం వహిస్తున్న పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ప్రారంభమైన విషయం తెలిసిందే. వరంగల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల మీదుగా యాద్రాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గానికి చేరుకున్నది. ఆ జిల్లాలోని మోటకొండూరు మండల కేంద్రంలో వంద కిలోమీటర్ల మైలురాయిని పాదయాత్ర చేరుకున్నది. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రతినెలా జీతాలివ్వాలనే డిమాండ్‌తో కొనసాగుతున్నది. వారికిస్తున్న రూ.8,500 జీతాన్ని ఇద్దరు, ముగ్గురు కార్మికులు పంచుకుంటున్న తీరును పాదయాత్ర బృందం ఎత్తిచూపుతున్నది.



మాణిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో ఎమ్మెల్సీగా గెలిపించాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ-మంచాల

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి మాణిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి ఉపాధ్యాయులను కోరారు. గురువారం రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలు, కేజీబీవీ పాఠశాలల్లో మాణిక్‌రెడ్డి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగార్థులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ ఎంతో కృషి చేస్తోందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం తమ సంఘంతోనే సాధ్యమని చెప్పారు. ఉపాధ్యాయులకు నిరంతరం అందుబాటులో ఉండే మాణిక్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు సుగంధ, జిల్లా ఉపాధ్యక్షులు కల్పన, జిల్లా కార్యదర్శులు భువనేశ్వరి, రాములయ్య, కేజీబీవీ ఎస్ఓ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో 'లంపి స్కిన్' కలకలం

- వైరస్‌తో ఆవు దూడ మృతి

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

కామారెడ్డి జిల్లాలో లంపి స్కిన్ వైరస్ కలకలం రేపుతోంది. కామారెడ్డి మార్కెట్‌లో ఆవుకు లంపి స్కిన్ వైరస్ సోకడంతో రెండ్రోజుల కిందట మృత్యువాతపడింది. తాజాగా గురువారం మరో లేగ దూడ చనిపోయింది. లంపి స్కిన్ వైరస్ సోకిన వందలాది ఆవులు రోడ్లపైనే తిరుగుతుండటంతో స్థానికులు భయాందోళనకు లోనవుతున్నారు. లింపి స్కిన్ వైరస్ ఈగల కారణంగా పశువులకు వ్యాప్తి చెందుతున్నట్టు అధికారులు తెలిపారు. ఈ వైరస్ కారణంగా పశువుల చర్మంపై ఎర్రటి బొడిపెలు పుండ్లుగా మారి దేహమంతా వ్యాపిస్తాయని ఐవీఆర్ఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కేపీ సింగ్ తెలిపారు. దీంతో తీవ్ర జ్వరం వచ్చి.. పశువులు పాలు ఇవ్వడం, గడ్డి తినడం మానేస్తాయని తెలిపారు. లంపిస్కిన్ పశువుల నుంచి మానవులకు సంక్రమించినట్టు ఎటువంటి ఆధారాలూ లేవన్నారు.

ప్రయివేటు అధ్యాపకులకూ ఎగ్జామినర్లుగా అవకాశమివ్వాలి : టీపీటీఎల్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేటు కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులకూ ఎగ్జామినర్లుగా అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రయివేటు టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ అధ్యాపకులను మాత్రమే ఎగ్జామినర్లుగా నియమిస్తున్నారని గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వారొక్కరికే ఈ పని కల్పించడం వల్ల అది వారికి కూడా భారమవుతున్నదని పేర్కొన్నారు.

కోమట్టిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

- ఇటుకుల పహాడ్‌లో ఇరు పార్టీల కార్యకర్తల తోపులాట
- చెప్పులు, కర్రలు విసురుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ -నకిరేకల్

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకలపాడు గ్రామంలో గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తల మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగి ఎంపీ కోమటిరెడ్డి పర్యటన ఉద్రిక్తంగా మారింది. గురువారం శాలిగౌరారం మండలంలోని ఇటుకుల పహాడ్‌లో బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమానికి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రామంలో సీసీ రోడ్డు సక్రమంగా లేవని, రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని అనడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా మైకు కనెక్షన్లను ఊడదీసి తోపులాటకు దిగారు. ఆలయ ప్రాంగణంలోకి చెప్పులు విసిరేశారు.

పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలివ్వాలి

దరఖాస్తులను పున: పరిశీలించాలి

- 20న హైదరాబాద్‌లో ధర్నా: ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నేతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలివ్వాలి. గిరిజనుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను తిరిగి పరిశీలించాల'ని ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో సమన్వయ కమిటీ కన్వీనర్లు వేముల పల్లి వెంట్రామయ్య, కెచ్చెల రంగయ్య, అంజయ్య నాయక్ విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే, అటవీ హక్కులను కాలరాసే 'అటవీ సంరక్షణ నియమాలు- 2022'ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.. ఆ నియమాలను ఉపసంహరించాలని కోరుతూ, రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నేతలు పాల్గొంటాయన్నారని తెలిపారు.. ఆదివాసులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములన్నింటికీ, ఈ నెల చివరినాటికి (11.5 లక్షల ఎకరాలకు) హక్కుపత్రాలు యిస్తామంటూ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటన చేయటాన్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. అయితే గతంలో కూడా అనేకసార్లు ఈ విధంగా వాగ్దానాలు చేసి అమలు చేయలేదని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ప్రచారానికే పరిమితం కాకుండా హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అడవి బిడ్డలను ఆక్రమణదారులుగా పేర్కొనడం తగదని తెలిపారు. పోడు భూమిపై ఆదివాసులకు హక్కులేదని మాట్లాడటం సరికాదన్నారు. అటవీ హక్కుల చట్టం, 2006 ద్వారా 13.12.2005 వరకు పోడు భూములపై ఆదివాసులకు చట్టబద్ధ హక్కు లభించిందని గుర్తుచేశారు. గిరిజనుల హక్కుల్ని గుర్తించి, వారికి పట్టాలివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అయితే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. చాలా చోట్ల ఆదివాసుల అర్జీలను తిరస్కరించారని తెలిపారు. కొన్ని చోట్ల సర్వేలు కూడా చేయలేదన్నారు. మరి కొన్ని చోట్ల అటవీ హక్కుల చట్టంలో లేని విధంగా, మంజూరు చేసిన అర్జీదారులకు సంబంధించిన (2005కు ముందు) ఆధార్ కార్డు చూపాలంటూ విషను షరతులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టంలో లేని సాక్ష్యాధారం - ఉపగ్రహఛాయా చిత్రాల పేరిట అనేక దరఖాస్తులు తిరస్కరించారని తెలిపారు. చట్టానికి విరుద్ధంగా మైనర్లనీ, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఉందనే పేరుతో అర్జీలను తిరస్కరించారనీ, గిరిజనేతరుల దరఖాస్తులన్నింటినీ చట్ట వ్యతిరేకంగా తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకర్ల సమావేశంలో సమన్వయ కమిటీ నాయకులు మండల వెంకన్న, ప్రసాదన్న, మామిడాల భిక్షపతి, వి ప్రభాకర్, జక్కుల వెంకటయ్య కూడా మాట్లాడారు.



సంయుక్త మీనన్, త్రివిక్రమ్, ధనుష్

నవచిత్రం

సార్.. ఫలితంపై ఎంతో నమ్మకంగా ఉన్నాం

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన ద్విభాషా చిత్రం 'సార్' (తెలుగు)/ 'వాతి' (తమిళం). శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ధనుష్, సంయుక్త మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని మేకర్స్ ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో సినీ ప్రముఖులు, అభిమానుల సమక్షంలో ఈ వేడుక ఎంతో వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, 'గురువుల గురించి సినిమా తీసిన వెంకీని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. వెంకీ చెప్పిన కథని నమ్మి ఈ సినిమా చేసిన ధనుష్‌కి ధన్యవాదాలు. నిర్మాతల్లో ఒకరైన నా భార్య ఈ సినిమా చూసి.. కథగా విన్నప్పుడు కంటే, సినిమాగా చూసినప్పుడు ఇంకా బాగుంది అని చెప్పింది. నేను కూడా ఈ సినిమా చూశాను. నాకు చాలా బాగా నచ్చింది. ప్రతి కథకి ఒక ఆత్మ ఉంటుంది. ఈ కథ తాలూకు ఆత్మ ఏంటంటే.. విద్య, వైద్యం లాంటి మౌలిక సదుపాయాలు డబ్బుతో సంబంధం లేకుండా అందరికీ అందుబాటులో ఉండాలనేది ప్రపంచం మనకి నేర్పుతున్న పాఠం. కానీ వాటినే సామాన్య జనాలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. ప్రపంచం మొత్తం చూసే స్థాయికి తీసుకెళ్లగలిగేది చదువు. అంత గొప్ప ఆయుధాన్ని కేవలం డబ్బు మీకు లేదని ఒక కారణం మూలంగా వాళ్ళకి దూరం చేయడం ఎంతవరకు రైట్?. ఈ ప్రశ్నే ఈ సినిమాలో వెంకీ అడిగే ప్రయత్నం చేశాడు. అలాగే టీచర్, స్టూడెంట్‌కి మధ్య ఉండే రిలేషన్ చాలా పవిత్రమైనది. మనం ఎంత దూరం ప్రయాణం చేసినా కూడా మన గురువులు మనతో పాటే ఉంటారు. అలాగే ఈ 'సార్' సినిమా కూడా మనతో పాటు చాలాకాలం పాటు ప్రయాణించే సినిమా అవుతుంది' అని తెలిపారు.

'2002లో నా మొదటి తమిళ సినిమా విడుదలైంది. ఇప్పుడు 2023లో నా మొదటి తెలుగు సినిమా విడుదలవుతోంది. అప్పుడు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో.. ఇప్పుడు కూడా నాకు అలాంటి ఫీలింగే కలుగుతుంది. ఇది అద్భుతమైన ఎమోషన్స్, మెసేజ్‌తో కూడిన సింపుల్ సినిమా. మేం ఒక అర్థవంతమైన సినిమా చేశాం. ప్రేక్షకులకు మాములుగా వాళ్ళ కథలతో ఎక్కువగా కనెక్ట్ అవుతారు. ఇది మీ అందరి కథ. దర్శకుడు వెంకీకి, హీరోయిన్ సంయుక్త మీనన్, నిర్మాత వంశీకి ధన్యవాదాలు' అని హీరో ధనుష్ అన్నారు.

'ఇది 'తొలిప్రేమ' తర్వాత నేను చాలా నమ్మకంగా ఉన్న సినిమా. ఇది ఒక వీకెండ్ మాత్రమే చూసే సినిమా కాదు.. కనీసం నాలుగు వీకెండ్‌లు చూసే సినిమా. ఈ సినిమా తెలుగులో కనీసం నాలుగు వారాలు, తమిళ్‌లో కనీసం ఎనిమిది వారాలు ఆడుతుంది. ధనుష్ ఒక నాగస్వరం. ఆయన నటిస్తుంటే.. ఆయన ఒక్కడే కనిపిస్తాడు, ఆయన ఒక్కడే వినిపిస్తాడు. అలాంటి నటుడితో సినిమా చేసే అవకాశం రావడం గర్వంగా ఉంది' అని దర్శకుడు వెంకీ అట్లూరి అన్నారు. కథానాయిక సంయుక్త మీనన్ మాట్లాడుతూ, 'సినిమా ప్రివ్యూ చూశాక ఫలితంపై నా కాన్ఫిడెన్స్ రెట్టింపు అయింది. ముఖ్యంగా నిర్మాత వంశీ ఈ సినిమా విజయం పట్ల చాలా నమ్మకంగా ఉన్నారు. దర్శక, నిర్మాతలకు, త్రివిక్రమ్‌కి ధన్యవాదాలు' అని తెలిపారు.

> ఈ సినిమా విజయం పట్ల మేం చాలా నమ్మకంగా ఉన్నాం. అందుకే ముందురోజే ప్రీమియర్లు వేయాలని నిర్ణయించుకున్నాం. ఆన్ లైన్‌లో పెట్టిన కాసేపటికే ప్రీమియర్ షోల టికెట్లు బుక్ అవ్వడం చూశాక.. ఈ సినిమా మీద మేమెంత నమ్మకం పెట్టుకున్నామో, ప్రేక్షకులు కూడా ఈ సినిమా మీద మంచి అంచనాలు పెట్టుకొని ఎదురుచూస్తున్నారని అర్థమైంది. ఈ సినిమా మిమ్మల్ని అసలు నిరాశపరచదు. ఖచ్చితంగా ఈ సినిమా మిమ్మల్ని అలరిస్తుంది.
>
> - నిర్మాత సూర్యదేవర నాగవంశీ

ఇదొక సరదాల గోల..

సంతోష్ శోభన్, గౌరి జి.కిషన్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'శ్రీదేవి శోభన్‌బాబు'. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని సుష్మిత కొణిదెల, విష్ణు ప్రసాద్ నిర్మిస్తున్నారు.

ఈ సినిమాను ఈనెల 18న విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మేకర్స్ రిలీజ్ ట్రైలర్‌తోపాటు బిగ్ టికెట్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, 'మా సుష్మిత త్వరలోనే మెగా ప్రొడ్యూసర్ అవుతుంది. తనతో పాటు విష్ణుకి అభినందనలు. డైరెక్టర్ ప్రశాంత్ నెరేషన్ వినగానే ఎమోషనల్ అయ్యాను. స్క్రీన్‌మీదకు అలాగే తీసుకు వస్తాడా? అని అనిపించింది. ఇప్పుడుట్రైలర్ చూస్తే తను చక్కగా డైరెక్ట్ చేశాడనిపించింది. హీరో సంతోష్ నటుడిగా రాణిస్తున్నాడు. ఇక గౌరి చక్కగా నటించింది' అని తెలిపారు.



నాగబాబుతో 'శ్రీదేవి శోభన్‌బాబు' చిత్ర బృందం

'ఈ సినిమా సరదాగా గోల గోలగా ఉంటుంది. అచ్చమైన తెలుగు సినిమా. ఈనెల 18న వస్తున్న ఈ సినిమాను మీ అందరూ ఫ్యామిలీస్‌తో ఎంజాయ్ చేస్తారు. సుష్మిత అక్కకి థ్యాంక్స్' అని హీరో సంతోష్‌శోభన్ అన్నారు.

నిర్మాత విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ, "ఈ సినిమా ఫన్నీగా ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఈనెల 18న ఫ్యామిలీతో కలిసి ఎంజాయ్ చేయండి. ఈ జర్నీలో ఇప్పటి వరకు సపోర్ట్ చేసిన అందరికీ కృతజ్ఞతలు' అని చెప్పారు.

'మన లైఫ్‌లో మనం ఎక్స్‌పీరియెన్స్ చేసే ట్రూ ఎమోషన్స్, రియల్ లైఫ్ ఫీలింగ్స్, మన అమ్మ, నాన్నతో గడిపే క్షణాలు, స్నేహితులు సరదాగా ఉన్న సమయం. ప్రేమలో ఉన్నప్పుడు ఉండే బ్యూటీఫుల్ మూమెంట్స్ అన్ని ఈ సినిమాలో ఉంటాయి. వీటన్నింటితో పాటు ఫెంటాస్టిక్ డ్రామా ఉంటుంది. డైరెక్టర్ ప్రశాంత్ సిన్సియర్‌గా మనసు పెట్టి సినిమాను చేశారు. తనతో పాటు ఈ సినిమాకు పని చేసిన నటీనటులు, టెక్నీషియన్స్ అందరూ అంతేలా మనసు పెట్టి పని చేశారు. సంతోష్, గౌరి నాకు ఫ్యామిలీ మెంబర్స్‌లా సపోర్ట్ చేశారు. మా డీఓపీ సిద్ధార్థ్, మ్యూజిక్ డైరెక్టర్ క్రమాన్ సహా అందరూ వారి బెస్ట్ ఇచ్చారు. ఇది మా బ్యానర్‌లో వస్తున్న ఫస్ట్ ఫీచర్ ఫిల్మ్. నాన్న చిరంజీవి ఆశీస్సులతో మా చిత్రాన్ని మీ ముందుకు తీసుకువస్తున్నాం' అని నిర్మాత సుష్మిత కొణిదెల తెలిపారు.

హీరోయిన్ గౌరి జి.కిషన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాతో శ్రీదేవిగా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసిన డైరెక్టర్ ప్రశాంత్‌కి థ్యాంక్స్. '96' సినిమా నాకు యాక్టర్‌గా లైఫ్ చేంజింగ్ మూవీ. అలాగే ఇప్పుడు తెలుగులో ఈ సినిమా లైఫ్ చేంజింగ్ మూవీ అనే చెప్పాలి' అని చెప్పారు.



కేఆర్కే ఛానల్ లాంచ్ చేసిన చిరంజీవి

చిత్రసీమలో కొత్త వారికి అవకాశాలు ఇవ్వడమే లక్ష్యంగా లెజండరీ ఫిల్మ్ మేకర్, దర్శకేంద్రుడు కె. రాఘవేంద్ర రావు యూట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశారని చిరంజీవి అన్నారు. కొన్ని రోజుల క్రితం ఆ ఛానల్ లోగోను దర్శక ఎస్.ఎస్. రాజమౌళి లాంచ్ చేశారు. ఇప్పుడు చిరంజీవి ఆన్‌లైన్‌లోకి తీసుకు వచ్చారు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో రాఘవేంద్రుడు తెలియజేశారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు రాఘవేంద్ర రావు ఎంతో మంది నటీనటులు, సాంకేతిక నిపుణులను పరిచయం చేశారని, ఇక్కడి నుంచి కొంత మందిని హిందీకి కూడా తీసుకు వెళ్లారని చిరంజీవి అన్నారు. ఇప్పుడీ యూట్యూబ్ ఛానల్ ద్వారా కొత్తవాళ్ళను వినోద పరిశ్రమకు పరిచయం చేయాలని సంకల్పించారన్నారు. ఈ సందర్భంగా రాగవేంద్రరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్

సాయిరామ్ శంకర్, యాశ శివకుమార్ జంటగా నటిస్తున్న చిత్రం 'వెయ్ దరువెయ్'. ఈ చిత్ర టీజర్‌ను హీరో సాయిధరమ్ తేజ్ రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ సినిమా టీజర్ చాలా ఆసక్తికరంగా ఉంది. అంతేకాదు సినిమా చూడాలి అనే కుతుహలాన్ని రేపుతోంది. సినిమా ఖచ్చితంగా సక్సెస్ అయి సాయికి, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌కి మరిన్ని అవకాశాలు రావాలని ఆశిస్తున్నాను' అని చెప్పారు.



సాయిరామ్ శంకర్, యాశ శివకుమార్


'మా సినిమా నుంచి ఇది వరకే రెండు సాంగ్స్ రిలీజ్ అయ్యాయి. వాటికి మంచి విశేష స్పందన వచ్చింది. యూట్యూబ్‌లో ట్రెండ్ అవ్వడమే కాకుండా కోటికి పైగా వ్యూస్ రావటం చాలా ఆనందంగా ఉంది. పాటలు ఎలా అయితే నచ్చాయో సినిమా టీజర్ అంతకు మించి ఉంది. సినిమా చాలా బాగా వచ్చింది' అని హీరో సాయి రామ్ శంకర్ అన్నారు. దర్శకుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ, 'మా సాంగ్స్‌కి మంచి రీచ్ ఇచ్చిన ప్రేక్షకులకి నా శతకోటి నమస్కారాలు. టీజర్ కూడా బాగా నచ్చుతుంది అని ఆశిస్తున్నాను' అని తెలిపారు.నిర్మాత దేవరాజ్ మాట్లాడుతూ, 'సాయిధరమ్ తేజ్ చేతుల మీదుగా మా సినిమా టీజర్ రిలీజ్ కావడం ఆనందంగా ఉంది. మేము అనుకున్నట్టే చాలా బాగా వచ్చింది సినిమా, హీరో కెరీర్‌లో మరొక మంచి సినిమా అవుతుంది అని మేమంతా గట్టిగా నమ్ముతున్నాం' అని అన్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సమ్మర్ స్పెషల్‌గా మార్చిలో ఈ సినిమా రిలీజ్‌కి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. సాయి రామ్ శంకర్ , యాశ శివ కుమార్ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో సునీల్, కాశీ విశ్వనాథ్, పోసాని కృష్ణ మురళి,పృథ్వి తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి డైరెక్టర్ : నవీన్ రెడ్డి, ప్రొడ్యూసర్ : దేవరాజు పొత్తూరు, మ్యూజిక్ డైరెక్టర్ : భీమ్స్, కెమెరా మెన్ : ముత్యాల సతీష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ :జనగాని కార్తీక్ , శ్రీపాల్ చొల్లేటి.

అందరి పై దయ చూపించండి



మయోసైటిస్‌తో బాధపడుతున్న సమంత కొంతకాలంగా ఇంటికే పరిమితమై ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు. ఇటీవల కాస్త కోలుకున్న ఆమె సోషల్ మీడియాలో యాక్టివ్ అయ్యారు. తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. బాక్సింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఫొటో షేర్ చేసి 'అందరి పై దయ చూపించండి' అంటూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. 'ఎవరు ఏ సమస్యతో పోరాడుతున్నారో తెలీదు. అందుకే అందరి పై దయ చూపించండి" అని ఆ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది.

కళాతపస్వికి కళాంజలి



ఈ నెల 19వ తేదీ విశ్వనాథ్ 94వ పుట్టిన రోజు సందర్భంగా ఆయన జయంతి కార్యక్రమాన్ని టి. సుబ్బిరామిరెడ్డి ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 'కళాతపస్వికి కళాంజలి' ఘటించబోతున్న ఈ కార్యక్రమంలో ఆయన చిత్రాలలో నటించిన పలువురు నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరు కాబోతున్నారు. ముఖ్యంగా చిరంజీవి, రాధిక, సుమలత తదితరులు పాల్గొన బోతున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ రాష్ట్రాలకు చెందిన నటీనటులు ఈ వేడుకకు విచ్చేసి, విశ్వనాథ్ గారితో తమకున్న అనుబంధాన్ని స్మరించుకోబోతున్నట్లు సమాచారం.



టెస్టు నం.100 : కెరీర్ వందో టెస్టు ఆడనున్న చతేశ్వర్ పుజారా

వంద వీరుడు

టెస్టు స్పెషలిస్ట్ బ్యాటర్ చతేశ్వర్ పుజార కెరీర్ మైలురాయి మ్యాచ్‌కు సిద్ధమవుతున్నాడు. నేడు ఆస్ట్రేలియాతో న్యూఢిల్లీ టెస్టులో పుజార కెరీర్ 100వ టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. భారత్‌కు వంద టెస్టులు ఆడిన దిగ్గజాల క్లబ్‌లో పుజార చేరనున్నాడు. సచిన్ (200), ద్రవిడ్ (163), లక్ష్మణ్ (134), కుంబ్లే (132), కపిల్‌దేవ్ (131) భారత్‌కు అత్యధిక టెస్టులు ఆడిన టాప్-5 జాబితాలో ఉండగా.. భారత్‌కు టెస్టుల్లో 100 మ్యాచులు ఆడిన 13వ క్రికెటర్‌గా పుజార నిలువనున్నాడు. ప్రస్తుత టెస్టులో విరాట్ కోహ్లి (105) ఒక్కడే వంద టెస్టుల అనుభవం కలిగి ఉన్నాడు. ఆస్ట్రేలియాతో 2010 బెంగళూర్ టెస్టులో అరంగేట్రం చేసిన పుజార.. ఇప్పుడే అదే జట్టుపై న్యూఢిల్లీలో వందో టెస్టుకు సై అంటున్నాడు. 99 టెస్టుల్లో 169 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసిన పుజార.. 44.15 సగటు, 44.44 స్ట్రయిక్‌రేట్‌తో 7021 పరుగులు సాధించాడు. 19 శతకాలు, 34 అర్థ సెంచరీలు బాదిన పుజార.. 84 బౌండరీలు, 15 సిక్సర్లు సంధించాడు. ద్రవిడ్ తర్వాత టీమ్ ఇండియా ది వాల్‌గా నిలిచిన పుజార కెరీర్‌లో 15797 బంతులు ఎదుర్కొన్నాడు. టెస్టుల్లో పుజార అత్యధిక స్కోరు అజేయ 206 పరుగులు.

టెస్టు నిపుణుడిగా జట్టులో కొనసాగుతున్న పుజార.. అందుకు తగిన ప్రదర్శన చేస్తూనే ఉన్నాడు. ఓ సమయంలో స్ట్రయిక్‌రేట్ అంశంలో జట్టు మేనేజ్‌మెంట్ నుంచి ఒత్తిడి ఎదుర్కొన్న పుజార ఆ సమస్యను అధిగమించాడు. ఇటీవల ఇంగ్లీష్ కౌంటీ సీజన్‌లో ధనధన్ విశ్వరూపం సైతం ఆవిష్కరించాడు. ఆస్ట్రేలియాలో వరుస టెస్టు సిరీస్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా గత పర్యటనలో యువ క్రికెటర్లకు తోడుగా నిలుస్తూ.. గబ్బా, సిడ్నీ టెస్టుల్లో విజయాలు సాధించిన తీరు అమోఘం. కెరీర్ మైలురాయి మ్యాచ్‌లో మరుపురాని ఇన్నింగ్స్ ఆడేందుకు పుజారా ఎదురుచూస్తున్నాడు.

ఎల్బీలో నేడు మెగా చెస్ టోర్నీ

- 33 జిల్లాల్లో కెసిఆర్ చాంపియన్‌షిప్



హైదరాబాద్ : సీఎం కెసిఆర్ పుట్టినరోజు సందర్భంగా నేడు శాట్స్ మెగా చెస్ టోర్నీ నిర్వహిస్తోంది. గురువారం 33 జిల్లాల్లో మహిళల విభాగంలో జరిగిన చెస్ పోటీల్లో 40 వేల మంది పోటీపడ్డారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు నేడు ఎల్బీ ఇండోర్ స్టేడియంలో జరిగే ఫైనల్లో ఎత్తులకు పైఎత్తులు వేయనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా చెస్ పోటీలను శాట్స్ యంత్రాంగంతో కలిసి చైర్మెన్ ఆంజనేయ గౌడ్ ప్రారంభించారు. జిల్లా స్థాయి విజేతలకు స్థానికంగా మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. అన్ని జిల్లాల నుంచి చెస్ క్రీడాకారులు ఏకకాలంలో సిఎం కెసిఆర్‌కు సామూహిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బెంగళూర్ దూకుడు

ప్రైమ్ వాలీబాల్ లీగ్

హైదరాబాద్ : ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో బెంగళూర్ టార్పెడోస్ దూకుడు చూపించింది. గచ్చిబౌలిలో స్టేడియంలో గురువారం చెన్నై బ్లిట్జ్‌తో జరిగిన మ్యాచ్‌లో బెంగళూర్ విజయం సాధించింది. 15-, 8-5, 15-10, 15-3తో నాలుగు సెట్లు పూర్తయ్యేలోపే గెలుపు ఖరారు చేసుకుంది. బెంగళూర్ ఆటగాళ్లు జోస్ ఐబిన్, శెట్టి శ్రజన్, ముజీబ్‌లు రాణించారు. చెన్నై బ్లిట్జ్ సీజన్‌లో వరుసగా రెండో పరాజయం చవిచూసింది.

బెంగాల్ 174 ఆలౌట్

సౌరాష్ట్రతో రంజీ ఫైనల్

కోల్‌కత : సౌరాష్ట్ర పేసర్లు జైదేవ్ ఉనద్కత్ (3/44), చేతన్ సకారియ (3/33) నిప్పులు చెరగటంతో రంజీ ట్రోఫీ ఫైనల్లో బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులకే కుప్పకూలింది. షాబాజ్ అహ్మద్ (69), అభిషేక్ పోరెల్ (50) అర్థ సెంచరీలతో 6/65తో ఉన్న బెంగాల్‌ను ఆదుకున్నారు. సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 81/2తో ఆడుతోంది. గోహిల్ (6), విశ్వరాజ్ (25) విఫలమయ్యారు. ప్రస్తుతం సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 93 పరుగుల వెనుకంజలో నిలిచింది.

ఆటలు

భారత్‌కు ఎదురుందా?



బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సమరం ఫిరోజ్ షా కోట్లకు చేరుకుంది. జామ్తాలో జాతర చేసిన టీమ్ ఇండియా.. ఇప్పుడు కోట్లలో సిరీస్‌పై తిరుగులేని పట్టు సాధించటంపై కన్నేసింది. స్పిన్ మంత్రతో కంగారూలను ఉక్కిరిబిక్కిరి చేస్తోన్న రోహిత్‌సేన.. న్యూఢిల్లీలోనూ ఆస్ట్రేలియాకు స్పిన్ ట్రాక్‌తో స్వాగతం పలుకుతోంది. టీమ్ ఇండియా టెస్టు యోధుడు చతేశ్వర్ పుజార కెరీర్ వందో టెస్టుకు రంగం సిద్ధం చేసుకున్న వేళ.. భారత్, ఆస్ట్రేలియా రెండో టెస్టు పోరు నేటి నుంచి ఆరంభం.

నవతెలంగాణ-న్యూఢిల్లీ

- ఆస్ట్రేలియాతో రెండో టెస్టు నేటి నుంచి
- 2-0 ఆధిక్యంపై రోహిత్‌సేన గురి
- ఢిల్లీలో మరో స్పిన్ ట్రాక్ సిద్ధం

ఉదయం 9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

టాప్ నిలబడేనా?!

టెస్టుల్లో భారత్ జోరు సాగుతున్నా.. పరిష్కారం లభించాల్సిన సమస్యలు లేకపోలేదు. ప్రధానంగా టాప్ ఆర్డర్ వైఫల్యం భారత్‌కు నిత్యకృత్యమైంది. నాగ్‌పూర్ టెస్టులో రోహిత్ శర్మ మినహాయిస్తే.. మరో టాప్ ఆర్డర్ బ్యాటర్ రాణించలేదు. కెఎల్ రాహుల్, చతేశ్వర్ పుజార, విరాట్ కోహ్లి నిరాశపరిచారు. టెయిలెండర్లు, ఆల్‌రౌండర్ల అండతో భారత్ బయటపడింది. తోక సాయం దక్కకుంటే నాగ్‌పూర్‌లో పరిస్థితి భిన్నంగా మారేది. స్పిన్ పిచ్‌లపై టాప్ ఆర్డర్ నిలిచి పరుగులు చేయకుంటే అది భారత్ రివర్స్ పంచ్ అవుతుంది. కెఎల్ రాహుల్ 46 టెస్టులు ఆడినా సగటు 34 దాటలేదు. బెంచ్‌పై ప్రతిభావంతుడైన యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. పరుగుల వేట సాగించకుండా రాహుల్ ఎంతోకాలం తుది జట్టులో నిలువలేడు. ఇక గత రెండేండ్లుగా టెస్టుల్లో అదరగొడుతున్న శ్రేయస్ అయ్యర్ ఫిట్‌నెస్ సాధిస్తే నేరుగా తుది జట్టులోకి రానున్నాడు. సూర్యకుమార్ యాదవ్ బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. శుభ్‌మన్ గిల్, కెఎల్ రాహుల్ ఇద్దరూ తుది జట్టులో ఉండాల్సిన పరిస్థితి తలెత్తితే.. తెలుగు క్రికెటర్ కె.ఎస్ భరత్‌పై వేటు పడొచ్చు. మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమి పేస్ బాధ్యతలు చూసుకోనుండా.. స్పిన్ త్రయం అశ్విన్, జడేజా, అక్షర్‌లు అటు బ్యాట్‌తో, ఇటు బంతితో మాయజాలానికి సిద్ధమవుతున్నారు.



మరో స్పిన్ టెస్టు : ప్రాక్టీస్ సెషన్లో ఆస్ట్రేలియా క్రికెటర్లు

పుంజుకుంటారా?!

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి ఆస్ట్రేలియా మానసికంగా ఓటమికి సిద్ధపడే వచ్చింది. ఆ జట్టు శిబిరంలో ఆ ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అరంగేట్ర స్పిన్నర్ టాడ్ మర్ఫీ మాయ తప్పితే.. నాగ్‌పూర్ టెస్టులో ఆస్ట్రేలియాకు ఊరటనిచ్చే అంశం ఒక్కటీ లేదు. టాప్ ఆర్డర్‌లో డెవిడ్ వార్నర్ వైఫల్యం ఆ జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల కెరీర్ వందో టెస్టులో ద్వి శతకం బాది ఊపందుకున్న డెవిడ్ వార్నర్ విఫలమవుతున్నాడు. ఉస్మాన్ ఖవాజ రెండు ఇన్నింగ్స్‌ల్లో ప్రభావం చూపలేకపోయాడు. మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్‌లు భారత బౌలర్లను ప్రతిఘటించే ప్రయత్నం చేశారు. ఈ జోడీ నేడు కోట్లలో భారత్‌కు సవాల్ విసిరే ప్రమాదం కనిపిస్తోంది. ఫిట్‌నెస్ సాధిస్తే కామెరూన్ గ్రీన్ సైతం తుది జట్టులో నిలిచే వీలుంది. మాట్ రెన్షా, పీటర్ హ్యాండ్స్‌కాంబ్, అలెక్స్ కేరీలు జట్టులో తమ ఉనికి నిలుపుకోవాల్సిన అవసరం ఏర్పడింది. స్పిన్నర్లు టాడ్ మర్ఫీ, నాథన్ లయాన్‌లపై వికెట్ల బాధ్యత ఉంది. కెప్టెన్ పాట్ కమిన్స్‌కు తోడుగా పేస్ బాధ్యతలు ఎవరు పంచుకుంటారనేది ఆసక్తికరం. స్పిన్ ట్రాక్‌పై రివర్స్ స్వింగ్‌తో భారత్‌ను దెబ్బకొట్టేందుకు ఆస్ట్రేలియా సరికొత్త ప్రణాళిక రచిస్తోందని అనిపిస్తుంది.

పిచ్, వాతావరణం

ఫిరోజ్ షా కోట్ల మైదానం సైతం జామ్తా పిచ్ తరహాలోనే ఉండనుంది. తొలి రోజు పిచ్‌పై తేమ ఉండనుంది. కానీ ఆ తర్వాత పిచ్ జీవం లేకుండా తయారవుతుంది. స్పిన్ స్వర్గధామ పిచ్‌పై ఐదు రోజులు ఆడితే అద్భుతమే అని చెప్పాలి. టాస్ నెగ్గిన తొలుత బ్యాటింగ్ ఎంచుకునేందుకు మొగ్గు చూపనుంది. టెస్టు మ్యాచ్‌కు పెద్దగా వర్షం సూచనలు కనిపించటం లేవు. ఇక్కడ తొలి టెస్టు 1948లో జరుగగా, చివరి టెస్టు 2017లో జరిగింది. 1993 నుంచి కోట్లలో భారత్‌కు ఓటమి లేదు. 1959 టెస్టులో ఆస్ట్రేలియా ఇక్కడ ఇన్నింగ్స్ 127 పరుగులతో గెలుపొందింది. 2008 భారత్, ఆసీస్ టెస్టు డ్రాగా ముగిసింది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), కెఎల్ రాహుల్, చతేశ్వర్ పుజార, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, రవీంద్ర జడేజా, రవిచంద్ర అశ్విన్, కె.ఎస్ భరత్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్.

ఆస్ట్రేలియా : డెవిడ్ వార్నర్, ఉస్మాన్ ఖవాజ, మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్, మాట్ రెన్షా, పీటర్ హ్యాండ్స్‌కాంబ్, అలెక్స్ కేరీ (వికెట్ కీపర్), పాట్ కమిన్స్ (కెప్టెన్), టాడ్ మర్ఫీ, నాథన్ లయాన్, మిచెల్ స్టార్క్/కామెరూన్ గ్రీన్.



హ్యాండ్‌బాల్ చాంప్ భారత్

- ఆసియా ప్రెసిడెంట్ కప్ కైవసం
- విజేతలను అభినందించిన జగన్

న్యూఢిల్లీ : హ్యాండ్‌బాల్‌లో టీమ్ ఇండియా అమ్మాయిల మరో చరిత్ర. ఆసియా ప్రెసిడెంట్ కప్‌ను భారత మహిళల జట్టు తొలిసారి సొంతం చేసుకుంది. ఆసియా హ్యాండ్‌బాల్ సమాఖ్య జోర్డాన్‌లో నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో భారత జట్టు అజేయంగా నిలిచింది. టోర్నీలో ఆరు మ్యాచుల్లోనూ విజయాలు నమోదు చేసింది. డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్దతిలో జరిగిన పోటీల్లో తొలుత కువైట్‌పై 41-15, 40-12తో, ఇరాక్‌పై 31-27, 20-20తో, జోర్డాన్‌పై 37-21, 28-21తో మెరుపు విజయాలు సాధించింది. 12 పాయింట్లతో భారత్ చాంపియన్‌గా నిలువగా, 8 పాయింట్లతో జోర్డాన్ రన్నరప్‌గా నిలిచింది. ఆసియా ప్రెసిడెంట్ కప్ విజేతలుగా నిలిచిన అమ్మాయిల జట్టును భారత హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్‌ఏఐ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు, ఐఓఏ మాజీ కోశాధికారి ఆనందీశ్వర్ పాండేలు ఘనంగా సన్మానించారు. 'జాతీయ హ్యాండ్‌బాల్ చీఫ్‌గా బాధ్యతలు అందుకున్నప్పుడే ఒలింపిక్స్‌లో పతకంపై దృష్టి పెట్టాను. వరుస విజయాలతో ఆ లక్ష్యానికి చేరువగా వెళ్తున్నాం. ఒలింపిక్స్‌లో పతకం దిశగా రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నాం. హిమాచల్ ప్రదేశ్‌లో ప్రత్యేకంగా శిక్షణ శిబిరం ఏర్పాటు చేయటంతో అద్భుత ఫలితాలు వస్తున్నాయని' జగన్‌మోహన్ రావు తెలిపారు.

ముగిసిన కెసిఆర్ సేవాదళం క్రికెట్ టోర్నీ



హైదరాబాద్ : కెసిఆర్ సేవాదళం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా క్రికెట్ పోటీలు గురువారం ఎల్బీ స్టేడియంలో ముగిశాయి. ఫైనల్లో రాయల్ హిట్టర్స్ క్లబ్‌పై ఎంబిసీ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. రాయల్ హిట్టర్స్ క్లబ్ తొలుత 53/4 పరుగులు చేయగా.. ఛేదనలో 4.5 ఓవర్లలోనే ఎంబిసీ 56/4తో విజయం సాధించింది. విజేతలకు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ బహుమతులు ప్రదానం చేశారు. విజేతకు రూ.లక్ష, రన్నరప్‌కు రూ.50 వేలు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ మహ్మద్ అమీర్, శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ సహా తదితరులు పాల్గొన్నారు. ముగింపు వేడుకలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కంటి వెలుగు పథకం పేదలకు వరం :సర్పంచ్

నవతెలంగాణ-యాచారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకం పేదలకు వరం లాంటిదని సర్పంచ్ కంబాళ్లపల్లి సంతోష అన్నారు. యాచారం మండల పరిధిలోని తక్కళ్లపల్లిలో కంటి వెలుగు సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ సెంటర్ ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సెంటర్లో కంటి పరీక్షలు చేసి, కండ్ల అద్దాలు, మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుందారపు సుమలతమ్మ, డాక్టర్ ప్రియాంక, శోభారాణి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ జన్మదిన సందర్భంగా రక్తదానం

నవతెలంగాణ-ధారూర్

మండల పరిధిలోని మోమిన్ కుర్దు గ్రామానికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ పట్లోళ్ల నర్సింహారెడ్డి సీఎం కేసీఆర్ జన్మదిన సందర్భంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్ని రక్తదానం చేశారు. ఈ శిబిరంలో యువజన బీఆర్ఎస్ మండల కార్యదర్శి జైపాల్ రెడ్డి రక్తదానం చేశారు.



నేడు రైతులకు శిక్షణా కార్యక్రమం

నవతెలంగాణ-దోమ

నేడు దోమ మండల పరిధిలోని బట్లచందారం గ్రామంలో మల్బరీ పంటలపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో పరిగి డివిజన్ ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి వై. వైజయంతి కళ్యాణ్ తెలిపారు. ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ, కేంద్ర పట్టు సంస్థ (సీఎస్బీ) ఆధ్వర్యంలో బట్లచందారం గ్రామంలో ఉదయం 10 గంటలకు మల్బరీ పంటలో సస్య రక్షణ చర్యలు, పట్టు పురుగులతో అధిక పంట దిగుబడి సాధించడానికి చేపట్టాల్సిన సమగ్ర సస్య యాజమాన్య చర్యలపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఔత్సాహిక పట్టు రైతులు తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరు కాగలరని కోరారు.

రక్త నమూన సేకరణలో టాప్ 2 లో దోమ పీహెచ్‌సీ



నవతెలంగాణ-దోమ

రక్త నమూనాల సేకరణలో దోమ పీహెచ్‌సీ జిల్లాలోనే టాప్ 2 లో ఉన్నట్టు దోమ సర్పంచుల సంఘం అధ్యక్షులు కె.రాజిరెడ్డి తెలిపారు.గురువారం ఉపసర్పంచ్ గోపాల్‌గౌడ్‌తో కలిసి ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి రద్దిగా ఉండడంతో వైద్యురాలు విద్యతో ఆస్పత్రిలో ఓపీ పేషేంట్లకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.రక్త నమూనాలు సేకరించి టీఎస్ డయాగ్నో ద్వారా యాభై రెండు రకాల రైజల్ట్ ఉచితంగా అందుతున్న విషయం వైద్యురాలు సర్పంచ్‌కు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే కిడ్నీ ఫంక్షన్, షుగర్, బీపీ, థైరాయిడ్, రక్త ప్రసరణ, కోలేస్ట్రా తదితర ఆరోగ్యాంగా ఉండేందుకు ఉపయోగపడే ప్రధానమైన టెస్టులు దోమ ఆస్పత్రిలో సేవలు లభించడం పట్ల సర్పంచ్ రాజిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తరువాత రోగులకు రూపాయి ఖర్చు లేకుండా అన్ని రకాల చికిత్సలు అందుతున్నాయని సర్పంచ్ తెలిపారు.దీంతో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు కృషికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-శంకర్‌పల్లి

శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని తొమ్మిదవ వార్డులో నూతనంగా నిర్మించిన పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్, జె. శ్వేతా పాండురంగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండే విధంగా చూడాలని అమ్మవారిని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాధా బాలకృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, జంగం శేఖర్ తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఆమనగల్

కడ్తాల్ మండలంలోని రావిచేడ్ గ్రామానికి చెందిన మారెల్ల రవి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, తలకొండపల్లి మండల జడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి, ట్రస్ట్ ద్వారా రూ.3 వేలు ఆర్థికసాయం అందజేశారు.పరామర్శించిన వారిలో స్థానిక నాయకులు, ఉప్పల వెంకటేష్ మిత్ర మండలి సభ్యులు చేగూరి రాజు, క్యాసగల్ల రమేష్, శ్రీశైలం గౌడ్, మల్లయ్య, విష్ణు, ఈశ్వరయ్య, స్వామయ్య, రమేష్, శేఖర్, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటా

డీసీసీబీ చైర్మెన్ మనోహర్‌రెడ్డి



నవతెలంగాణ-దోమ

మండల పరిధిలోని గంజిపల్లితండాలో రాంనాయక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు.విషయాన్ని తెలుసుకున్న డీసీసీబీ చైర్మెన్ బుయ్యని మనోహర్‌రెడ్డి రాంనాయక్ ఇంటికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని రూ 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ యాదయ్య గౌడ్, ఎంపీటీసీలు రాంలాల్, విజయ ఆంజనేయులు, నాయకులు రాఘవేందర్ రెడ్డి, శివకుమార్ గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే

వంట గ్యాస్ ధర రూ.500 చేస్తాం

- ఏకకాలంలోనే రూ.2లక్షల రుణమాఫీ
- కౌలు రైతులకు కూడా రైతుబంధు అందజేస్తాం
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్



నవతెలంగాణ-దారుర్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వంట గ్యాస్ ధర రూ. 500 చేస్తామని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా గురువారం మండలం పరిధిలోని నాగసాన్పల్లి, తరిగోపుల గ్రామాల్లో మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ పర్యటించారు. గ్రామంలో ఉన్న యువత బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఇంటింటికీ తిరుగుతూ, రైతు డిక్లరేషన్ గురించి వివరించి, భవిష్యత్తులో చేసే అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. లావని పట్టా భూముల యజమానికి హక్కు కల్పిస్తామన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షలు రుణ మాఫీ చేస్తామనీ, రైతుబంధు రూ. 15 వేలు అందజేస్తామని తెలిపారు. కౌలు రైతులకు కూడా రైతుబంధు అందజేస్తామని చెప్పారు.ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి మొదటి ప్రాధన్యతో ఓటేసి, గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ సభ్యులు కొలుకుంద సంతోష్, మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ధరూర్ ఉపసర్పంచ్ రాజేశ్వర్, సీనియర్ నాయకులు కిషోర్, గఫర్, జమీల్ ధర్మపూర్ సర్పంచ్ అనిల్, అయూబ్ అన్సారి, కాంగ్రెస్ నాయకులు,యువత, కార్యకర్తలు పాల్గొన్నారు

కాంగ్రెస్ గెలుపును అడ్డుకోలేరు

- పార్టీ మండల అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్





నవతెలంగాణ-ఆమనగల్

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపును ఏ శక్తులు అడ్డుకోలేవని కాంగ్రెస్ మండలాధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్ అన్నారు.ఏఐసీసీ ప్రధాన నాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా కడ్తాల్ మండలంలో కొనసాగుతున్న హాత్ సే హాత్ జోడో యాత్ర గురువారం మండలంలోని నాగిరెడ్డి గూడతండాలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యా నాయక్, స్థానిక సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు విఠలయ్య గౌడ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పక్కన పెట్టి ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సాగనంపి, కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేపట్టే సంక్షేమ పథకాలను గడప గడపకూ తిరిగి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు జహంగీర్ బాబా, సర్పంచ్లు పోతుగంటి శంకర్, పాండు నాయక్, రాములు నాయక్, సేవ్యా బావోజీ, నాయకులు దేవ్ సింగ్, జనార్ధన్ గౌడ్, రమేష్, పవన్, జాన్ రెడ్డి, ఫారూఖ్, సేవ్యా నాయక్, పత్య పూర్య, కీర్య, ధోళీ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగించుకోవాలి





నవతెలంగాణ-శంకర్‌పల్లి

'కంటి వెలుగు' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని ఇంద్రారెడ్డి నగర్ వార్డు సభ్యులు వై. ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని మిర్జాగూడ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డినగర్‌లో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామాల్లోని ప్రజలందరూ పాల్గొన్ని కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ పరీక్షలు చేయించుకున్న వారికి వారి రిపోర్ట్ ప్రకారం కండ్ల అంద్దాలు, మందులు వైద్యులు అందిస్తున్నట్టు తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సహాయ సహకారాలతో మిర్జాగూడ గ్రామ సర్పంచ్ రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంద్రారెడ్డి నగర్ కాలనీలో అండర్ డ్రయినేజీ, సీసీరోడ్లు నిర్మాణ పనులతో పాటు కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వై. చిట్టెమ్మ, శారద, కమలమ్మ,డాక్టర్ ప్రశాంతి, ఎంపీహెచ్‌ఏ సుహాసీని, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఆప్టికల్ మిక్, ఆశా వర్కర్లు, కాలనీవాసులు ఎల్‌బీ రెడ్డి, జి.నర్సమ్మ, రాపెన్ పెంటయ్య, లక్ష్మి కళ, గోపాల్‌నాయక్, డి.ఈశ్వరయ్య, కొండూర్ సామి, బత్తుల పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి



నవతెలంగాణ-తలకొండపల్లి

మండలం ఖానాపూర్ గ్రామపంచాయతీలో కర్నాస్‌తండాలో గురువారం తాలుక స్థాయి కబడ్డీ పోటీలు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కబడ్డీ పోటీలో రామ్ నుంతలతండా క్రీడాకారులు పొందిన మొదటి బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ. 10 వేలు కర్నాస్ తండాకు, తృతీయ బహుమతి కల్వకుర్తి క్రీడాకారులకు రూ.5 వేల ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి క్రీడా యువకులకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఖానాపూర్ సర్పంచ్ వెంకటరామిరెడ్డి ,గౌరుపల్లి సర్పంచ్ అనురాధ నరేందర్ గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, ఉపసర్పంచ్ రవి, గ్రామ పెద్దలు గ్రామ యువకులు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్, భరత్ ,శివ, విజయ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపల్లిగూడలో కాంగ్రెస్ బూత్ కమిటీలు ఎన్నిక



నవతెలంగాణ-మంచాల

మండల పరిధిలోని తాళ్లపల్లిగూడ గ్రామంలో కాంగ్రెస్ బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మునికుంట్ల సంతోష్ కుమార్ గౌడ్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని తాళ్లపల్లిగూడ గ్రామంలో ఆయన మాట్లాడుతూ టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఇబ్రహీం పట్నం నియోజక వర్గంలో మంచాల మండలంలో ప్రతి గ్రామంలో బూత్ కమిటీలను ఎన్నుకుంటున్నట్టు తెలిపారు. ప్రతి కార్యకర్తా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు ఎడమ నరేందర్ రెడ్డి, అధ్యక్షులు పల్లాటి జయనందము, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏర్పుల రాజు, మండల కార్యదర్శి కాస గణేష్, సీనియర్ నాయకులు వింజమూరి ప్రేమాకర్ రెడ్డి, కంద కట్ల జైపాల్ రెడ్డి, పల్లాటి జంగయ్య, ముత్యాల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

- మల్లప్పగుట్టపై స్వామి వారిని ఉరేగింపు



నవతెలంగాణ-తలకొండపల్లి

తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామపంచాయతీ పరిధిలో గురువారం శ్రీ శ్రీ మల్లప్ప గుట్ట మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా సర్పంచ్ తిప్పిరెడ్డి స్వప్న భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారిని మల్లప్పగుట్టపై స్వామివారిని ఉరేగించే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ రమేష్ నాయక్,ఉపసర్పంచ్ వరలక్ష్మి రామాంజనేయులు, వార్డు సభ్యులు మల్యానాయక్, రమేష్ నాయక్, ఈధపరెడ్డి, కృష్టారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, బుచ్చిరెడ్డి, గోపాల్ రెడ్డి, మల్లేష్ నాయక్, సత్యనారి, పర్వతాలు యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్



నవతెలంగాణ-ఆమనగల్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి శాసన సభ్యులు గుర్క జైపాల్ యాదవ్ అన్నారు. మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ నేపథ్యంలో ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, మంజూరైన రూ.లక్షా ఎల్‌వోసీ చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగించుకోవానలి కోరారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన కె.మల్లయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మల్లయ్య మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ లాయఖ్ అలి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చే వరకూ పోరాడుతాం

- సీపీఐ జిల్లా నాయకులు కె.రామస్వామి
- మూడోవ రోజుకు చేరుకున్న సీపీఐ భూపోరాటం



నవతెలంగాణ-చేవెళ్ల

ప్రతి పేదవాడికి పట్టాలు ఇచ్చేవరకూ సీపీఐ పోరాడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. రామస్వామి అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం మూడోవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన గుడిసే పోరాటాన్ని సందర్శించారు. అనంతరం రామ స్వామి మాట్లాడుతూ గుడిసెలు వేసుకున్న ప్రతి పేదవాడికీ పట్టాలిచ్చే వరకూ సీపీఐ పోరాడుతోందన్నారు. భూ కబ్జాదారులు, ధనవంతులు ప్రభుత్వ భూములను ఆక్రమించి దర్జాగా అనుభవిస్తుంటే ప్రభుత్వ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పేదవాళ్ల 60 గజాల స్థలాన్ని ఇవ్వాలని ప్రభుత్వానికి పలు సందర్భాలలో వినతులు అందజేసినా పట్టించుకోకపోవడంతో పేదలు విసిగి చెంది సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటాలకు సిద్ధమైనట్టు తెలిపారు. పేదవాడికి గుడిసె స్థలం ఇచ్చే వరకు సీపీఐ భూ పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కేసులు పెట్టినా,భయపడబోమని తెలిపారు. ఇప్పటికనా నిరుపేదలందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌గౌడ్, బీకే ఎంయూ జిల్లా అధ్యక్షులు జే.అంజయ్య, మండల సహాయ కార్యదర్శి మక్బూల్, మల్లేష్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, మాధవి, విజయమ్మ, అనసూయ, సాయిలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందజేత

ఎంఈవో వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ-మంచాల

ప్రభుత్వ పాఠశాలల్లో పదోవ తరగతి విద్యార్థులకు సాయంత్రం సమయంలో స్నాక్స్ అందిస్తున్నామని మంచాల ఎంఈవో వెంకట్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పదోవ విద్యార్థులకు వార్షిక పరీక్షలు దగ్గర పడటంతో పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు తీసుకోవడంతో పాఠశాలల్లో సాయంత్రం 6 గంటల వరకూ ఉంటున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో మండలలోని ప్రతీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులందరికీ సాయంత్రం స్నాక్స్ అందజేస్తున్నట్టు తెలిపారు. మండలంలో పదోవ తరగతి చదువుతున్న విద్యార్థులు మొత్తం 325 మంది ఉంటారనీ, వారందరికీ ప్రతి రోజూ సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నట్టు తెలిపారు.జడ్పీహెచ్ఎస్ మంచాల పాఠశాలలో విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న జీహెచ్ఎం నారాయణ రెడ్డి తదితరులున్నారు.



వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఆనంద్

నవతెలంగాణ- మర్పల్లి

మండల కేంద్రానికి చెందిన కో-ఆప్షన్ సభ్యులు సోహెల్ షరీఫ్,ఫెరోజ్ షరీఫ్‌లకు ఇటీవల వివాహం జరిగింది. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నందున హాజరుకాలేని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గురువారం నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మధుకర్, వైస్. ఎంపీపీ మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్ గుప్తా, పార్టీ మండలాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, డైరెక్టర్లు యాదయ్య, గౌస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షులు గఫార్, జావిద్,అలీం తదితరులు ఉన్నారు.

తాగునీటి ఫిల్టర్ ఏర్పాటుకు కృషి

- దాత సమానారంరెడ్డి

నవతెలంగాణ-మొయినాబాద్

గ్రామస్తుల కోసం తాగునీటి ఫిల్టర్ ఏర్పాటు చేయనున్నట్టు దాత సామానారంరెడ్డి తెలిపారు. గురువారం వాటర్ ఫిల్టర్ ఏర్పాటుకు గ్రామపంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు కలుషితమైన నీరు తాగి అనారోగ్యపాలు కావద్దనే ఉద్దేశంతోనే రూ.10లక్షలతో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.సురక్షితమైన తాగునీటిని ఆరోగ్యంగా ఉండేందుకు గ్రామపంచాయతీ అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శివకుమార్, కృష్ణరెడ్డి, రవీందర్ రెడ్డి, శేఖర్ యాదవ్ వేంకట్ రెడ్డి ,రాములు,సిద్దు తదితరులు పాల్గొన్నారు.





క్రికెట్ కిట్టు డ్రెస్సులకు రూ.30 వేల విరాళం

నవతెలంగాణ-మర్పల్లి

మండలంలోని గుర్రం గట్టుతండాకు చెందిన క్రికెట్ క్రీడాకారులకు క్రికెట్ కిట్టు, డ్రస్సుల కొనుగోలు కోసం జడ్పీటీసీ మధుకర్ రూ.10 వేలు, సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రూ.10 వేలు, బీఆర్ ఎస్ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి రూ.10 వేలు (మొత్త రూ.30 వేలు) క్రీడాకారులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని సూచిం చారు. చదువు, వ్యాయామం, క్రీడలు, స్వయం ఉపాధి వంటి వాటిపై ఆసక్తిని పెంపొందిం చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-తలకొండపల్లి

తలకొండపల్లి మండలం వెంకటాపూర్‌తండా గ్రామానికి చెందిన చెవిటి రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. ఈ విషయం గ్రామ సర్పంచ్ సభావట్ జగిని కుమారుడు రమేష్ నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో శ్రీశైలం, వార్డు మెంబర్ చెవిటి శ్రీను, ఎన్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-బంట్వారం

మండల పరిధిలోని మద్వాపూర్ గ్రామంలో అధికారులు పారిశుధ్య పనులు చేట్టారు. గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యపై ఆదివారం నవతెలంగాణలో ' మద్వాపూర్‌లో కొరవడిన పారిశుధ్యం' అనే శీర్షికతో కథనంపై ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో నెలకొన్న పారిశుధ్య పనులపై ఆరా తీశారు. పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని గుర్తించారు. గురువారం సర్పంచ్, సెక్రటరీల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బందితో మురుగు కాలువలు శుభ్రం చేయించారు. ఈ సమస్యకు పరిష్కారం కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

వివాహ వేడుకల్లో కేఎంఆర్



నవతెలంగాణ-దోమ

మండల పరిధిలోని మోత్కూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గెరిగంటి కృష్ణయ్య కూతురు వివాహానికి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి హాజరై నూతన వధూవరుల ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, ఏఎంసీ చైర్మెన్ సురేందర్ కుమార్, పరిగి దోమ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు ఆంజనేయులు, గోపాల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మెన్ పభాకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షులు మచ్చేందర్ రెడ్డి, మోత్కూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు మల్లేశం, శశిధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మోత్కూర్ గ్రామ రైతు బంధు సమితి అధ్యక్షులు మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



గెలుపొందిన బహుమతి గ్రామపంచాయతీకి అంకితం

నవతెలంగాణ-ఆమనగల్

మండలంలోని రాంనుంతల గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారులు తాము గెలుపొందిన బహుమతిని గ్రామ పంచాయతీకి అంకితమిచ్చారు. ఇటీవల ఐక్యత ఫౌండేషన్ వారు నిర్వహించిన తాలూకా స్థాయి కబడ్డీ పోటీల్లో రాంనుంతల గ్రామానికి చెందిన క్రీడాకారులు పాల్గొని మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈమేరకు ఐక్యత ఫౌండేషన్ ఎక్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డితో అందుకున్న రూ.20 వేలు, నగదుతో పాటు టోర్నమెంట్ ట్రోఫీని గురువారం తాము పుట్టి పెరిగిన ప్రాంతానికి గుర్తుగా గ్రామ పంచాయతీకి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా తాలూకా స్థాయిలో గ్రామానికి గుర్తింపు తేవడంతో పాటు తాము గెలుపొందిన బహుమతిని గ్రామ పంచాయతీకి అంకితమిచ్చిన క్రీడాకారులు కెప్టెన్ సాయి కిరణ్, సాయి చరణ్, సాయి కుమార్, జగదీష్, రాకేష్, నవీన్, నందు తదితరులను సర్పంచ్ వద్యావత్ సోనా శ్రీను నాయక్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నవతెలంగాణ-శంకర్‌పల్లి

శంకర్‌పల్లిలో పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. శంకర్‌పల్లిలోని ఓ పాఠశాల చెందిన బస్సు డ్రైవర్లు బస్సులోనే పేకాడుతున్నారు. పక్కా సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పేకాడుతున్న 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 8 వేల నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నిరుపేదలకు ఆయూష్మాన్ భారత్ బీమా కార్డులు అందజేత



నవతెలంగాణ-కొత్తూరు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ నిరుపేదలకు వరం లాంటిదని మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ కో-కన్వీనర్ అమడపురం నరసింహా గౌడ్ అన్నారు. గురువారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ లో ఆయుష్మాన్ భారత్ భీమ కార్డులను నిరుపేదలకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు సుకన్య సమృద్ధి యోజన, ఫసల్ భీమా, సురక్ష భీమా లాంటి అనేక పథకాలను నేరుగా లబ్దిదారులకు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అందె బాబయ్యా, దేపల్లి అశోక్ గౌడ్, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, బీజేపీ యువ నాయకులు మిథున్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎ. రణధీర్‌గౌడ్, బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి పిట్టల శేఖర్‌గౌడ్, సుధాకర్ రెడ్డి, బీజేపీ ఉపాధ్యక్షులు బొడ్డు జగన్, కార్యదర్శులు కొస్గి మల్లేష్, రాఘవేందర్ రెడ్డి, పెద్దాపురం కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

సోమనాథేశ్వరస్వామి బోనాల ఉత్సవాలు

- పాల్గొన్న డీసీసీబీ వైస్ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య



నవతెలంగాణ-యాచారం

మండల పరిధిలోని మొండిగౌరెల్లిలో శ్రీ సోమనాథేశ్వరస్వామి బోనాల ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీమల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమనాథేశ్వరస్వామి కల్యాణోత్సవం, బోనాలు, చౌడాలమ్మ పూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండిమీది కృష్ణ మాదిగ, ఉప సర్పంచ్ మేకల యాదగిరి రెడ్డి, మరిపల్లి బాలరాజు యాదవ్, నక్క శ్రీను యాదవ్, బాల మల్లేష్ యాదవ్, నక్క బాలరాజు యాదవ్, కుంటి పాండు యాదవ్, కుంటి రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక వ్యవసాయసహకార సంఘ సభ్యులకు అండగా ఉంటాం

- డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి

నవతెలంగాణ-కుల్కచర్ల

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యులకు అండగా ఉంటామని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. కుల్కచర్ల మండలం పీరంపల్లి గ్రామానికి చెందిన బుడిగి వెంకటయ్య మృతి చెందాడు.సహకార సంఘంలో సభ్యత్వం ఉండడంతో గురువారం డీసీసీబీ చైర్మన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తరపున కుటుంబానికి రూ.9వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో సీఈవో బక్కరెడ్డి,సొసైటీ డైరెక్టర్ కొండయ్య, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు రాంలాల్, సీనియర్ నాయకులు జోగు వెంకటయ్య గౌడ్, కృష్ణయ్య గౌడ్, బచ్చిరెడ్డి, బాల్ రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



మాణిక్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

- యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ రాములు
- ఆమనగల్ మండలంలో యూటీఎఫ్ నాయకుల విస్తృత ప్రచారం



నవతెలంగాణ-ఆమనగల్

విద్యారంగ సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న పాపన్నగారి మాణిక్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీ హెచ్ రాములు అన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి పాపన్న గారి మాణిక్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల, బస్టాండ్ ఉన్నత పాఠశాలలతో పాటు ఆకుతోటపల్లి ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ నాయకులతో కలిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ రాములు ప్రచారం నిర్వహించారు. విద్యారంగ సమస్యలు వాటి పరిష్కారం పట్ల పూర్తి అవగాహన ఉన్న పాపన్నగారి మాణిక్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలుపించాలని వేడుకొన్నారు. యూటీఎఫ్ మండల బాధ్యులు పబ్బతి ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అనిల్, సాంబయ్య, జిల్లా కోశాధికారి జగన్నాథ్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రాములయ్య, శ్రీనివాసులు, రాంచందర్, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంగా చదువుకుని వృద్ధిలోకి రావాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-శంకర్‌పల్లి

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులు ఇష్టంగా చదువుకుని, వృద్ధిలోకి రావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, స్టేషనరీ అందజేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య అభివృద్ధి కోసం ఎన్నో నిధులు విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యా అందుతుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యనందిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్వేతా పాండురంగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

- వైస్ చైర్మెన్ వెంకటేశ్ యాదవ్, కౌన్సిలర్ శ్రీకాంతరావు



నవతెలంగాణ-గండిపేట్

మహిళలు అన్ని రంగాల్లో ఎదిగి, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని వైస్ చైర్మెన్ గొర్ల వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్ రావు అన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీలోని ఆరో వార్డు పొదుపు సంఘాల మహిళలకు కెనరా బ్యాంక్ మేనేజర్ ద్వారా రూ.15 లక్షల రుణాలను అందించాలని బ్యాంక్ మేనేజర్‌ను కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. బ్యాంకుల ద్వారా మహిళలు రుణాలను పొందుతూ అభివృద్ధిని సాధించాలన్నారు. బ్యాంకు ద్వారా పొందిన రుణాలను తిరిగి సకాలంలో చెల్లించాలన్నారు. సబ్సిడీ ద్వారా వచ్చిన రుణాలను పొదుపు సంఘాల మహిళలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ప్రమోద్‌సింగ్, పొదుపు సంఘాల మహిళలు సుధారాణి, భాగ్యలక్ష్మి, దీపిక, మీరాబాయి, విజ్ఞాత, రజిని, మాధవి, ఆర్ పి మస్రత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి



నవతెలంగాణ-షాబాద్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అవసరమని ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పోతుగల్ ఉన్నత పాఠశాలలో క్వాల్కమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అను రాధ, ఎంఈవో శంకర్‌రాథోడ్, సర్పంచ్ ఇస్మ త్యేగం, పాఠశాల ప్రధానోపాధ్యాయలు శ్రీనివాస్, యునైటేడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఎన్జీవో ప్రాజెక్టు మేనేజన్ ముంతాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ

- దోమ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రాజిరెడ్డి



నవతెలంగాణ-దోమ

విద్యార్థులు క్రమ శిక్షణతోనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, వ్యక్తిగత నాలెడ్జ్ పెంచుకుంటూ తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని దోమ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కె.రాజిరెడ్డి అన్నారు. గురువారం దోమ ప్రభుత్వ కళాశాలలో చదువు కుంటున్న విద్యార్థులకు 'మేము సైతం యువత కోసం' కార్యక్రమంపై ఉప సర్పంచ్ గోపాల్ గౌడ్, మండల మైనార్టీ కో-ఆప్షన్ సభ్యులు ఖాజాపాష, వార్డు మెంబర్ మైనోద్దీన్ ఆధ్వర్యంలో ప్రధాన వక్త సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్ సేవక్ కుమార్‌తో మూడు గంటలపాటు కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు యువతకు చాలా అవసరమని కళాశాల ప్రిన్సిపాల్ మంజూల తెలిపారు. విద్యార్థులు తల్లీ దండ్రులతో విద్య నేర్పించిన గురువులతో వినయంగా ఉంటూ, వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచిం చారు. ఈలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు సృజనాత్మకత పెంపొందుతోందన్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు చాలా అంశాలు నేర్చుకున్నామని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు సునీత,నాజీనిన్ శ్రీధర్,కుమార్, సురేష్ హరికృష్ణ , విద్యార్థులు పాల్గొన్నారు.

పట్లూర్ హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు





నవతెలంగాణ-మర్పల్లి

మండలం పట్లూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గురువారం స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నందున మందిర ప్రారంభోత్సవానికి హాజరు కాలేకపోయిన ఎమ్మెల్యే గురువారం ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ దేవర దేశి అశోక్‌తో కలిసి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులకు ఆలయ నిర్మాణ కమిటీ చైర్మెన్ దేవర దేశి అశోక్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, సీనియర్ నాయకులు ప్రభాకర్ గుప్తా, పార్టీ మండలాధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు నాయబ్ గౌడ్, పట్లూర్ అధ్యక్షులు అశోక్, మోహన్, శంకర్, గ్రామ పెద్దలు, కార్యకర్తలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సామాగ్రి అందజేత



నవతెలంగాణ-తలకొండపల్లి

తలకొండపల్లి మండలం జులపల్లి గ్రామానికి చెందిన గురువారం మాల కాశయ్య ఇంటి నిర్మాణానికి బీఆర్ఎస్ యువ నాయకుడు గౌతరెడ్డి విజయ్ కుమార్ రెడ్డి 20 సిమెంట్ బస్తాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్ప సర్పంచ్ ,వార్డ్ సభ్యులు, అశోక్, శేఖర్ రెడ్డి,శ్రీధర్ గోవర్ధన్ రాజు నాయక్ సంజీవ,మణికంఠ,లస్కర్ పెద్దూర్ మల్లేష్, బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్



నవతెలంగాణ చేవెళ్ల

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో కాసుల రామ్‌గౌడ్-కాసుల నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాసుల బాబయ్య గౌడ్-కాసుల జ్ఞానేశ్వర్ గౌడ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను చేవెళ్ల మాజీ పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, కేసారం గ్రామ సర్పంచ్ కాసుల రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ డైరెక్టర్ పైండ్ల మధుసూదన్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు పడతాయని, క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడుతాయన్నారు. క్రీడల వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జిల్లా స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు.ఈ క్రీడాలతో వల్ల గ్రామీణ క్రీడాకారులు ప్రతిభ వెలికితీయవచ్చని తెలిపారు. అనంతరం ఏబీ టీమ్, కేసారం గోల్డెన్ ఈగల్స్ జట్ల మధ్య జరిగిన మొదటి మ్యాచ్ ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు తిలకించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసుల రాఘవేందర్ గౌడ్, దయానంద్ గౌడ్, నిరంజన్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, నాగరాజు గౌడ్, ఆర్గనైజర్లు దర్శన్, రామ్ లక్కీ, బద్రి, కరుణాకర్ రెడ్డి, శశాంక్, సువాస్ గౌడ్, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

కులవృత్తులకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి





నవతెలంగాణ-ఆమనగల్

గ్రామీణ ప్రాంతాల్లోని కులవృత్తుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కులవృత్తులను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కుల వృత్తుల వ్యవస్థను అభివృద్ధి పర్చాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర క్యాబినెట్ సమావేశంలో మంత్రి మండలి ఆమోదం తెలిపినందుకు ప్రధాన మంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కులవృత్తి సంఘాలుగా ఏర్పాటు చేసుకుంటే వారికి కేంద్రం నిధులు కేటాయించి గ్రామీణ కుల వత్తుల వ్యవస్థను అభివద్ధి చేయడానికి కేంద్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ కార్య క్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పాత్లావత్ మన్య నాయక్, మాజీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంక టొరెడ్డి, రాష్ట్ర నాయకులు శంకర్‌నాయక్, జిల్లా నాయకులు యాదగిరి, సాయి లాల్‌నాయక్, రవీందర్ రెడ్డి, మండల నాయకులు శ్రీశైలం, ప్రేమ్‌కుమార్, మహేష్ కుమార్, కర్ణాకర్, వెంకటేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించండి
- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య



నవతెలంగాణ-షాద్ నగర్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్న గారి మాణిక్ రెడ్డిని గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె. జంగయ్య అన్నారు. గురువారం షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని చౌదరిగుడా, కొందుర్గు మండలాలలో ఉన్న ఏడు ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య పాల్గొని, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రాథమిక విద్యారంగం, ఉన్నత విద్యారంగం, మౌలిక వసతులు లేక, నియామకాలు లేక, ఉన్న సిబ్బందికి పదోన్నతులు లేక విద్యార్థులకు,ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. గత కొన్నేండ్లుగా బదిలీలు లేక అవస్థలు పడుతున్న ఉపాధ్యాయులకు 317 జీవో వల్ల స్థానికతను కోల్పోయి మారుమూల ప్రాంతాలకు వేయడంతో 'మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు'అన్న చందంగా మారిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే వారి తరఫున నిరంతరం పోరాడే నాయకుడు పాపన్న గారి మాణిక్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వెంకటప్ప, జిల్లా కార్యదర్శి కే వెంకటయ్య, మండల బాధ్యులు హనుమంతు, శేఖర్ గౌడ్, వలిగి కృష్ణ, ప్రేమ్ సాగర్, రాజకుమార్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గున్‌గల్‌లో చిరుధాన్యాల ప్రాధాన్యతపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-యాచారం

మండల పరిధిలోని గున్‌గల్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వారి ఆధ్వర్యంలో గురువారం మహిళలకు చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ నీలా రాణి మాట్లాడుతూ విటమిన్లు, ఖనిజాలు, సల్ఫర్, ఫైటోడెమికల్స్‌తో కూడిన ఆమైలో ఆమ్లాలు ఉండే పదార్థాలు తీసుకోవాలని కోరారు. ఆధునిక కాలంలో వీటి వాడకం బాగా పెరిగిందని గుర్తు చేశారు. చిరుధాన్యాలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉంటే తమ పిల్లలు ఆరోగ్యపరంగా పెరుగుదల బాగా ఉంటుందన్నారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని పెరిగే పిల్లలకు తప్పకుండా ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, స్పందన, శ్రావణి, మహిళ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి

- సీడీపీ పార్మేషన్ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు
- బీఆర్ఎస్ మండలాధ్యక్షులు శ్రీనివాస్



నవతెలంగాణ-పెద్దేముల్

రైతుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షులు కోహిర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం పెద్దేముల్ కేంద్రం సమీపంలోని చాకలి విఠల్ పొలం వద్ద నుంచి హనుమాన్ ఆలయం గుడి వరకూ, సీడీపీ పార్మేషన్ రూ.5 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం హయంలోనే

రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసిఆర్‌కే దక్కుతోందన్నారు. తాండూరు ప్రాంతంలో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి చొరవతో గ్రామాలు అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయన్నారు.దశలవారీగా మండలా అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ రంగయ్య, బీఆర్ఎస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి బంగ్లా రఘు, గ్రామ కమిటీ అధ్యక్షులు డీవై. ప్రసాద్, ప్రధాన కార్యదర్శిలు మామిండ్ల వెంకటయ్య, బీఆర్ఎస్ సీనియర్ నేత నర్సింలు గౌడ్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న లారీ డ్రైవర్ మృతి

- పలువురికి తీవ్ర గాయాలు





నవతెలంగాణ-మర్పల్లి

ప్రమాదవశాత్తు లారీ చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పట్లూర్ గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం బంట్వారం మండలం రొంపల్లి గ్రామానికి చెందిన 8మంది కూలీలు గత రెండు నెలలుగా లారీల్లో పత్తి నింపే కూలి పనులు చేస్తున్నారు. రోజు వారి మాదిరిగా గురువారం ఉదయం పత్తి నింపేందుకు సదాశివపేట్ వెళుతుండగా పట్లూర్ గ్రామ శివారులో అతివేగంతో వెళుతున్న టీఎస్‌యూఎఫ్ 1409 నంబర్ ఉన్న పత్తి లారీ అతివేగంతో వెళుతూ తుమ్మ చెట్టును ఢీకొనడంతో లారీ డ్రైవర్ పడమటి అడివప్ప తండ్రి మానెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన కూలీలను సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జనముల రాములు తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ అరుణ్ కుమార్ గౌడ్ తెలిపారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకోవాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి



నవతెలంగాణ-మర్పల్లి

మండలంలోని గ్రామాల్లో శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు, గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఉదయం 9గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

'రైతుల అభ్యంతరం మేరకు రిజిస్ట్రేషన్ నిలుపుదల'



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

మోమిన్‌పేట మండలం ఎంకేపల్లి గ్రామంలో గల సర్వే నెంబర్ 87, 94 పట్టా భూమి ధరణి ఆన్లైన్ రికార్డు ప్రకారం మమ్మద్ అలీ పేరు నమోదు అయినందున గతంలో పట్టా పాస్ బుక్ జారీ చేశామని మోమిన్ పెట్ తహసీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. ఇట్టి భూమిపై హైదర్ అలీ అహ్మద్ అలీ అనే వ్యక్తులు కోర్టును ఆశ్రయించినట్టు పేర్కొన్నారు. దీనిపై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. దీని గడువు ముగిసిందని తెలిపారు. తదుపరి మధ్యంతర లేనందున ధరణిలో బ్లాక్ లో ఉన్న నంబర్‌ను అన్ బ్లాక్ చేశామని తెలిపారు. ధరణిలో నమోదైన పట్టాదారు మహమ్మద్ అలీ భూమి ని విక్రయించుటకు గాను కబ్జాలో ఉన్న రైతుల నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన డాక్యుమెంట్లు తమ కార్యాలయంలో సమర్పించగా డాక్యుమెంటేషన్ ప్రక్రియ జరిపామని తెలిపారు. ఆన్లైన్ రికార్డుల్లో ఎట్టి మార్పులు జరగలేదని, ధరణిలో ఉన్న పట్టాదారు పేరున ప్రస్తుతం ఇట్టి భూమి కలదని వివరించారు. ప్రస్తుతం ఇట్టి భూమిపై రైతుల అభ్యంతరం మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిగా నిలుపుదల చేసినట్టు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

పరీక్షలు దగ్గరొస్తున్నాయి.. మా టీచర్ల సమస్యలు పరిష్కరించండి సారు..

- హైకోర్టు జడ్జికి పోస్ట్ కార్డులు పంపిన విద్యార్థులు



నవతెలంగాణ-మాడ్గుల

'తమకు పరీక్షలు దగ్గర వస్తున్నాయి మా భాష పండితుల సమస్య తమరి దగ్గర ఉందంట వాటిని తక్షణమే పరిష్కరించాలి' అని కోరుతూ మండలంలోని నాగిళ్ల విద్యార్థులు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పోస్టు కార్డులు పంపారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు మోకాళ్లపై నిల్చుని కార్డులు చూపుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. తెలుగు హిందీ బోధించే ఉపాధ్యాయులు తమ పదోన్నతుల కోసం పోరాటంలో భాగంగా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పాఠాలు చెప్పడం నిలిపివేశారు. వారి సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున త్వరలో తమకు పరీక్షలు జరగనున్న తరుణంలో ఆయా సబ్జెక్టులలో తాము నష్టపోయే అవకాశం ఉన్నదని విద్యార్థులు తెలిపారు. వెంటనే వారి సమస్యను పరిష్కరించాలని జడ్జిని కోరుతూ పోస్ట్ కార్డులు పంపినట్టు తెలిపారు.

మానవత్వం చాటిన హెచ్ఆర్డీ పాఠశాల విద్యార్థులు

- అంధులకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

ఇబ్రహీంపట్నం సమీపంలోని హెచ్ఆర్డీ పాఠశాల విద్యార్థులు మానవత్వం చాటారు. అంధులకు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. చిన్నతనంలోనే వారు చూపిన పెద్ద మనస్సుకు అంధులు, వృద్ధులు అభినందనలు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని హెచ్ఆర్డీ పాఠశాల విద్యార్థులు పైసా పైసా పోగుచేసి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే అనాథలు, వృద్ధులకు చేయూతనిస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు. ఇబ్రహీంపట్నంలోని వినోబానగర్‌లో కొనసాగుతున్న స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వహిస్తున్న అంధులకు, వృద్ధులకు తమ వంతు ఆర్థిక సహాయాన్ని ఆ పాఠశాల విద్యార్థులు అందజేశారు. గతంలోనూ వారిని ఘనంగా సన్మానించి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధురి మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే సేవా గుణాన్ని అలవర్చుకోవడం అభినందనీయమని విద్యార్థులను కొనియాడారు. ప్రార్థించే చేతుల కన్నా సాయం చేసే చేతులు ఎంతో మిన్న అన్న స్ఫూర్తిని తమ పాఠశాల విద్యార్థులు అమలు చేస్తున్నారని అన్నారు. తాము సంపాదించిన మొత్తంలో ఎంతో కొంత ఇతరులకు సహాయం చేయాలని సంకల్పాన్ని నేర్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.



ఎమ్మెల్సీగా గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ కోరారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కొంగరకలాన్, ఆదిభట్ల పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిలిస్తే పలికే నాయకులు అవసరమన్నారు. గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి మొదటి ప్రాధన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాంపల్లి రోజ్ గార్డెన్‌కు ఉదయం 9గంటలకు తరలి రావాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు సరైన విద్య అందించలేకపోతున్నారన్నారు. కొత్త రిక్రూట్మెంట్ ద్వారా ఉపాధ్యాయులను నియమిస్తే పేద విద్యార్థులకు సరైన విద్య అందుతుందన్నారు. మండల అధ్యక్షులు పరమేశ్, రాష్ట్ర కార్యదర్శి రాంమోహన్ బుచ్చయ్య, రాష్ట్ర బాధ్యులు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మన్నెగూడలో బండి సంజయ్‌కి స్వాగతం పలికిన బొనేటి కిరణ్



నవతెలంగాణ-పూడూర్

పూడూరు మండల పరిధిలోని మన్నెగూడకు విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనేటి కిరణ్ గురువారం ఘనంగా స్వాగతం పలికారు. ఆయనతోపాటు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు సదానందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.మల్లేష్, మండల అధ్యక్షులు జాజుల అనిల్, తదితరులు ఉన్నారు. అనంతరం పరిగి సబ్‌జైల్‌లో శివ స్వాములను పరామర్శించడానికి వెళ్లారు.

అవిశ్రాంత పోరాటం

- అయినా దక్కని ఇంటి స్థలం
- రాజ్యం మారినా పేదల బతుకులు మారలే..
- 60 గజాల జాగా కోసం ఏండ్లుగా ఆరాటం
- భూ పోరాటంలో వెలికి తీసిన భూములు సర్కారు చేతుల్లోనే
- కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అన్యక్రాంతం
- తెలిసినా పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం
- మంచాల మండలంలో భూ పోరాట ఇతివృత్తం

భూ పోరు 4



ఇందిరమ్మ రాజ్యం మారింది.. ప్రత్యేక రాష్ట్ర సాధన చిరకాల కల నెరవేరింది.. స్వరాజ్యం సిద్ధించింది. అయినా సొంతగూడు కల నెరవేరడం లేదు. స్వరాజ్యంలోనూ ఇండ్ల స్థలాల కోసం ఆరాటం తప్పడం లేదు. గత ప్రభుత్వాల హయాంలో కబ్జాలకు గురైన వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను సీపీఐ(ఎం) వెలికి తీసింది. ఆ పార్టీ నిర్వహించిన భూ పోరాటల్లో వేలాదిగా తరలి వస్తున్న పేదలకు ఇండ్లే కట్టిస్తుంటే జాగలెందుకని గత ప్రభుత్వం హేళన చేసింది. ఆ పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనైనా తమ కల నెరవేరుతుందని అనుకుంటే.. నేటికీ కలగానే మిగిలింది.

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వందలాది మంది నిలువ నీడలేని పేదలకు ఎర్రజెండాలు చేతబట్టి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేశారు. ధర్నాలు, రాస్తారోకోలు, నిరహార దీక్షలు, ప్రజాదర్బార్‌ల ముట్టడి, అధికారులకు వినతులు సమర్పించారు. అయినా పేదలపై ప్రభుత్వానికి కనికరం చూపడం లేదు. దాంతో వారి సొంతింటి కల కళగానే మిగిలింది. ప్రభుత్వ భూముల్లో తమకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా వెనకాడలేదు. తమకు ఉండడానికి జానెడు జాగ ఇచ్చే వరకూ కదిలేది లేదని ఆ సందర్భంగా పేదలకు ఆందోళనలు నిర్వహించారు. కానీ ప్రభుత్వం వారికి ఇంటి స్థలం ఇవ్వకపోగా వేల మందిపై కేసులు నమోదు చేసింది.

మంచాల మండలంలో కాగజ్‌ఘట్‌లోని 22/4 సర్వేనంబర్‌లో నాలుగు ఎకరాల భూమిలో పేదలకు గుడిసెలు వేసుకున్నారు. ఆ పోరాటం ఫలితంగా 22 ఇండ్లను ప్రభుత్వం కట్టించారు. ఇంకా ప్రభుత్వం భూమి ఉంది. ఇక్కడ కొందరు వేరే సర్వే నంబర్లు వేసి విక్రయిస్తే సీపీఐ(ఎం) అడ్డుకుంది. అనేక మంది అర్హులున్నారు. ఇండ్ల స్థలాలు లేని పేదలు న్నారు. వారికి ఇవ్వాల్సి ఉంది. కానీ వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వకపోగా ప్రభుత్వం ఆ సందర్భంగా ఆరుగురు నాయకులపై కేసులు పెట్టింది. లింగంపల్లిలోని మనోహరాబాద్‌లో ఇండ్ల స్థలాల కోసం పేదలు గుడిసెలు వేశారు. ఇండ్ల స్థలాల పట్టాలు సిద్ధం చేసినా కార్యాలయంలోనే మగ్గుతున్నాయి. ఆగాపల్లిలో సర్వే నంబర్ 118లో రెండెకరాల భూమిలో సర్వే చేసి ఇండ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన అధికారులు మినకుండిపోయారు. ప్రస్తుతం ఆ భూమిని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జాకు పాల్పడుతున్నారు. ఆరుట్లలో సర్వే నంబర్ 1058లో రెండెకరాల భూమిలో ఇండ్ల స్థలాల సర్టిఫికెట్లు పంపిణీ చేసినా నేటికీ కబ్జాలు చూపలేదు. ఆరు గ్రామాల్లో నిర్వహించిన ఇండ్ల స్థలాల భూపోరాటంలో పేదలకు నిద్రహారాలు మానీ ప్రభుత్వాధికారులకు ముచ్చేమటలు పట్టించారు. ఈ పోరాటంలో సీపీఐ(ఎం) నాయకులపై పెట్టిన కేసులు పేదల్లో ఆగ్రహం తెప్పించిన సంఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తోంది.

పేదల గోడు పట్టని ప్రభుత్వం : పి.యాదయ్య



పేదలకు ఎర్రజెండా నీడన అక్రమించిన ప్రభుత్వ భూముల్లో ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలి. మంచాల మండలంలో అనేక భూపోరాటాలకు సీపీఐ(ఎం) నాయకత్వం వహించింది. అన్యాక్రాంతమవుతున్న భూములను వెలికి తీసింది. ఈ సందర్భంగా అనేక మంది సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, పేదలపై కేసులు నమోదు చేశారు. అన్యాక్రాంతమవుతున్న భూములను వెలికి తీశాం. ఎర్రజెండా నీడన పేదలు గుడిసెలు వేసుకున్నారు. కానీ వారికి నేటికీ పట్టాలు జారీ చేయడం లేదు. అనేక రూపాల్లో ప్రభుత్వానికి పేదలు విన్నవిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొనాలి.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట





నవతెలంగాణ-కేశంపేట

మండల పరిధిలోని తులవానిగడ్డ గ్రామంలో రామ లింగేశ్వర, దుర్గామాత, దత్తాత్రేయ, సాయిబాబా, ధ్వజస్తంభ విగ్రహ పునర్నిర్మానం, ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, బీజేపీ నేతలు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, మిథున్ రెడ్డిలు వేరువేరుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్

- పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా లింగంపల్లి డివిజన్‌లోని శ్రీరామ్ నగర్ కాలనీ బూత్ నంబర్లు 329, 330, 331, 332 లకు సంబంధించిన శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్ శ్రీరామ్ నగర్ కాలనీలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గాంధీ కనీస మౌలిక వసతులు కల్పించడంలో కూడా విఫలమయ్యారని అన్నారు. భిక్షపతి యాదవ్ హయంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. పార్టీ బలోపేతం కోసం అందరూ పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏళ్లేష్ , డివిజన్ అధ్యక్షులు రాజు శెట్టి, రాష్ట్ర నాయకురాలు కాంచన కృష్ణ, అనంతరెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, రమేష్, శ్రీకాంత్‌యాదవ్, కరణ్, దుర్గా ప్రసాద్, జైపాల్, దుర్గయ్య, రాజేందర్ గుప్తా, నరసింహ పాల్గొన్నారు.

'పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి'



నవతెలంగాణ - చౌదాపూర్

చౌడపూర్ మండలం పుర్సంపల్లి గ్రామంలో నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని తహసీల్దార్ అశోక్‌కు మర్‌కు గ్రామ సర్పంచ్ వెంకటయ్య, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అశోక్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలో 60 కుటుంబాలు ఉంటే కేవలం 22 కుటుంబాలకు మాత్రమే ఇండ్లు ఉన్నాయని తెలిపారు. మిగతా వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెంటయ్య, యాదయ్య, రమేష్, నర్సింలు, బాలమ్మ, మైసమ్మ, నర్సమ్మ, మహేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీపార్వతీ పరమేశ్వరుల కళ్యాణం



- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కేశంపేట

మండల పరిధిలోని ఏక్లాస్ ఖాన్‌పేట గ్రామంలో గురువారం శ్రీపార్వతి పరమేశ్వరుల కళ్యాణం ఎంతో అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహించారు. ఎంపీపీ రవీందర్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యువ నాయకులు వై.మురళీకృష్ణయాదవ్ బిందు దం పతుల చేతుల మీదుగా కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్య అతి థులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

భీమ్ సంస్కృతిలో వివాహం



నవతెలంగాణ- కోడంగల్

కొడంగల్ మండలం కస్తూరిపల్లి గ్రామంలో భీమ్ సంస్కృతీలో గ్రేస్ వెంకట్‌ల పెళ్లి ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాల నాయకులు తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ బహదూర్, సుధాకర్, కోడంగల్ తాలూకా నియోజకవర్గ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఉషనోళ్ళ రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి గౌరగళ్ళ కృష్ణ మౌర్య, బహుజన సమాజ్ పార్టీ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు చెట్టుకింది ఈశ్వప్ప, తదితరులు నూతన వధూవరులను అభినందించారు.

నేల ఆరోగ్యంపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-తాండూర్ రూరల్

నేల ఆరోగ్యంపైన రైతులకు అవగాహన కలిగి ఉన్నప్పుడే నేలకు అనుగుణంగా పంటలు విత్తుకునే అవకాశం ఉంటుందని ఇన్‌చార్జి శాస్త్రవేత్త శేఖర్ అన్నారు. గురువారం తాండూరు మండలం బెల్కటూర్ రైతు వేదికలో రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగుపై వివరించారు. వ్యవసాయ అధికారుల సలహాలను పాటించాలని కోరారు. పూర్తి వివరాలకు 9989623818 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మదన్‌మోహన్, ఉపసర్పంచ్, రైతు బంధు కోఆర్డినేటర్ వీరన్నవ్య వసాయ అధికారి రజిత, విస్తరణ అధికారి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ధరణి లీలలు



- భూ రికార్డులు తికమక
- అధికారుల నిర్లక్ష్యం.. రియల్టర్లకు కాసుల వర్షం
- గతంలో నిరుపేదలకు పట్టాల పంపిణీ
- పేదలను మభ్యపెట్టి తక్కువ ధరకు భూముల కొనుగోళ్లు
- కోట్లు కొల్లగొడుతున్న రియల్టర్లు
- రియల్టర్లకు అండగా ప్రజాప్రతినిధులు, అధికారులు

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ధరణి తీసుకొచ్చింది. కానీ ఈ పోర్టల్ భూ సమస్యలు పరిష్కారించకపోగా.. కొత్త సమస్యలను సృష్టిస్తోంది. అధికారుల మాయజాలంతో ధరణి పోర్టల్‌లో భూ రికార్డులు తికమక అవుతు న్నాయి. దీంతో పేదలు తమ భూములనే కోల్పోయే పరిస్థితి నెలకొంది. భూ మి తమదేనా.. కాదా అనే అయోమయంలో పేదలు ఉంటే.. ఇదే అదనుగా రియల్టర్లు రంగంలోకి దిగుతున్నారు. పేదలను మభ్యపెట్టి వారి నుంచి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి కోట్లు గడిస్తున్నారు.

నవతెలంగాణ-కొత్తూరు



1954–55 ఖాస్రాలో పట్టాగా భూమి నమోదైంది. ఇదే భూమి ధరణిలోకి వచ్చేసరికి అసైన్ భూమిగా మారింది. అందులో నుంచే ప్రభుత్వం గ్రామానికి చెందిన కొంతమంది నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేసింది. అసైన్డ్ భూమిగా చెప్పడానికి సరైన ఆధారాలు లేకపోవడంతో ఆ భూములపై రియాల్టర్ల కన్ను పడింది.

విస్తీర్ణం 52 ఎకరాల 16 గుంటలు..

కొత్తూరు మండలంలోని పెంజర్ల రెవెన్యూ పరిధిలో గల సర్వేనెంబర్ 255/1 లో 20 ఎకరాలు, 255/2లో 32 ఎకరాల 16 గుంటలు మొత్తం తీర్ణం 52 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. 1954 నుంచి 2016 వరకు ఖాస్రా, పహానిలలో పట్టా గానే నమోదైంది. అందులో నుంచి రెండు ఎకరాల భూమిని 22 బి కింద 1989లో ప్రభుత్వం నమోదు చేసింది. అదే సంవత్సరం గ్రామానికి చెందిన నిరుపేదలైన 36 మందికి సుమారు 32 ఎకరాల భూమిని అసైన్ చేసింది. మిగిలిన భూములు ఇతరులు కాస్తులో ఉన్నారు. రికార్డుల పరంగా మాత్రం 1955 నుంచి 2014 వరకు పట్టా గానే ఉంది. ధరణి పోర్టల్ అనంతరం నిరుపేదలకు అసైన్ చేసిన వారి కొత్త పాస్ బుక్కులలో లావాని పట్టగా నమోదైంది. తమకు పంపిణీ పంపిణీ చేసిన భూమి పట్టానా.. లేక అసైన్డ్ భూమినా అని తెలియక బాధితులు అయోమయానికి గురవుతున్నారు.

నిరుపేదలకు పంపిణీ చేసిన భూమి ధరణి పోర్టల్ అనంతరం పాస్ బుక్కులలో లావాని పట్టాగా నమోదు కావడంతో కొంతమంది రియాల్టర్లు ఆ భూములపై కన్నేశారు. ఆ అసైన్డ్‌దారుల నుంచి తక్కువ ధరకు భూమి కొనుగోలు చేసి పట్టాగా మార్చుకునేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. రైతులు నుంచి భూమిని కొనుగోలు చేసి వారికి అడ్వాన్స్‌గా డబ్బులను ముట్టజెప్పినట్టు గ్రామస్తులు తెలిపారు. తాజాగా కొంతమంది అసైన్డ్‌దారులు తమ భూమిని పట్టా భూమిగా మార్చాలంటూ రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు అభ్యంతరాల స్వీకరణ కోసం గ్రామపంచాయతీలో నోటీసులు అంటించారు. దాంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తమ భూములకు పట్టాలు ఇవ్వాలని, అలాగే రియల్టర్ల నుంచి తమ భూములు కాపాడాలని బాధితులు కోరుతున్నారు.

అభ్యంతరాల కోసం నోటీలు అంటించాం



పెంజర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 255 లో గల సుమారు 52 ఎకరాల 16 గుంటల భూమి. 1954 నుంచి 2014 వరకు పట్టా భూమిగా ఉంది. ధరణి పోర్టల్ అనంతరం రైతుల పాసుబుక్కులలో అసైన్డ్‌గా నమోదైనట్టు గుర్తించాం. గ్రామానికి చెందిన బాధిత రైతులు పట్టా మార్పిడి కోసం దరఖాస్తు చేసుకోవడంతో అభ్యంతరాలు స్వీకరణ కోసం గ్రామపంచాయతీలో నోటీసులను అంటించాం. 255 సర్వే నెంబర్‌కు సంబంధించి ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా రికార్డులన్నింటినీ పరిశీలించి పట్టానా లేక అసైన్ భూమినా అనే విషయాన్ని వెల్లడిస్తాం.

- రాములు, తహసీలాల్దర్, కొత్తూరు.

నవతెలంగాణ 11

రంగారెడ్డి - వికారాబాద్

శుక్రవారం 17 ఫిబ్రవరి 2023

సీఎం కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

- మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లేశం



నవతెలంగాణ-బంట్వారం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన సాధకుడు, తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ ప్రతీక, మానవత్వానికి మారుపేరు సీఎం కేసీఆర్ అని మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుర్గం చెరువు మల్లేశం అన్నారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. ఇదే పట్టుదలతో సీఎం కేసీఆర్ దేశ రాజకీయాల్లోకి వెళ్తున్నారని తెలిపారు. దేశ రాజకీయాల్లో కూడా తన సత్తా చాటుతారని ఆకాంక్షించారు.







ఉద్యమకారుడు మాణిక్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించండి

- విద్యారంగాన్ని కాపాడడమే మాణిక్ రెడ్డి లక్ష్యం
- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు

సాయిలు, మండల అధ్యక్షులు భాను చైతన్య



నవతెలంగాణ- యాలాల

ఉద్యమకారుడు పాపన్నగారి మాణిక్ రెడ్డిని హైదరాబాద్- రంగారెడ్డి-మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహులు, మండల అధ్యక్షులు భాను చైతన్య అన్నారు. గురువారం మండలంలోని కోకట్, పగిడియాల్, రాస్నం, ముద్దాయి పేట్, యాలాల (బాలురు) యాలాల (బాలికలు), దేవనూర్, బెన్నూర్, అగ్గనూర్, జుంటీపల్లి పాఠశాలలో మాణిక్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడడం లక్ష్యంగా మాణిక్‌రెడ్డి పనిచేస్తారని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 106 సంఘాలు ఉండగా, అధ్యాపక, ఉపాధ్యాయ, విద్యారంగం సమస్యలపై దృష్టి సారించి ప్రభుత్వాలను ఒప్పించి, జీవోలు సాధించడంలో తమ సంఘం ముందజలో ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మదన్‌రెడ్డి, తాండూర్ మండల అధ్యక్షులు నారాయణ గౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, నాయకులు , వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్కమ్ టాక్స్‌పై అసత్య ప్రచారాలు నమ్మవద్దు

- జిల్లా ఖజానాధికారి కె. దశరథ్



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

కొందరు ఉద్యోగులు ప్రభుత్వ ఆమోదం బిల్లులను ఇన్కమ్ టాక్స్ పరిగణలోకి తీసుకోకూడదని సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం చేస్తూ ఉద్యోగులను గందరగోళానికి గురి చేస్తున్నారని అలాంటి ప్రచారాలు ఉద్యోగస్తులు నమ్మవద్దని జిల్లా ఖజానాధికారి కె.దశరథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆమోదంకు వేచి ఉన్న బిల్లులను ఇన్కమ్ టాక్స్ కోసం పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. ఈ విషయాన్ని ఉద్యోగులు అందరూ గమనించాలని ఆయన కోరారు. ఎలాంటి సందేహాలు ఉన్న తమతో నేరుగా సంప్రదించి, తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. ఇన్కమ్ టాక్స్ నిబంధన కనుగుణంగా బిల్లులు ఆడిట్ చేస్తామని పేర్కొన్నారు.

మెషిన్ లెర్నింగ్ వాడకంలో క్రిటికల్ రివర్, అక్యూర్ ఏఐ భాగస్వామ్యం

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

గ్లోబల్ డిజిటల్, టెక్నాలజీ కన్సల్టింగ్ సేవల సంస్థ క్రిటికల్‌రివర్, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్ అయిన అక్యూర్ ఏఐతో భాగస్వామ్యం ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా క్రిటికల్‌రివర్ తమ వ్యాపార ప్రక్రియలను మరింత సమర్థవంతంగా ఆటోమేట్ చేయడానికి, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్, ప్రభుత్వ రంగాలలోని పరిశ్రమలలోని కీలక సవాళ్లను పరిష్కరించేందుకు వీలు కల్పించే వేగవంతమైన ఏఐ, ఎంఎల్ ప్లాట్‌ఫారమ్ అయిన మొమెంటమ్ ఏఐతో అందించాలని లక్ష్యంగా పెట్టుకుందని నిర్వాహకులు తెలిపారు..ఈ బహుళ-సంవత్సరాల ఆవిష్కరణ భాగస్వామ్యం ఆర్థిక సేవలను మెరుగుపరచడానికి ఏఐ వినియోగాన్ని వేగవంతం చేయడం కూడా లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

కంటి వెలుగును సద్వినియోగపరుచుకోవాలి

- సర్పంచ్ గండి లక్ష్మయ్య



నవతెలంగాణ -కుల్కచర్ల

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని చాపలగూడెం గ్రామ సర్పంచ్ గండి లక్ష్మయ్య అన్నారు. గురువారం కుల్కచర్ల మండలం చాపలగూడెం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేసుకొని అవసరమైన వారు మాత్రలు, అద్దాలు, ఆపరేషన్లు చేసుకోవాలని సూచించారు. కంటి చూపు సంబంధిత వ్యాధులతో ఏ ఒక్కరు కూడా ఏ బాధపడవద్దని, తెలంగాణ ప్రజలు గర్వించదగ్గా పథకాలలో కంటి వెలుగు పథకం ఒకటన్నారు.కంటి వెలుగు పథకన్ని భారత దేశం మొత్తం కొనియాడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాదురి, పంచాయతీ కార్యదర్శి రవి, వార్డ్ సభ్యులు సత్తయ్య, లక్ష్మి, అమృతమ్మ, అంగన్‌వాడీ టీచర్ విరమణి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానం

- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కోటాజి



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2023-24 విద్య సంవత్సరానికి ఆశ్రమ ఉన్నత పాఠశాల బోయిన్‌పల్లి నందు వాటర్ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించినట్టు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కోటాజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాయకింగ్, కినోయింగ్, సెయిలింగ్ మొదలైన వాటర్ స్పోర్ట్స్ నందు గిరిజన బాల బాలికలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 30మీ ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటి, టెస్ట్ 800మీ. పరుగు పందెం పోటీలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా 5వ తరగతి లో ఇంగ్లీష్ మీడియంలో 10 మంది బాలికలకు, 10 బాలురకు ప్రవేశాలు కల్పిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 8464006 666 ను సంప్రదించాలని సూచించారు.

నిబద్ధత, నిజాయితీ ఉన్న మాణిక్‌రెడ్డిని గెలిపించండి





- విద్యారంగం అభివృద్ధే ప్రధాన లక్ష్యం
- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావ రవి

నవతెలంగాణ-కొడంగల్

నిబద్ధత, నిజాయితీ ఉన్న నాయకుడు పాపన్నగారి మాణిక్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావ రవి అన్నారు. గురువారం కోడంగల్, దౌల్తాబాద్ మండలాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల, ఉపాధ్యాయ సమస్యల పట్ల అవగాహన ఉన్న వారిని ఎన్నుకుంటే సమస్యలపై అవగాహన ఉంటుందన్నారు. అసెంబ్లీలో ప్రశ్నించే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత కూడా ఏ ఒక సమస్య పరిష్కారం కాలేదన్నారు. వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలకేషన్ పేరుతో ఖాళీలను అలాగే ఉంచి ఉపాధ్యాయులను మెడబట్టి గెంటివేసినట్టు చేశారన్నారు. 317 జీవో రావడానికి కారణం ఏ ఉపాధ్యాయ సంఘంతో మాట్లాడి జీవో తీసుకువచ్చారని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆ సంఘం వారిని ప్రశ్నించాలన్నారు. జిల్లాల విభజన తర్వాత ఉపాధ్యాయులు ఏ విధంగా ఉండాలో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ఇచ్చామన్నారు. 317 జీవో వ్యతిరేకిస్తూ సచివాలయం ముట్టడిస్తే కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు, ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న తర్వాత ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఏ విధంగా దొరుకుతుందన్నారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు బలంగా ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఇంక్రిమెంట్, పే స్కేల్ సాధించామంటే గతంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట ఫలితమే అన్నారు. స్థానికులకు స్థానికంగా అవకాశం కల్పించాలని పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఉపాధ్యాయ సమస్యలపై మాట్లాడుతున్నారని అన్నారు. మిగతా ఇద్దరు ఎమ్మెల్సీలు ఉపాధ్యాయ సమస్యలపై ఎందుకు మాట్లాడడం లేదో ఆలోచించాలన్నారు. 317 బాధితులకు ఏం న్యాయం చేశారని జీవో అమలు చేసిన రోజు ప్రభుత్వంతో కూర్చుని చర్చించిన ఉపాధ్యాయ సంఘాన్ని ప్రశ్నించాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై పనిచేసి వారికి ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరారు, ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాములు, మండల అధ్యక్షులు బసప్ప, కార్యదర్శి అశోక్, బొంరాస్‌పేట్ కార్యదర్శి గోపాల్, జిల్లా కార్యదర్శి మల్లేష్, సభ్యులు నర్సింగ్, అంజినాయక్, భీమ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రాజెక్టుపై సీఎస్ సమీక్ష



- డబుల్‌బెడ్రూం, పోడు పట్టాల సమస్యలను పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీసీ

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కంటివెలుగు, డబుల్ బెడ్రూం, పోడు పట్టాలు, తెలంగాణకు హరితహారంపై జిల్లా కలెక్టర్లతో ఆమె వీసీ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు లక్ష 90 వేల 579 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు వివరించారు. 36,372 మందికి రీడింగ్ కండ్ల అద్దాలు అందించినట్టు తెలిపారు. 31,777 ప్రిస్క్రిప్షన్ అద్దాలకు ఆర్డర్ ఇచ్చామని చెప్పారు. జిల్లాలో డబుల్ బెడ్రూం ఇండ్లకు 8,979 దరఖాస్తులు అందాయని, ఇందులో 3,086 మంది అర్హత కలిగి ఉన్నారని తెలిపారు. 2,341 డబుల్ బెడ్రూం ఇండ్లు పూర్తి అయి లబ్దిదారులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. హరితహారంలో భాగంగా వచ్చే ఏడాది నాటే మొక్కలను నర్సరీలలో పెంచుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో నాటిన మొక్కలను సంరక్షిస్తున్నామని తెలిపారు. మార్చి 31వ తేదీ వరకు జిల్లాలో పన్నులు వంద శాతం వసూలు చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు తిరుపతి రావు, ప్రతీక్ జైన్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం



- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్

నవతెలంగాణ-రాజేంద్రనగర్

తెలంగాణ రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్ అన్నారు. హైదర్‌గూడ సెక్టార్‌కు సంబంధించిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్, టీఆర్ఎస్ కె.వి యూనియన్ నుంచి సీఐటీయూలో చేరారు. గండిపేట అధ్యక్షురాలు సుధారాణి, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్ర కుమార్, కమిటీ సభ్యులు జి కురుమయ్య. రాజేంద్రనగర్ మండల కన్వీనర్ జి గట్టయ్య ఆధ్వర్యంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలనికొంతకాలంగా శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ ఆఫీసులో మహిళలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని అన్నారు. ఈ విషయమై గతంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కి దృష్టికి తీసుకెళ్లినా ఇక్కడ మౌలిక సదుపాయాలు కల్పించలేదని తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో చాలా అంగన్‌వాడీలు అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని చెప్పారు. వెంటనే శాశ్వత భవనాలు నిర్మాణా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం హైదర్‌గూడ అంగన్‌వాడీ వర్కర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఇందిరా, కార్యదర్శిగా షమీంబేగం, కోశాధికారిగా అనితలను ఎన్నుకున్నారు.

సీఎం కేసీఆర్ మోసగాళ్లకే మోసగాడు

- బీఆర్ఎస్ గడీలు బద్దలు కొట్టేది బీజేపీ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



నవతెలంగాణ-పరిగి

సీఎం కేసీఆర్ మోసగాళ్లకే మోసగాడని ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. గురువారం పరిగి మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్ గ్రామంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగి పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయం ముందు ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల్ని, రైతులను మోసం చేశారని అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ అన్నాడు కానీ గ్రామంలో ఎప్పుడు కరెంటు పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని చెప్పి నేటికీ పనులు ప్రారంభించలేదని అన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని, ఏకకాలంలో రుణమాఫీ, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తానని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని, రైతులకు ఉచితంగా యూరియా ఇస్తానని ఇలా ఎన్నో వాగ్దానాలు చేసి ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కుటుంబ పార్టీగా మారి రాష్ట్రాన్ని దోచుకు తింటున్నారని మండిపడ్డారు. ఇక్కడ చెల్లని రూపాయి ఎక్కడ చెల్లదని ఎద్దేవా చేశారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. కేంద్రం నుంచి అభివృద్ధి ఫలాలు ఇస్తానంటే సీఎం కేసీఆర్ సహకరించడం లేదని అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కేంద్రం చేసిందేనని గుర్తు చేశారు. పరిగి ప్రాంతాల్లో సరైన రోడ్లు లేవని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు తెలుసుకోవడానికి ప్రజా గోస- బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 11వేల సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే 1,900 సమావేశాలు పూర్తి అయ్యాయని తెలిపారు. బీఆర్ఎస్‌కి గడి బద్దలు కొట్టేది బీజేపీ అని అన్నారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేసి సీఎం అయ్యాడని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణంలో డబ్బులు కుమ్మరించి కల్వకుంట్ల కుటుంబం దోచుకుందని అన్నారు. దేశం బాగుపడాలంటే రాష్ట్రం గ్రామాలు బాగుపడాలని నరేంద్ర మోడీ గ్రామాల అభివృద్ధికి డబ్బులు ఇస్తే వాటిని సీఎం కేసీఆర్ దొంగతనం చేశాడని విమర్శించారు. బీజేపీ నాయకుల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాజీ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నో వాగ్దానాలు చేసి ప్రజలను మభ్య పెట్టారని అన్నారు. దళిత బంధు ఇస్తానని చెప్పి ప్రజలకు ఇవ్వకుండా మభ్యపెడుతు న్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, పరిగి నియోజకవర్గ నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్, రూప్‌ఖాన్‌పెట్ సర్పంచ్ నర్సింలు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్, జిల్లా కార్యదర్శి పెంటయ్య, ఉపాధ్యక్షుడు రామచందర్, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, రూప్‌ఖాన్‌పెట్ శక్తి కేంద్రం ఇన్‌చార్జి శ్యాంసుందర్, పోలింగ్ బూత్ అధ్యక్షులు శ్రీనివాస్, యాదయ్య, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కమనీయం



- పాల్గొన్న ప్రజాప్రతినిధులు




నవతెలంగాణ-తలకొండపల్లి

తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో వేదాద్రి గుట్టపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణోత్సవానికి ఆలయ నిర్వాహకులు విశాల వసతులు, భక్తుల సౌకర్యం చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా స్వామివారికి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తుంటారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవానికి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు పుష్పలతో, పచ్చటి తోరణాలతో అందంగా అలంకరించారు. లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు ధరించి మంటపానికి తీసుకొచ్చారు. వేద పండితులు మంత్రోచ్చరణలతో మంగళ వాయిద్యాలతో ఆలయ ధర్మకర్త ,శ్రీనివాసమూర్తి, నరసింహ శాస్త్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సర్పంచ్ సంగీత శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. ఈ కల్యాణోత్సవానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, జడ్పీ చైర్మన్ తీగల అనిత రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, తలకొండపల్లి జడ్పిటిసి ఉప్పల వెంకటేష్, ఎంపీపీ నిర్మల, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం, జడ్పీ కోప్షన్ ముజుబుర్రహ్మాన్, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, వైసీపీ తాలూకా ఇన్‌చార్జి చీమర్ల అర్జున్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ ఆలయాన్ని అభివృద్ధి చేసినట్టు తెలిపారు. రూ.30లక్షలు ఇచ్చినట్టు తెలిపారు. అనంతరం జడ్పీ చైర్మన్ తీగల అనితా రెడ్డి మాట్లాడుతూ జడ్పీ నిదుల నుంచి దేవాలయ అభివృద్ధికి సహకరిస్తానని అన్నారు. జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి తనవంతుగా రూ.ఐదు లక్షలు, జడ్పీటీసీలు నిధులు రూ.ఐదు లక్షలు అందజేసినట్టు తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవెందర్‌రెడ్డి మాట్లాడుతూ కల్యాణానికి హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులను ఘనంగా సన్మానించారు. శతాబ్ది టౌన్‌షిప్ అధినేత శ్రీనివాస్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగీత శ్రీనివాస్‌యాదవ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ అంబాజీ, సింగల్ విండో వైస్ చైర్మన్ కూన రవికుమార్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, ఖానాపూర్ ఎంపీటీసీ గార్లపాటి సరిత గణేష్ గుప్తా, చౌదర్ పల్లి సర్పంచ్ చంద్రయ్య, ఉపసర్పంచ్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.





కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నేతలు



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

బీఆర్ఎస్‌కు చెందిన మంకాల దాసు, ఉద్యమ నాయకులు బోసుపల్లి వీరేశ్ కారును వీడి కాంగ్రెస్‌లో చేరారు. వారికి మల్‌రెడ్డి రంగారెడ్డి పార్టీ శాలువాలు కప్పి ఆహ్వానించారు. అంతక ముందు ఇబ్రహీంపట్నం చౌరస్తాలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి అనంతరం హయత్‌నగర్ మండలం పరిధిలోని కుంట్లూరుకు ర్యాలీగా బయలుదేరారు. రంగారెడ్డి స్వగృహంలో పార్టీలో చేరారు. బోసుపల్లి వీరేశ్ ఇబ్రహీంపట్నం మండలం బీఆర్ఎస్ అధ్యక్షులుగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమ కాలంలోనూ క్రియాశీలక పాత్ర పోషించారు. ఎవరూ లేని సమయంలోనూ తెలంగాణ నాదాన్ని ప్రజల్లోకి తీసుకుపోయారు. కాగా కొంతకాలంగా ఆయనకు పార్టీలో సముచిత స్థానం లభించకపోవడంతో ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్నారు. కాగా ఇటీవల తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు జరుగుతున్న అన్యాయాన్ని సైతం వెలిగెత్తి చాటారు. కాగా మంకాల దాసు గత శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. 2018 శాసనసభ ఎన్నికల్లో క్యామ మల్లేష్ కాంగ్రెస్‌ని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. క్యామ మల్లేష్ అనుచరుడిగా ముద్రపడిన మంకాల దాసు సైతం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. గత మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీపీ, జడ్పీటీసీ పదవులను ఆశించారు. కానీ బీఆర్ఎస్ అధిష్టానం ఆయనకు మార్కెట్ కమిటీ ఆశ చూపి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించలేదు. సరికదా మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్నిక విషయంలోనూ చివరి వరకు మంకాల దాసే చైర్మన్ అభ్యర్థిగా నియమించే అవకాశాలు ఉన్నాయని, దాదాపు ఖరారు అయినట్లు ప్రచారం కూడా సాగింది. కానీ సుదీర్ఘకాలం తర్వాత మంఖాల దాసుకు బీఆర్ఎస్ అధిష్టానం చేయి ఇవ్వడంతో ఇటీవల ఆయన పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలోనూ ఆయన భాగస్వాములు కాలేదు. చివరకు తన అనుచరులతో కలిసి మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ చేరిక సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆయన కుమారుడు బంటిపై పలు ఆరోపణలు చేశారు.

PUBLIC NOTICE

The General public is hereby informed that our clinet Shriram Finance Limited Vanasthalipuram Branch, Hyderabad Dist is dealing with financing business in the course of business **Mr. Mohammed Fareed, S/o. Mohammed Hussain,** approached our client for finance and accepted to deposit his title deeds in respet of his property **i.e. All that the part and parcel of Open Plot, admeasuring 186 Sq-yards, in Survey No.617, Situated at Kandukur Revenue Village, under Kothaguda Grampanchayat, Kandukur Mandal, Ranga Reddy District and Bounded as follows**:- NORTH:House of K.Narayana,SOUTH: 24-0 Wide Road, EAST:House of Bokka Agi Reddy, WEST:House of Bokka Bhupal Reddy and others

towards security for the loan availed by him. If any person or persons having any claim, right, title or interest in the above said property may approach the undersigned within 7 days from the date of this publication or else our clinet will proceed with the transaction.

S.Srinivas RAO
A.Supriya,Advocate,
H.No.2-19-79/A/10/A,Balaji Enclave Extn,
East Kalyanpur, Uppal,Hyderabad- 39
Cell: 9948104019

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE : R.R.DIST
AT: CHEVELLA
I.A.NO.65 OF 2023
IN
O.S.NO.133 OF 2008

Between:-
Katika Ambika Bai & others
....Petitioners/Plaintiffs
AND
Katika Bandoji & others
.... Respondents/Defendants

To.
1. Smt. Shankaramma w/o. Late Vollur Jangaiah, aged about 79 years,
2. V.Venkatesh S/o. Late Vollur Jangaiah, aged about 52 years,
3. V. Beerappa S/o. Late Vollur Jangaiah, aged about 42 years,
4. V. Mallesh S/o. Late Vollur Jangaiah, aged about 39 years,
5. V. Laxmaiah S/o. Late Vollur Jangaiah, aged about 37 years,
6. V. Ramesh S/o. Late Vollur Jangaiah, aged about 30 years,
7. Anitha D/o Late V. Jangaiah, aged about 46 years,

All are R/o Manchirevula Village, Gandipet Mandal, Rangareddy District, T.S.75

Dear Sir, Madam,

Please take notice that the above petition/suit is posted to 23-02-2023 for your appearance. You are hereby summoned to appear before the above Hon'ble Court on 23-02-2023 by 10-30 A.M. in person or through an Advocate to answer the claim, failing which the matter will be heard and decided in your absence.

//BY ORDER OF THE HON'BLE COURT//

D.SANGAPPA
Advocate (B.Sc, L.LB)
Plot No.61&62, Flat No.102,
Saibalaji Residency
N.F.C Colony, Bandlaguda Jagir
Gandipet (M), R.R.Dist-86
Cell : 9666135775

పోడుపై ఆదివాసీల ఉద్యమానికి మద్దతు

తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్

నవతెలంగాణ - హైదరాబాద్

పోడు భూములపై హక్కు పత్రాలు ఇవ్వాలని ఆదివాసీలు చేపట్టిన ఉద్యమానికి తమ పార్టీ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ చెప్పారు. ఈ విషయంలో అనవసర జాప్యం జరగకుండా ఆదివాసీలకు తక్షణమే న్యాయం చేయాల్సిన భాద్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వ్యాఖ్యానించారు.



గురువారం ఎన్టీఆర్ భవన్లో తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నాయకులు కాసానితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పోడు సాగు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలనీ, అటవీ సంరక్షణ నియమాలు - 2022ను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలనే డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 20వ ఆందోళన చేయనున్నట్టు తెలిపారు. దీనికోసం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని కాసానిని ఆహ్వానించారు. ఈ భేటీ సందర్భంగా కమిటీ సభ్యులు పోడు భూములకు సంబంధించి ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు.

ఇందుకు కాసాని స్పందిస్తూ అనాదిగా అడవులను నమ్ముకుని జీవిస్తున్న అర్హులైన ఆదివాసీలకు పోడు భూములపై హక్కు పత్రాలను తక్షణమే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడు భూములకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్న దానికి భిన్నంగా క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్నాయని వివరించారు.

ఆడివాసీలకు చట్టంలో పెట్టిన 14 హక్కులు పదహారు సంవత్సరాలుగా తెలంగాణతో సహా దేశంలో ఎక్కడా అమలు కాకపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2006 చట్టం ద్వారా డిసెంబర్ 13, 2005 వరకు పోడు భూములపై ఉన్న ఆదివాసీలకు చట్టబద్ధ హక్కు లభించిందనీ, ఆ మేరకు వెంటనే అర్హులైన ఆదివాసీలకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్లు వేముల వెంకట్రామయ్య, తెలుగుదేశం జాతీయ అధికార ప్రతినిధి ప్రొ. తిరునగరి జ్యోత్స్న, రాష్ట్ర నాయకులు అట్లూరి సుబ్బారావు, మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేష్, నాయకులు షేక్ ఆరిఫ్, యానాల అనంతరెడ్డి, పోలంపల్లి అశోక్, మెట్టుకాని శ్రీనివాస్, కసిరెడ్డి శేఖర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మీకు లిక్కర్ పాలసే కరెక్టు : కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆప్, బీఆర్ఎస్లకు ఇరిగేషన్ పాలసీ కాదు లిక్కర్ పాలసీనే కరెక్టు అని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. గురువారం హైదరాబాద్లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పంజాబ్ సీఎం భగవంత్ మాన్ పర్యటన కేసీఆర్ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికేనని విమర్శించారు. వారిద్దరు ఒకరినొకరు పొగుడుకోవటం కోసం క్విడ్ ప్రో కో చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ద్వారా జాతీయ రాజకీయాలు నడుపుతా అని కేసీఆర్ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో మద్యానికి దూరంగా ఉన్న ప్రజలకు ఇంటిఇంటికీ మద్యం ఏరులై పారేలా ఆప్ సర్కారు చేసిందని విమర్శించారు. భగవంత్మాన్కు మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ నిర్వాసితులను, పడావుబడ్డ డబుల్బెడ్ రూమ్ ఇండ్లను చూపిస్తే బాగుండేదని సూచించారు.

ఉద్యోగ అవకాశం

ప్రముఖ తెలుగు దినపత్రిక నవతెలంగాణ అడ్వటైజ్మెంట్ విభాగంలో పనిచేయుటకు ట్రాన్స్లేటర్లు (ఇంగ్లీషు నుండి తెలుగు అనువాదకులు) కావలెను. ఆకర్షణీయమైన వేతనం + ఇతర అలవెన్సులు ఉంటాయి. ఆసక్తి గల అభ్యర్థులు వెంటనే ఈ క్రింది ఫోన్ నెంబర్ల పై లేదా క్రింది చిరునామాలో నేరుగా సంప్రదించగలరు.

నవతెలంగాణ
యం.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్టీసి కళ్యాణమండపం, బాగ్లింగంపల్లి, హైదరాబాద్-500020.
ఫోన్: 9490099090, 9490099054









Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815